ఆదివారం
2-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 160
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లెట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి : 94405 73343

ఖనిజ అక్రమ తవ్వకాలపై
ఉక్కుపాదం

- ప్రభుత్వ పనులకు టీజీఎండీసీ నుంచే ఇసుక సరఫరా
- మైనర్ మినరల్స్ బ్లాక్‌ల వేలానికి టెండర్లు
- అధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇసుకతో పాటు ఖనిజాల అక్రమ తవ్వకాలు, అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమని, ప్రభుత్వానికి ఆదాయం పెంచగలమన్నారు. గనుల శాఖపై శనివారం ఐసీసీసీలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. తొలుత నెల రోజులుగా తీసుకున్న చర్యలతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిన విధానాన్ని, పెరిగిన ఆదాయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, రవాణా, వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరాపై అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు. నీటి పారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల అధ్వర్యంలో చేపట్టే పనులకు టీజీఎండీసీ నుంచే ఇసుక సరఫరా చేసేలా చూడాలన్నారు. భారీ నిర్మాణ రంగ సంస్థలకు అవసరమైన ఇసుకను టీజీఎండీసీ ద్వారానే సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీప ప్రాంతాల్లోనే ఇసుక ఎక్కువగా వినియోగం జరుగుతోందన్నారు. తక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన వారు కొనుగోలు చేసేలా నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. గనుల శాఖ పరిధిలోని వివిధ ఖనిజాల క్వారీలకు గతంలో విధించిన జరిమానాలు, వాటి వసూళ్లపైనా సీఎం అధికారులను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన విధానపరమైన నిర్ణయం త్వరగా తీసుకొని సమస్యను పరిష్కరించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మైనర్ ఖనిజాల బ్లాక్‌ల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలని అన్నారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టీజీఎండీసీ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ కె.శశాంక, గనులశాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్, టీజీఎండీసీ ఎండీ సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

పోలీస్ స్కూల్ బ్రోచర్ ... వెబ్‌సైట్ ఆవిష్కరణ

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ బ్రోచర్, వెబ్‌సైట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. స్కూల్ యూనిఫామ్ నమూనాలను పరిశీలించారు. సైనిక్ స్కూల్ తరహాలో పోలీస్ స్కూల్ కూడా దేశానికే రోల్ మోడల్ గా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా విధానంలో కొత్త ఒరవడిని అవలంభించాలని పేర్కొన్నారు. స్పోర్ట్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పోలీస్ అమరుల కుటుంబాల పిల్లలకు అడ్మిషన్లలో మొదటి ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇక మండే ఎండలే!

మార్చి-మేలో 44 నుంచి 46 డిగ్రీల వరకు నమోదు

124 ఏళ్లలో ఈ ఫిబ్రవరిలోనే అధిక ఉష్ణోగ్రత

న్యూఢిల్లీ: రానున్న రోజులలో ఎండలు మాడ్చేయనున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత సాధారణం కంటే అధికంగా ఉంటుందని... వడగాడ్పులు కూడా తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఏప్రిల్, మే నెల వచ్చేసరికి 44 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 124 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఫిబ్రవరి నెలలో భారత్‌లో అత్యంత ఉష్ణోగ్రత నమోదయిందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. 22 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ సగటు ఉష్ణోగ్రత నమోదయిందని అధికారిక డేటా పేర్కొంది. ఫిబ్రవరిలో సగటు ఉష్ణోగ్రత 20.70 డిగ్రీల సెల్సియస్ నుంచి 22.04 డిగ్రీల సెల్సియస్‌కు 1.34 డిగ్రీల సెల్సియస్ పెరిగిందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దేశంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 1.49 డిగ్రీల సెల్సియస్ పెరిగి, సాధారణ 27.58 డిగ్రీల సెల్సియస్‌తో పోలిస్తే 29.07 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుందని పేర్కొంది. అదనంగా ఫిబ్రవరిలో సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 15.02 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. ఇది సాధారణ 13.82 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ. ఫిబ్రవరిలో ఉత్తర, వాయువ్య భారతదేశంలో రాత్రి వేళల్లో వేడి అధికంగా నమోదయింది. శుక్రవారం విడుదల చేసిన వేసవి కాల సూచనలో మార్చి నుంచి మే వరకు భారతదేశంలోని చాలా ప్రాంతాలలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని ఐఎండీ అంచనా వేసింది. జమ్మూ, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, రాజస్తాన్, ఉత్తర ప్రదేశ్, సెంట్రల్ ఎంపీ, చత్తీస్‌గఢ్, కోస్తా, ఉత్తర, తూర్పు మహారాష్ట్ర, గోవా, కోస్టల్ కర్నాటకలోని మైదాన ప్రాంతాలు ఈ కాలంలో అధిక

- మిగతా 2 లో

'ఆయిల్ పామ్' లాభసాటే లక్ష్యం

ప్రోత్సాహానికి రూ.50 వేల రాయితీ: మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్ : వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పంట మార్పిడి ఆవశ్యకత, వంట నూనెలను డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని ఆయిల్ పామ్ సాగును రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. గత ఏడాది టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.13,135 ఉండగా నేడు రూ.20,871 పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆయిల్ పామ్ సాగును రైతులకు లాభసాటి చేయటమే ప్రభుత్వ లక్ష్యం అని

- మిగతా 2 లో

గ్రీస్‌కు సీపీఐ సంఘీభావం

న్యూఢిల్లీ: ప్రజల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గ్రీస్ ప్రభుత్వానికి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సూచించారు. టెంపే రైలు దుర్ఘటనకు రెండేళ్లు అయిన సందర్భంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా ప్రజలకు భద్రత కల్పించాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. రైలు ప్రమాదంలో విద్యార్థులతో సహా 57 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పట్టిందని గ్రీస్ ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫిబ్రవరి

- మిగతా 2 లో

8 నుంచి స్వేచ్ఛగా తిరగొచ్చు : అమిత్‌షా

న్యూఢిల్లీ: మణిపూర్‌లో అన్ని మార్గాల్లో మార్చి 8వ తేదీ నుంచి స్వేచ్ఛగా రాకపోకలు సాగించవచ్చని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. రహదారులను దిగ్బంధిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు అధికారులకు ఆయన ఆదేశాలిచ్చారు. 2023 మే నుంచి కుకీ, మయితే వర్గీయుల మధ్య ఘర్షణతో అట్టుడికిపోతున్న మణిపూర్‌లో శాంతి భద్రతల పరిస్థితిపై అమిత్‌షా శనివారం దిల్లీలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రపతి పాలన

- మిగతా 2 లో

డ్రగ్స్‌పై పంజాబ్ ఉక్కుపాదం

న్యూఢిల్లీ: మాదక ద్రవ్యాల నియంత్రణకు పంజాబ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 12వేల మంది పోలీసులు శనివారం 750 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎనిమిది కిలోలకుపైగా హెరాయిన్, 16 వేలకుపైగా మత్తు మాత్రలు, గంజాయి ఇతరత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. 232 కేసులు నమోదు చేసి, 290 మంది స్మగ్లర్లను అరెస్టు చేశామన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యంగా ప్రభుత్వం

- మిగతా 2 లో

మల్టీప్లెక్స్‌లకు ఊరట

ఉత్తర్వులను సవరించిన హైకోర్టు

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో మల్టీప్లెక్స్‌లకు హైకోర్టులో ఊరట లభించింది. 16 సంవత్సరాలలోపు చిన్నారులను అన్ని షోలకు అనుమతించాలని న్యాయస్థానం ఆదేశించింది. అయితే ప్రీమియర్, బెనిఫిట్ షోలకు మాత్రం పిల్లల అనుమతికి నిరాకరించింది. జనవరి 21న 16 ఏళ్ల లోపు పిల్లలు మల్టీప్లెక్స్ థియేటర్‌కు వెళ్లే విషయంపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. రాత్రి 11 నుంచి ఉదయం 11 గంటల వరకు 16 సంవత్సరాల లోపు చిన్నారులు వెళ్లకూడదు అని ఉత్తర్వులు ఇచ్చింది. పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారించిన హైకోర్టు పలు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించాలని ధర్మాసనం కోరింది. అయితే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై మల్టీప్లెక్స్ యాజమాన్యం పోరాడుతోంది. బెనిఫిట్ షో, స్పెషల్ షోలకు అనుమతులు ఇవ్వకపోయినప్పటికీ తాజాగా 16 ఏళ్లలోపు చిన్నారులను అనుమతించే విషయంలో ఉత్తర్వులను హైకోర్టు సవరణ చేసింది. 16 ఏళ్ల చిన్నారులు థియేటర్‌లోకి వెళ్లే విషయంలో నిబంధనలు విధిస్తే... సినిమా వసూళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్ సినిమాకు వెళ్లే సమయంలో కుటుంబం మొత్తం వెళుంటారు. ఈ క్రమంలో నిబంధనలు ఉంటే ఫ్యామిలీ వెళ్లే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో ఇతర వర్గాల అభిప్రాయాల సేకరించి కోర్టుకు సమర్పించడంతో న్యాయస్థానం జనవరి 21న ఇచ్చిన ఉత్తర్వులను సవరించింది. అలాగే స్పెషల్ షోలు, బెనిఫిట్ షోలకు ఎట్టిపరిస్థితిల్లో పర్మిషన్ ఇవ్వబోమని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. ఇదే అంశాన్ని కూడా హైకోర్టు ప్రస్తావిస్తూ తదుపరి విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది.

ఏపీ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో ఇంటర్‌మీడియట్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల వద్దకు ఉదయం 8 గంటలకే చేరుకున్నారు. దీంతో వాహనాల రాకపోకలతో పరీక్షా కేంద్రాల సమీపంలో రద్దీ హడావుడి కనిపించింది. ఈ నెల 17వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఇంటర్ విద్యార్థుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1500 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 10,58,893 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో ప్రథమ

- మిగతా 2 లో

మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట

- వనితల విజయాలను ప్రపంచానికి చాటిచెప్పాలి
- మహిళా దినోత్సవంనాడు మరిన్ని పథకాలు: సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఆర్థిక రంగంలో తెలంగాణ గ్రామీణ మహిళలు సాధించిన విజయాలను ప్రపంచానికి చాటిచెప్పాలని సూచించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్న నేపథ్యంలో మంత్రి శనివారం అధికారులతో సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెలా గద్దర్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన, స్పెషల్ కమిషనర్ బీ షఫీ ఉల్లా, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీతో మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణ, మహిళా సాధికారత కోసం కొత్తగా చేపట్టనబోయే కార్యక్రమాలపై చర్చించారు. మహిళా సాధికారతకు, ఆర్థిక స్వావలంబనకు సీఎం రేవంత్ రెడ్డి పెద్ద పీట వేస్తున్న నేపథ్యంలో దాని గొప్పదనాన్ని చాటిచెప్పేలా కార్యక్రమాలు రూపొందించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కొత్త పథకాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. ప్రతి జిల్లాలో మహిళా సంఘాలచే ఏర్పాటు చేయబోయే సోలార్ విద్యుత్ ప్లాంట్లకు సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. జిల్లాకు 2 మేగావాట్ల చొప్పున 32 జిల్లాల్లో మొత్తం 64 మేగావాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. మహిళా స్వయం సహాయక బృందాలచే బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా ఒప్పందాలు కుదిరాయి. మొదటి విడతలో 50 బస్సులకు పచ్చా జెండా ఊపి సీఎం చేతుల మీదుగా ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో మహిళా సంఘాలు ప్రారంభించిన పెట్రోల్ బంక్ తరహాలోనే మిగిలిన 31 జిల్లాల్లోనూ పెట్రోల్ బంకులు ప్రారంభించేలా బీపీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్ వంటి అయిల్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుంది. వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళా సంఘాలకు అందచేయనున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన 400 మంది మహిళా సంఘ సభ్యులకు రూ.40 కోట్ల బీమా చెక్కులను అందజేస్తారు. 14 వేలకు పైగా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నియామకాల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఇందిరా మహిళా శక్తి-2025 విధానాన్ని విడుదల చేయనున్నారు. మహిళలకు సబ్సిడీపై ఆటోలు, సెర్ప్, మెప్మాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. వివిధ రాష్ట్రాల్లో మహిళా సంక్షేమం కోసం అవలంభిస్తున్న విధి విధానాలను అధ్యయనం చేసి, దేశంలోకెల్లా అత్యుత్తమ మహిళా సాధికారత విధానాన్ని రూపొందించాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

అమెరికా-ఉక్రెయిన్ చర్చలు రసాభాస

2లో

ఇదీ లోకం!

మంచిదే గదండీ.. ఆళ్ల డబ్బులు ఆళ్ల దగ్గరే వుండిపోతాయి!

8 మంది జాడ కోసం అన్వేషణ

మంత్రి జూపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎస్ఎల్‌బీసీ సొరంగంలో శిథిలాల తొలగింపు, డీ వాటరింగ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యలపై శనివారం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి

- మిగతా 2 లో

ఏడాదిలోనే రూ.1.50 లక్షల కోట్ల అప్పు

- మంచిపని లేదు గనుకే మైక్‌లో చెప్పడంలేదు
- రైతు భరోసా లేదు... ఆడబిడ్డలకు తులం బంగారమూ లేదు
- రేవంత్‌ది బ్యాగ్‌లు మోసే సంస్కృతి
- కేసీఆర్ సీఎం అయితేనే తెలంగాణకు అగ్రస్థానం : కేటీఆర్

2లో

బీజేపీకి కొత్త అధ్యక్షురాలు?

రేసులో పురందేశ్వరి... వానతి శ్రీనివాసన్

దక్షిణాదిలో పాగాకు ఆర్ఎస్ఎస్ మార్గదర్శకం...

న్యూఢిల్లీ : బీజేపీ కొత్త అధ్యక్షుని నియామకానికి కసరత్తు చేస్తోంది. 13 రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు పూర్తయిన తర్వాత ఈ నెల మధ్యలో కాషాయ పార్టీ తన కొత్త జాతీయ అధ్యక్షునిని ప్రకటించే అవకాశం ఉంది. బహుశా ఈనెల 15 లేదా 16 తేదీలలో జేపీ నడ్డా వారసుని ఎంపిక ప్రక్రియ అంతర్గత ఏకాభిప్రాయం ద్వారా మార్గనిర్దేశం చేయడం జరుగుతుందని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. దక్షిణ భారతదేశంలో తన ఉనికిని బలోపేతం చేయడానికి ఆ ప్రాంతం నుంచి ఒక

- మిగతా 2 లో

ప్రజల గొంతుక ప్రజానాట్య మండలి

రచయితలకు, కళాకారులకు రాజకీయాలతో సంబంధం లేదని వాదించే వారికి ఈ నాటికీ కొదవ లేదు. వారికీ నిర్దిష్టమైన రాజకీయ సిద్ధాంతం ఉండాలని నిరూపించింది కమ్యూనిస్టు పార్టీ. 1936లో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘానికి అంకురార్పణ జరిగింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

అమెరికా-ఉక్రెయిన్ చర్చలు రసాభాస

- మీడియా ఎదుటే ఇద్దరు అధినేతల మధ్య మాటల యుద్ధం
- కృతజ్ఞత లేదా... ట్రంప్ మండిపాటు
- చెప్పేది కాస్త వినండి: జెలెన్‌స్కీ

వాషింగ్టన్: అమెరికా, ఉక్రెయిన్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, వొలొదిమిర్ జెలెన్‌స్కీ మధ్య సమావేశం రసాభాస అయింది. ఓవల్ కార్యాలయంలో మీడియా ఎదుటే ఇద్దరు అధినేతలు వాగ్వాదానికి దిగారు. నాయకుల మాటల యుద్ధం క్రమంలో జనాంతిక సమావేశం బహిర్గతమైనట్లు సర్వత్రా విమర్శలు వచ్చాయి. వాడీవేడి చర్చతో ఉక్రెయిన్ రాయబారి ఒక్సానా మార్కరోవా ఆందోళనకు గురయ్యారు. మొదట చర్చ సజావుగానే సాగింది కానీ మాటా మాటా పెరిగింది. జెలెన్‌స్కీ కాల్పుల విరమణకు అంగీకరించడం లేదని ట్రంప్ ఆక్షేపించారు. అదేమీ కాదు నాది శాంతి పక్షమని జెలెన్‌స్కీ వాదించారు. మీ వైఖరి మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీయొచ్చు అంటూ ట్రంప్ వేలెత్తి చూపారు. దీనికి జెలెన్‌స్కీ కూడా దీటుగానే స్పందించారు. చెప్పేది వినాలని కోరారు. కానీ ట్రంప్ ఆగ్రహానికి గురి కావడంతో రెండు దేశాల రాయబారులు తలలు పట్టుకున్నారు. రష్యాతో యుద్ధానికి అందించిన సహాయానికి బదులుగా ఉక్రెయిన్‌లోని ఖనిజ సంపదను పొందాలని ట్రంప్ భావిస్తున్నారు. ఇందుకోసం ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెస్తున్నారు. నాటో సభ్యత్వాన్ని మర్చిపోమన్నారు. రష్యా మళ్లీ తమ మీదకు రాకుండా రక్షణ కల్పించాలని జెలెన్‌స్కీ కోరుతున్నా పట్టించుకోవడంలేదు. కృతజ్ఞత లేకుండా ఇలా మాట్లాడతారా అంటూ జెలెన్‌స్కీపై ట్రంప్ మండిపడ్డారు. జెలెన్‌స్కీ కూడా వెనక్కి తగ్గలేదు. ఎదురు సమాధానాలు ఇచ్చారు. దీంతో చర్చలు అర్ధంతరంగా ముగిశాయి.

జెలెన్‌స్కీకి ఇలా జరగాల్సిందే: రష్యా

జెలెన్‌స్కీకి ఇది జరగాల్సిందేనని రష్యా ఎద్దేవా చేసింది. ట్రంప్ ఆయనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడటాన్ని సమర్థించింది. ట్రంప్ సహనాన్ని కోల్పోకుండా ఆయన విషయంలో సంయమనం పాటించడం అభినందనీయమని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా ప్రశంసించారు. అమెరికాను గౌరవించని ఉక్రెయిన్‌కు ఇది చెంపపెట్టు అని రష్యా భద్రతా మండలి డిప్యూటీ చైర్మన్ దిమిత్రీ మెద్వెదేవ్ అన్నారు. అన్నం పెట్టిన చేతిని కొరికే ప్రయత్నాన్ని ఉక్రెయిన్ చేసిందని దుయ్యబట్టారు.

మా సర్వం వినిపించాలి-క్షమాపణ చెప్పనక్కర్లేదు: జెలెన్‌స్కీ

జెలెన్‌స్కీ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ట్రంప్‌కు తాను క్షమాపణ చెప్పనక్కర్లేదని అన్నారు. చర్చలు అర్ధాంతరంగా ముగియడం సరైనది కాదని చెబుతూనే ప్రస్తుతమున్నది చాలా కఠినమైన పరిస్థితి అని ట్రంప్ వైఖరిని ఉద్దేశించి ఆయనన్నారు. అమెరికా వైపు నుంచి తమకు స్నేహం కనిపించడం లేదని అన్నారు. ఖనిజాల ఒప్పందం భద్రతాపరమైన హామీ మాత్రమేనని చెప్పారు. ట్రంప్ అండదండలను కోరుకుంటున్నట్లు తెలిపారు. రష్యాపై తన అభిప్రాయం మారదని కూడా జెలెన్‌స్కీ ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అయితే యుద్ధం సమయంలోనే కాదు అది ముగిసిన తర్వాత కూడా ఉక్రెయిన్ గుర్తుండాలి... దాని స్వరం వినిపించాలి. ఇది మాకెంతో ముఖ్యం' అని నొక్కిచెప్పారు. తాము ఒంటరిగా లేమన్న భరోసా ఉక్రెయిన్ ప్రజలకు కావాలన్నారు. 'మాకు మద్దతిచ్చిన మీకు (అమెరికా, ట్రంప్, కాంగ్రెస్) కృతజ్ఞతలు. ఉక్రెయిన్ ప్రజలకు న్యాయమైన, శాశ్వత శాంతి కావాలి. అందుకోసమే శ్రమిస్తున్నాం' అని ఎక్స్‌లో జెలెన్‌స్కీ పేర్కొన్నారు. అదే సమయంలో ఉక్రెయిన్ ఒంటరి కాదంటూ మద్దతు ప్రకటించిన ప్రపంచ దేశాలకు పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.

ఉక్రెయిన్ ఒంటరి కాదు: ఫ్రాన్స్, కెనడా, జర్మనీ

ఉక్రెయిన్ ఒంటరి కాదని, అండగా నిలుస్తామంటూ ఫ్రాన్స్, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీతో సహా అనేక దేశాల అధినేతలు వేర్వేరుగా ప్రకటనలలో సంఘీభావం తెలిపారు. అమెరికా వైఖరిని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తప్పుపట్టారు. 'ఉక్రెయిన్ పౌరులకు మించి శాంతిని మరెవరూ కోరుకోలేరు... ఉక్రెయిన్‌కు మేముఉన్నాం' అంటూ జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ ప్రకటించారు. బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని ఆల్బనీస్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోన్ డెర్ లెయన్, మాల్డోవన్ అధ్యక్షులు మియా సందు, స్పెయిన్ ప్రధాని పెట్రో సాంచెజ్, హంగేరి ప్రధాని విక్టర్ ఓర్బన్, చెక్ అధ్యడు పీటర్ పవేల్, డచ్ ప్రధాని డిక్ స్కూఫ్, పోలిష్ ప్రధాని డొనాల్డ్ ట్రస్క్, స్విస్ అధ్యక్షులు కరిన్ కెల్లర్ సట్టర్ తదితరులు కూడా ఉక్రెయిన్‌కు వెనువెంటే ఉంటామని మద్దతు ప్రకటించారు.

బంగ్లాదేశ్‌లో విద్యార్థుల పార్టీ

ఢాకా: బంగ్లాదేశ్ అనిశ్చితి వేళ కొత్త పార్టీ ఆవిర్భవించింది. షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసనలకు సారథ్యం వహించిన విద్యార్థులు ఇప్పుడు రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. విద్యార్థుల పార్టీని ఏర్పాటు చేశారు. దానికి నేషనల్ నాగరిక్ పార్టీగా పేరు పెట్టారు. భారత్-పాకిస్థాన్ అనుకూల రాజకీయాలకు బంగ్లాదేశ్‌లో చోటు లేదని ప్రకటించారు. గతంలో యాంటీ డిస్క్రిమినేషన్ స్టూడెంట్ మువ్‌మెంట్ లేదా స్టూడెంట్స్ అగెనెస్ట్ డిస్క్రిమినేషన్ పేరుతో ఉద్యమాలు నిర్వహించే వీరు ఇకపై నేషనల్ నాగరిక్ పార్టీగా ముందుకెళ్లనున్నారు.

ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాల విక్రయాలు

వాషింగ్టన్: గాజాపై పోరుసకు ఇజ్రాయిల్‌కు మద్దతిస్తున్న అమెరికా ఆ దేశానికి 3 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలు విక్రయించేందుకు అంగీకరించింది. ఇందులో భాగంగా 35,529 జనరల్ బాంబులు, 2వేల పౌండ్ల బాంబులు, 4వేల బంకర్-బస్టింగ్, 2వేల పౌండ్ వార్‌హెడ్‌లను ఇజ్రాయిల్‌కు అమ్మనున్నట్లు పెంటగాన్ వెల్లడించింది. 2026లో వీటి సరఫరా మొదలు కానున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా 675.7 మిలియన్ డాలర్లు విలువ చేసే వెయ్యి పౌండ్ల బాంబులు, గైడెన్స్ కిట్‌ల కోసం రెండో ఒప్పందం కుదిరింది. వీటి సరఫరా 2028లో మొదలవుతుంది. 295 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం ప్రకారం క్యాటర్‌పిల్లర్ డి9 బుల్‌డోజర్లను 2027లో సరఫరా చేయనున్నట్లు పెంటగాన్ ప్రకటించింది.

ఆంగ్లమే అధికారిక భాష: ట్రంప్

వాషింగ్టన్: ఆంగ్లమే తమ అధికారిక భాష అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ఆయన సంతకం చేశారు. 'ఇంగ్లిష్‌ను అధికారిక భాషగా పేర్కొనటం దేశ ఐక్యతను ప్రోత్సహిస్తుంది. ప్రభుత్వ కార్యకలాపాల్లో సామర్థ్యాన్ని పెంచుతుంది. పౌర సంబంధాలకు మార్గం సుగమం చేస్తుంది' అని శ్వేతసౌధం ప్రకటించింది. ఇంగ్లిష్‌కు అధికారిక భాష హోదా కల్పించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. 30కుపైగా రాష్ట్రాలు ఇప్పటికే ఆంగ్ల భాషను అధికారిక అధికార భాషగా గుర్తించాయి. ట్రంప్ తాజా నిర్ణయంతో ఫెడరల్ నిధులు పొందేందుకు ఆంగ్లంలో పత్రాలు, సేవలు అందించటంపై ప్రభుత్వ, ఇతర సంస్థలకు స్పష్టత లభించినట్లు అయింది.

బీజేపీకి కొత్త అధ్యక్షురాలు?

(మొదటిపేజీ తరువాయి)

మహిళను ఈ పదవికి నియమించాలని పార్టీ పరిశీలిస్తోందని బీజేపీ సీనియర్ కార్యకర్త ఒకరు తెలిపారు. పార్టీ మహిళా నాయకురాలిని ఎన్నుకోవాలని నిర్ణయించుకుంటే బీజేపీ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వానతి శ్రీనివాసన్ కీలక పోటీదారులుగా ఉన్నారు. 2014లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన 66 ఏళ్ల పురందేశ్వరి అనుభవజ్ఞులైన సంస్థాగత నాయకురాలిగా భావిస్తున్నారు. ఆమె ప్రస్తుతం బీజేపీ ఆంధ్ర ప్రదేశ్ విభాగానికి నాయకత్వం వహిస్తున్నారు. ఆమె బలమైన వాక్చాతుర్యానికి ప్రసిద్ధి చెందారు. దీంతో ఆమెకు 'దక్షిణాది సుష్మా స్వరాజ్' అనే బిరుదు లభించింది. ఇక కోయంబత్తూరు నుంచి వచ్చిన ఎమ్మెల్యే, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు అయిన వానతి శ్రీనివాసన్ అనేక ప్రచార కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. ఆమెను పార్టీలో విశ్వసనీయ నాయకురాలిగా పరిగణిస్తున్నారు. వానతి శ్రీనివాసన్ ఇటీవల తమిళనాడులో జరిగిన కార్యక్రమాలలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఆతిథ్యం ఇచ్చారు. బీజేపీ ప్రాంతీయ ప్రాతినిధ్యం, కులం, బీహార్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో రాబోయే ఎన్నికలు వంటి ఇతర అంశాలను కూడా పరిశీలిస్తోంది. పార్టీ సైద్ధాంతిక గురువు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఎంపిక ప్రక్రియలో పాల్గొంటుందని, అయితే తుది నిర్ణయం ఏకాభిప్రాయం ద్వారా తీసుకోనున్నట్లు సమాచారం. కొత్త అధ్యక్షుని వయస్సు 50 నుంచి 70 ఏళ్ల మధ్య ఉండవచ్చని, హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ (71 ఏళ్లు) పోటీ చేసే అవకాశం లేదని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు సూచించారు. పార్టీ పురుష అభ్యర్థిని ఎంచుకుంటే కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ (55), బీజేపీ ప్రధాన కార్యదర్శి భూపేంద్ర యాదవ్ (55), సీనియర్ నాయకుడు వినోద్ తవ్డే (61) వంటి అభ్యర్థులు కూడా నిలిచే అవకాశం ఉంది.

ఏపీ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ఇంటర్ 5,00,963 మంది, ద్వితీయ ఇంటర్ విద్యార్థులు 4,71,012 మంది ఉన్నారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి ప్రథమ ఇంటర్ 44,581, ద్వితీయ ఇంటర్ 42,238 మంది ఉన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. 144 సెక్షన్ విధించి పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

గ్రీస్‌కు సీపీఐ సంఘీభావం

(మొదటిపేజీ తరువాయి)

28న గ్రీస్‌వ్యాప్తంగా భారీ స్థాయిలో ప్రదర్శనలు నిర్వహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు, సంస్కరణలను డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో గ్రీస్ ప్రజలకు సీపీఐ సంఘీభావం ప్రకటించింది

డ్రగ్స్‌పై పంజాబ్ ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టే చర్యల పర్యవేక్షణకు ఏర్పాటైన కేబినెట్ ఉపసంఘం తొలిసారి సమావేశమైంది. మాదకద్రవ్యాల నిరోధక కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని రాజకీయ పార్టీలకు మంత్రి అమన్ అరోడా విజ్ఞప్తి చేశారు. సామాజిక సంస్థలు, ఎన్జీవోల వంటివి కలిసిరావాలని పిలుపునిచ్చారు. భేటీ అనంతరం మంత్రి హర్‌పాల్ సింగ్ చీమా మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ చర్యలపై రాజకీయాలు వద్దని సూచించారు.

8 నుంచి స్వేచ్ఛగా తిరగొచ్చు

(మొదటిపేజీ తరువాయి)

క్రమంలో ఇది తొలి సమీక్ష సమావేశం. మణిపూర్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా చేసేందుకుగాను డ్రగ్ ట్రేడ్ నెట్‌వర్క్‌ను నిర్మూలించాలని ఆదేశించారు. మణిపూర్ అంతర్జాతీయ సరిహద్దు వెంట డిజిగ్నేటెడ్ ఎంట్రీ పాయింట్లకు ఇరువైపులా కంచెను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు హోంమంత్రిత్వశాఖ ఒక ప్రకటన వెలువరించింది. సమీక్షలో గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, ప్రభుత్వ ఉన్నతాధికారులు, సైన్యం, పారా మిలటరీ దళాల అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, శాంతి చర్యల్లో భాగంగా అక్రమ ఆయుధాల అప్పగింతకు గవర్నర్ పిలుపు మేరకు వారంలో 300కు పైగా ఆయుధాలను ప్రజలు సమర్పించినట్లు సమాచారం.

అప్పులపై మరోసారి అసత్య ప్రచారం

ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర అప్పులపై సీఎం చంద్రబాబు నాయుడు మరోసారి అసత్య ప్రచారం చేశారని రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి, వైసీపీ నేత బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మండిపడ్డారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు పర్యటనలో రాష్ట్ర అప్పులకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు చేసిన వాఖ్యలను బుగ్గన ఖండించారు. ఈ మేరకు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలకు నిజం తెలియాలంటే బడ్జెట్ పుస్తకంలో వాల్యూమ్ 6 (బడ్జెట్ ఇన్ బ్రీఫ్) లో అప్పుల వివరాలు ప్రతి సంవత్సరం మాదిరిగా తెలపాలని బుగ్గన డిమాండ్ చేశారు. రాష్ట్ర అప్పులపై నాటి నుంచి టీడీపీ కూటమి దుష్ప్రచారం చేస్తోందని, వైసీపీ హయాంలో అప్పులు రూ.14 లక్షల కోట్లకు చేరాయంటూ పచ్చి అబద్దాలు ప్రచారం చేశారని ఆరోపించారు. గత పాలకులు రూ.10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై మోపారని నిందించడాన్ని బుగ్గన తప్పుపట్టారు. నిజానికి ఏనాడూ రాష్ట్ర అప్పులు చంద్రబాబు చెప్పినట్లు ఆ స్థాయిలో లేవన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, 2024 నవంబరులో ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో రాష్ట్ర అప్పులను రూ.6.46 లక్షల కోట్లుగా చూపిన విషయాన్ని గుర్తు చేశారు. ఎవరి హయాంలో అప్పులు పెరిగాయనేది ఆధారాలతో సహా చాలాసార్లు చెప్పడం జరిగిందని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య చంద్రబాబు పాలనలో అప్పుల పెరుగుదల సీఏజీఆర్ 19.54 శాతం కాగా, 2019 నుంచి 2024 మధ్య వైసీపీ ప్రభుత్వంలో అప్పుల పెరుగుదల సీఏజీఆర్ 15.61 శాతం మాత్రమేనని చెప్పారు. బడ్జెట్‌లో వాల్యూమ్-6 (బడ్జెట్ ఇన్ బ్రీఫ్) లో రాష్ట్ర రుణాలపై అన్ని వివరాలు చూపడం ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ, సంప్రదాయం ఉందన్నారు. కానీ ఆ సంప్రదాయాన్ని చంద్రబాబు కాలరాసి, ఈ ఏడాది బడ్జెట్‌లో రాష్ట్ర అప్పులను చూపలేదని, కూటమి ప్రభుత్వం ఉద్దేశం ఏమిటన్నది ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు.

ఏడాదిలోనే రూ.1.50 లక్షల కోట్ల అప్పు

విశాలాంధ్ర - హైదరాబాద్: బ్యాగ్‌లు మోసి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డిని పక్కన పెట్టుకొని, బ్యాగ్‌లు మోయొద్దని టీపీసీసీ కొత్త ఇంచార్జి మీనాక్షి మాట్లాడడం విడ్డూరంగా ఉందని, అది పెద్ద జోక్ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అప్పట్లో చంద్రబాబుకు బ్యాగ్‌లు మోస్తే, ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానానికి రేవంత్ రెడ్డి బ్యాగ్‌లు మోస్తున్నాడని ఆరోపించారు. మంచి మైక్‌లో చెప్పాలి చెడు చెవిలో చెప్పాలంటున్న రేవంత్ ఒక్క మంచి పని చేయలేదు కాబట్టే ఎవరూ మైక్ లో చెప్పడం లేదన్నారు. హైడ్రా విధ్వంసం, ఆర్ఆర్ టాక్స్, భూకబ్జాలు, అంతులేని అవినీతితో కుప్పకూలిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్, ఇటీవల కొట్టుకపోయిన పెద్దవాగు, మునిగిన వట్టెం పంప్ హౌస్ ... ఇలా చెప్పడం మొదలుపెడితే రేవంత్ చెవుల నుంచి రక్తం కారుతుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండల మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డితో పాటు సుమారు 500 మంది బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలను శనివారం పార్టీలోకి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేవంత్‌ను తెలంగాణలో తిట్టనివారు లేరన్నారు. రుణమాఫీ జరగలేదు, పెన్షన్లు పెరగలేదు, రైతు భరోసా లేదు, ఆడబిడ్డలకు తులం బంగారం లేదు, కళ్యాణ లక్ష్మి నిలిపివేశారు అని ధ్వజమెత్తారు. హైడ్రా, మూసీ కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని దెబ్బతీశారన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కేసీఆర్ హయాంలో 90శాతం పనులు పూర్తయ్యాయన్నారు. కేవలం 10శాతం పనులు చేస్తే చేవెళ్లకు నీళ్లు వస్తాయి కానీ రేవంత్ రెడ్డి అలా చేయడం లేదన్నారు. మూసీ సుందరీకరణ కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసి కమీషన్లు దండుకొని, కాంగ్రెస్ అధిష్టానానికి పంపి తన పదవి కాపాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో 'నీళ్లు, నిధులు, నియామకాలు' అన్న తెలంగాణ ఉద్యమ నినాదం సాకారమైందన్నారు. కాళేశ్వరంతో పాటు మిగతా సాగునీటి పథకాలతో వరి ఉత్పత్తిలో దేశంలో నంబర్ వన్‌గా తెలంగాణ నిలిచిందని వివరించారు. రైతుబంధు, రుణమాఫీ ద్వారా లక్ష కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసాం, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 24 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు సృష్టించాం అని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ రేవంత్ రెడ్డి హయాంలో నీళ్లు పాతాళంలోకి, నిధులు దిల్లీకి వెళ్తున్నాయని ఆరోపించారు. 450 మంది రైతులు, ఆటో డ్రైవర్లు, చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. రాబోయే పంచాయతీ, ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

బడ్జెట్లో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం

ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్ర

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్లో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు శనివారం విడుదల చేసిన ఒ ప్రకటనలో విమర్శించారు. నిరుద్యోగ భృతి ఊసే లేదనీ, 3,22, 359 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెడితే యువజన, క్రీడా, సాంస్కృతిక రంగాలకు మొత్తం కలిపి 469 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు., రాష్ట్రవ్యాప్తంగా సుమారు 84 లక్షల మంది విద్యార్థులు కు 12,600 కోట్లు అవసరం ఉందని,కేవలం 9,407 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారనీ, కొఠారి కమిషన్ ప్రకారం విద్యారంగానికి 30 శాతం నిధులు సుమారు 90 వేల కోట్లు కేటాయించాలని కానీ పాఠశాల విద్యకు 31,805 కోట్లు ఉన్నత విద్య కు 2506 కోట్లు మాత్రమే కేటాయించారని ప్రపంచంలో ఉన్నటువంటి టాప్ 10 యూనివర్సిటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నిల్పుతామని ప్రగల్బాలు పలుకుతున్నారని 2506 కోట్లతో రాష్ట్రంలో ఉన్న యూనివర్సిటీల అభివృద్ధి ఏ విధంగా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేస్తామని నిన్న ముఖ్యమంత్రి ప్రకటించారని కానీ బడ్జెట్లో యువజన శాఖ, క్రీడలు, సాంస్కృతిక రంగాలకు మూడింటికి కలిపి కేవలం 469 కోట్లు మాత్రమే కేటాయించారని ఇంత తక్కువ కేటాయింపుతో ఏ విధంగా క్రీడలు సాంస్కృతిక యువజన రంగాలను అభివృద్ధి చేయాలనుకుంటున్నారో యువజన శాఖ మంత్రి తెలియజేస్తే బాగుంటుందన్నారు.

'ఆయిల్ పామ్' లాభసాటే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ఆయిల్ ఫెడ్ ప్రాసెసింగ్ మిల్లులలో నూనె రికవరీ శాతం, ముడి పామాయిల్ అమ్మకం ధరల ఆధారంగా ప్రతి నెల ఆయిల్ పామ్ గెలల ధర నిర్ణయించడం జరుగుతుందన్నారు. అప్పారావ్ పేట, అశ్వరావుపేట ఆయిల్ పామ్ కర్మాగారాలలో నూతన టెక్నాలజీతో కొత్త యంత్రాలు ఏర్పాటు చేయడం, ఉన్న యంత్రాలను అధునికరించడం వల్ల నూనె రికవరీ టన్నుకు 19.02 శాతం నుంచి 19.42 శాతం పెరగడం వల్ల రైతులు సంతోషిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆయిల్ పామ్ కంపెనీలు కొంత మంది బ్రోకర్లను ఏర్పాటు చేసి వారి ద్వారా తెలంగాణ ఆయిల్ ఫెడ్ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారని, వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా తెలంగాణ ఆయిల్ ఫెడ్ రైతుల సంక్షేమం కోసం పని చేస్తూ నూనె రికవరీ శాతం పెంచుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1992-93 నుంచి ఇప్పటి వరకు 2.39 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మరో లక్ష ఎకరాలలో సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రైతులను ప్రోత్సహించేందుకు ఏకరాకు రూ.50,918 రాయితిని నాలుగు సంవత్సరాల కాలానికి ఇవ్వడం జరుగుతుందన్నారు.

8 మంది జాడ కోసం అన్వేషణ

(మొదటిపేజీ తరువాయి)

కృష్ణారావు, సీఎస్ శాంతికుమారితో ఆయన సమీక్షించారు. సహాయక చర్యలు, శిథిలాల తొలగింపు, డీవాటరింగ్ పనుల పురోగతిపై సహాయక బృందాలు, ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేపీ క్యాంప్ కార్యాలయం వద్ద జూపల్లి మీడియాతో మాట్లాడారు. మొత్తం ఎనిమిది మంది గల్లంతు కాగా జీపీఆర్ ద్వారా ఇప్పటికే నలుగురి జాడ కనుగొన్నారని, ఆ ప్రాంతంలో తవ్వకాలు కొనసాగుతున్నాయన్నారు. టన్నెల్ బోరింగ్ మిషన్ కింద మరో నలుగురి ఆనవాళ్లు కన్పించినట్లు తెలుస్తోందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా సొరంగాలు తవ్వామని చెప్పుకునే బీఆర్ఎస్ నాయకులు తమ పదేళ్ల పాలనలో ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. సొరంగంలో చాల క్లిష్టమైన పరిస్థితులు ఉన్నాయని, ప్రతిపక్షాలు విమర్శిస్తున్నట్లు సహాయక చర్యల్లో నిర్లక్ష్యం ఏమి లేదని,దీనిపై నిస్సిగ్గుగా రాజకీయ విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇక మండే ఎండలే!

(మొదటిపేజీ తరువాయి)

వేడిని చవిచూస్తాయని తెలిపింది. రాబోయే వేసవి నెలల్లో భారతదేశం సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు, వేడి గాలుల రోజుల సంఖ్యను ఎదుర్కొనే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. 1901 నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలల్లో నమోదయిన ఉష్ణోగ్రతలను పరిశీలించినపుడు ఈ ఏడాది ఫిబ్రవరిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రధానంగా దక్షిణ, మధ్య తెలంగాణతో పాటు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వెల్లడించింది. దక్షిణ, ఉత్తర తెలంగాణలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు సైతం సాధారణం కంటే రెండు డిగ్రీలు పెరిగే సూచనలున్నాయని తెలిపింది. 125 సంవత్సరాల సరాసరి సగటు తీసుకుంటే గాలిలో తేమ చాలా తగ్గిందని పేర్కొంది.

'ఆశా'లకు సర్కార్ ఆసరా

- గ్రాట్యుటీ చెల్లింపునకు సీఎం పచ్చజెండా
- 180 రోజుల ప్రసూతి శెలవుకు అంగీకారం
- పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు
- 42,752 మంది ఆశా వర్కర్లకు లబ్ధి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీపి కబురు అందించారు. వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు పచ్చజెండా ఊపారు. సీఎం నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే 37,017 మందికి, పట్టణ ప్రాంతంలో 5,735 మంది ఆశా వర్కర్లకు లబ్ధి చేకూరనుంది. ఆరోగ్య శాఖపై శనివారం జరిగిన సమీక్షలో ఎన్నికల ముందు ఆశాలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం ఆమోదముద్ర వేశారు. గ్రాట్యుటీ చెల్లింపు ఏ విధంగా ఉండాలనే దానిపై వివిధ రాష్ట్రాల్లో ఆశా వర్కర్లకు అందజేస్తున్న వేతనాలు, పదవీ విరమణ ప్రయోజనాలు పరిశీలించాలని, గ్రాట్యుటీని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోంది. 30 ఏళ్ల పాటు సేవల్లో ఉన్న ప్రతి ఆశా కార్యకర్తకు గ్రాట్యుటీ కింద రూ.1.50 లక్షల వరకు లబ్ధి చేకూరుతుంది. ఆశా వర్కర్లకు గతంలో ప్రసూతి శెలవుల సమయంలో వేతన చెల్లింపు ఉండేది కాదు. ఇప్పుడు సుమారు 180 రోజుల ప్రసూతి శెలవులను పని దినాలుగా పరిగణలోకి తీసుకుని వేతనం చెల్లింపునకు సీఎం అంగీకరించారు. లారు నెలల పాటు ప్రసూతి శెలవుల్లో ఉన్నప్పటికీ జీతం అందుతుంది. ప్రసూతి శెలవులు పొందిన వారు రూ.60 వేల మేర ప్రయోజనం పొందుతారు. 2019 కి ముందు కూడా ఆశా వర్కర్‌లను చంద్రబాబు ఆదుకున్నారు. 2018లో పనిరిత్యా వారికి అవసరమైన స్మార్ట్ ఫోన్‌లను అందించడం, ఏఎన్‌మ్‌ల నియామకంలో అర్హత ఉన్నవారికి ప్రాధాన్యత, రేషన్ కార్డులు, ఎన్టీఆర్ వైద్య సేవ, ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచడం వంటి ప్రయోజనాలను కల్పించారు. వృద్ధాప్య పెన్షన్‌కు కూడా అర్హత కల్పించారు. ఐదు రకాల కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారికి ఉత్తరప్రదేశ్‌లో రూ.750, హిమాచల్‌ప్రదేశ్‌లో రూ.రెండు వేలు, రాజస్థాన్‌లో రూ.2,700, పశ్చిమ బెంగాల్, దిల్లీలో రూ.మూడు వేలు, హర్యానా, కర్నాటకలో రూ.నాలుగు వేలు, కేరళలో రూ.ఐదు వేలు, సిక్కింలో రూ.ఆరు వేలు, తెలంగాణలో రూ.7,500, ఏపీ ప్రభుత్వం నెలకు రూ.10 వేల చొప్పున జీతం చెల్లిస్తోంది.

నరసింహారావు పార్థివ దేహానికి కూనంనేని నివాళులు

విశాలాంధ్ర - కొత్తగూడెం : గ్రంథాలయం రిటైర్డ్ ఉద్యోగి, సీపీఐ సానుభూతిపరులు ఆళ్ళ నరసింహారావు (60) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శనివారం పట్టణ పరిధిలోని జ్యోతి నగర్‌లో ఉన్న నరసింహారావు నివాసానికి చేరుకున్నారు. పార్థివదేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. తమ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను నరసింహారావు బలంగా నమ్మి అనుసరించే వారని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కూనంనేనితో పాటు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, నివాళుర్పించారు.

ప్రవక్త ముహమ్మద్ (స) చూపిన సన్మార్గంలో పయనిద్దాం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ముస్లిం సమాజం మహమ్మద్ ప్రవక్త (స) నిర్దేశించిన పరోపకారం, శాంతి మార్గంలో పయనించినప్పుడే వ్యక్తిగత, సామాజిక సమస్యలు అన్నిటికీ పరిష్కారం లభిస్తుందని మౌలానా ముసద్దిఖుల్ ఖాస్మీ దామత్ బర్కాతుహుమ్ స్పష్టం చేసారు. శనివారం కొత్తగూడెంలోని ఉర్దూగర్ సమావేశ మందిరంలో స్థానిక ఖిద్మతే ఇన్సాని యాత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రంజాన్ మాసం శుభ సందర్భంగా సమావేశం నిర్వహించారు. ముహమ్మద్ (స) సందేశ మార్గంలో 'ఖిద్మతే ఇన్సానియాత్' (మానవ సేవ) అనే శీర్షికన జరిగిన ఈ సమావేశానికి హజ్రత్ మౌలానా అబ్దుల్ కరీం రషాదీ అధ్యక్షులుగా వ్యవహరించారు. ముస్లింలు ఎప్పుడైతే పవిత్ర గ్రంథం ఖురాన్ సందేశాన్ని, ప్రవక్త చూపిన మార్గాన్ని విస్మరిస్తారో అప్పుడు సమాజంలో బహుముఖ నష్టాలను చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. సభాధ్యక్షులు మౌలానా అబ్దుల్ కరీం మాట్లాడుతూ కొత్తగూడెంలోని ఖిద్మతే ఇన్సానియత్ వెల్ఫేర్ సొసైటీ యువకులు విశాల దృక్పథంతో కులమతాలకతీతంగా అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా యువకులు సామాజిక, ధార్మిక పరిస్థితుల పట్ల అవగాహన కలిగి వున్నపుడే తమ తక్షణ కర్తవ్యాలను ఇస్లాం మార్గంలో గుర్తించగలరని తెలిపారు. వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు ఎండి. ఇబ్రహీం జిల్లాలో చేసిన సేవ కార్యక్రమాలను వివరించారు. బాధలో ఉన్న వారు ఎవరైనా ఆదుకోవడం తమ ధర్మమని వెల్లడించారు. సమావేశానంతరం భోజన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మత గురువులు, మతపెద్దలు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించామని, జడ్ పి హెచ్ ఎస్ కమలాపురం గెజిటడ్ హెడ్ మాస్టర్ గడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ స్వయం పరిపాలన దినోత్సవం కార్యక్రమంలో, విద్యార్థులు వాళ్ల తీసుకున్న పాత్రలో చక్కగా బోధించారని, అదేవిదంగా, రాజకీయ నాయకులు, వివిధ రకాల జిల్లా స్థాయి ఉద్యోగుల పాత్రలల్లో కూడా, విద్యార్థులు బాగా చేశారని, వాళ్ళు చేసిన పాత్రలో, నిత్య జీవితంలో కూడా ఈ విధంగా, ఎదగాలని, విద్యార్థులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాత్రలో అంతటి పవన్, ఎంపిగా జె.ప్రశాంతి ఎమ్మెల్యేగా మల్లికార్జున్, కలెక్టర్‌గా రామ్ చరణ్, అడిషనల్ కలెక్టర్‌గా అక్షిత, ఆర్‌జెడిగా చందన, శివ, డిఇఓగా టి.చందు, డిప్యూటీ డిఇఓగా నిమ్మల రాకేష్ తహసీల్దార్‌గా అన్విత, హెచ్ యంగా మోహన్ రాజ్, యంఇఓగా వజీనిపల్లి అక్షయ, ఏపిసి చైర్మన్‌గా రేణు, అక్షయ వారి పాత్రలు పోషించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మాట్లాడుతూ స్వయం పరిపాలన దినోత్సవం మంచి అనుభూతిని మిగిల్చింది అన్నారు. ఇంచార్జి హెచ్‌యం ప్రసాద్, ఉపాధ్యాయులు నర్సింహారావ్, నాగలక్ష్మి, నాగమ్మ, బూలక్ష్మి, రమేష్, పాల్గొన్నారు.

మాదిగ అమర వీరుల త్యాగాలు మరవలేనివి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ, పోరాటంలో అమరులైన మాదిగ, అమరవీరుల సంస్మరణ దినోత్సవలు ములుగు జిల్లాల్లోని వివిధ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించి, అమరవీరుల, చిత్ర పాఠాలకు నివాళులు అర్పించారు. ములుగు బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం వద్ద, పస్రా, ఏటూరునాగారం అంబేద్కర్ విగ్రహం తదితర మండల కేంద్రాలలో, అమర వీరుల చిత్ర పాఠాలకు, యంఆర్‌పిఎస్, యంఎస్‌పి రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యం ఆర్ పిఎస్ జాతీయ నాయకులు, చతీష్ గడ్ రాష్ట్ర ఇంచార్జి ఇరుగు పైడి మాదిగ, యం ఎస్ పి ములుగు జిల్లా అధ్యక్షులు మడి పెల్లి శ్యాం బాబు మాదిగ, యం ఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు వావిలాల స్వామి మాదిగ పాల్గొన్ని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గడ్డం సారయ్య మాదిగ, దీపాక కృష్ణ మాదిగ, పంగ శ్రీను మాదిగ, తిక్క దుర్గారావు మాదిగ, కాకి అశోక్ మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు జిల్లా ఉపాధ్యక్షులు మరాటీ రవీందర్ మాదిగ, బిక్షపతి మాదిగ, బోడ రఘు మాదిగ, యంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు వావిలాల సంబ శివరావు, ఏటూరునాగారం మండల కమిటీ అధ్యక్షులు ఎంపెల్లి జాషు, ఎంపెల్లి శంకర్ పాల్గొన్నారు.

మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర బ్యూరో - కొమురం భీం : ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలలో భాగంగా నిరుపేదలకు గూడు కల్పించాలని ఉద్దేశంతో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో ఇండ్లు మంజూరైన వారు త్వరగా నిర్మాణం చేపట్టాలని హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి. వి.పి. గౌతమ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారులు, హౌసింగ్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడత పైలట్ గ్రామాలలో ఎంపికైన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం చేపట్టడంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. హౌసింగ్ కార్పొరేషన్ ఎండి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా బేస్ మెంట్ నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి త్వరగా నిధులు మంజూరు చేయాలన్నారు.

పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లా వ్యాప్తంగా భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పంచాయతీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం దిశగా కదలికలు తెచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మొబైల్ యాప్ ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలన ప్రక్రియ నిర్వహించాలన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలకు తప్పకుండా పాటిస్తూ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ అధికారులు ఆయా శాఖల సిబ్బందికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రూట్నీ కోసం ప్రతిరోజు లక్ష్యాలను నిర్దేశించాలని సూచించారు. తనిఖీల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నీటి వనరులు బఫర్ జోన్, ఎఫ్‌టిఏలలో ఉండవద్దని స్పష్టం చేసారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ సమయంలో నిబంధనలు తప్పనిసరి పాటించాలన్నారు. అప్రోచ్ రోడ్, ప్లాట్ల మధ్య రోడ్లు సరిగా ఉండేలా పరిశీలన చేయాలని స్పష్టం చేసారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు ముందుగా పెండింగ్ దరఖాస్తుల లొకేషన్‌ను గుర్తించాలన్నారు. సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి రెండు వారాల్లో పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేసేలా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌ను ఆదేశించారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో తక్కువ సంఖ్యలో ఉన్న దరఖాస్తులను రెండు రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆర్డీవోలు మధు, దామోదర్‌రావును ఆదేశించారు.

ఘనంగా రామనాథం పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - పినపాక : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఈ ప్రాంతంలో రాజకీయ భీష్ముడుగా పేరున్న మండల అధ్యక్షుడు గొడిశాల రామనాథం 73వ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. బయ్యారం క్రాస్ రోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు చేప్పారు. తొలుత రామనాథం చేత కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ తాను 1974 నుండి నేటి వరకు అయిదు దశాబ్దాలుగా పార్టీ కోసమే పనిచేస్తున్నానని తెలిపారు. ఈ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని వివరించారు. ఎంతోమంది, ఇతర రాజకీయ పార్టీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తాను కాంగ్రెస్ పార్టీ వీడకుండా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. తన పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం భూపాలపట్నం అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు చాక్లెట్స్, కేక్‌లు, ఆసుపత్రిలో రోగులకు అరటిపండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉడుముల లక్ష్మారెడ్డి, బోడ లక్ష్మణరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్కడ మహిళలు గౌరవించబడరో అక్కడ పతనం తప్పదు : విశ్వ జంపాల

విశాలాంధ్ర - గార్ల : ఏ సమాజంలో అయితే మహిళలు గౌరవించబడరో ఆ సమాజం నైతికంగా పతనం వైపు పయనిస్తున్నట్లే అని విశ్వసమాజ వ్యవస్థాపక అధ్యక్షులు, న్యాయవాది విశ్వజంపాల అన్నారు. ఆధునిక సమాజంలో మహిళలు పురుషులకు సమాంతరంగా అన్ని రంగాల్లో శ్రమిస్తూ, నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. వారి శ్రమ వెలకట్టలేనిదన్నారు. శనివారం మండల కేంద్రంలో తన కార్యాలయంలో స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చ్ 8 ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఇంటింటా జరుపుకుందామని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో ప్రతి మహిళను గౌరవంగా సన్మానించాలని సమాజాన్ని కోరారు. మహిళలను వంటింటి మనిషిగా, ఒక యంత్రాంగా చిన్నచూసి చూడటం మానెయ్యాలన్నారు. విద్యా, ఉద్యోగ, వ్యాపార, ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక తదితర అన్ని రంగాల్లో చాలామంది మహిళలు రాణిస్తున్నారని వివరించారు. అయినప్పటికీ మహిళలపై నిత్యం గృహహింస, హత్యలు, అఘాయిత్యాలు, అత్యాచారాలు, వేధింపులు రోజురోజుకి పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సాధికారిత ఎండమావిగానే మిగిలిపోతుందని విమర్శించారు. విశాల దృక్పథంతో మహిళా ఉద్యమకారిణిలు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరం అన్నారు. మహిళలకు విద్య ఎంతో అవసరమని దీనికోసం చైతన్యపరులు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు.

అక్రమ కట్టడాలు తక్షణమే కూల్చివేయాలి

విశాలాంధ్ర - వనపర్తి : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు మూడవ రోజు నిరవధిక నిరసన కొనసాగింది. ఈ ఆందోళన శిబిరానికి రవీందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు అబ్రహం మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో 10శాతం భూమినీ భూకబ్జాదారుల నుండి ప్రభుత్వం గుర్తించి వెలికి తీయాలని అన్నారు. టీఎన్జీవో బిల్డింగ్ పక్కల గల 20 ఫీట్ల రోడ్డు ఆక్రమణకు గురవుతున్నదని అందుకు కారకులైన బంగారు వ్యాపారస్తుడు బంగారు శ్రీను పై వెంటనే పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలని అందుకు సహకరించిన మున్సిపల్ కమిషనర్, టిపిఓ,లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాలను తక్షణమే కూల్చివేయాలని భూ కబ్జాలపై మున్సిపల్ శాఖ శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ మాట్లాడుతూ మూడు రోజులుగా తాహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష ఏర్పాటు చేసిన నేటి వరకు అధికారులు స్పందించడం లేదని చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసి బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ మాట్లాడుతూ బంగారు శ్రీను బాగోతం అవినీతిమయంగా ఉందని రోడ్లు కబ్జా, కబ్రస్తాన్లను భూకబ్జాలకు పాల్పడుతూ ఉంటే ప్రజలు క్షమించరని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయరాములు మాట్లాడుతూ భూ కబ్జాల బాగోతం బయటపెట్టి భూకబ్జాదారులక్షర వీడే వరకు పోరాటం ఆగదని తేల్చి చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములకు రక్షణగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఏ భాస్కర్, మోష, ఎన్ ఎఫ్ డబ్ల్యూ జిల్లా కార్యదర్శి గీతమ్మ, నిస్సార్, సౌలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

30 పోలీస్ యాక్ట్ అమలు : ఎస్పీ

విశాలాంధ్ర - కొమురం భీం : ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి మార్చి 1వ తేదీ నుండి మార్చి 31వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఏలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు చేయరాదని. 30 పోలీస్ యాక్ట్ ఎవరైనా ఉల్లంఘిస్తే 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సింగరేణిలో 93 శాతం బొగ్గు ఉత్పత్తి సాధన

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: సింగరేణిలో గత ఎప్రిల్ నుండి ఫిబ్రవరి 28 వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో 93 శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించామని ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి వివిధ డివిజన్లలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 64.43 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా 60.09 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఇది 93 శాతం ఉత్పత్తి సాధన అని వివరించారు. కొత్తగూడెంలో 12.66 మి.ట (96శాతం) ఇల్లందులో 3.94 మి.ట. (110శాతం), మణుగూరులో 11.21 మి.ట.(97శాతం), బెల్లంపల్లిలో 3.20 మి.ట (95%), మందమర్రిలో 2.45 మి.ట.(77శాతం), శ్రీరాంపూర్‌లో 4.95 మి.ట.(86శాతం), ఆర్.జి వన్ లో 4.21 మి.ట. (94శాతం), ఆర్.జి - 2 లో 8.29 మి.ట.(94శాతం), ఆర్.జి-3లో 5.55 మి.ట.(98శాతం), అడ్రియాల ప్రాజెక్టులో 0.39 మి.ట.(101శాతం), భూపాలపల్లిలో 3.18 మి.ట (74శాతం), మొత్తం సింగరేణి సంస్థలో 93 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఆయన తెలిపారు. రామగుండం ఏరియాలో స్వయం ఉపాధి కోసం యువతకు స్కిల్ డెవలప్‌మెంటు శిక్షణ ఇస్తున్నామని అన్నారు.ఆర్జీ వన్ ఓసిపి 5 ప్రాజెక్టుకు భూములు ఇస్తున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రైతు గోడు పట్టని ప్రభుత్వాలు : భాగం

విశాలాంధ్ర - ఖమ్మం : కష్టనష్టాలతో పంటలు పండించి పంటలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న రైతుల గోడు పట్టించుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు ఆరోపించారు. శనివారం కొనిజర్ల కళ్యాణ మండపంలో తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు దడిపిన్ని వెంకటేశ్వర్ల అధ్యక్షతన జరిగిన తెలంగాణ రాష్ట్ర సంఘం కొనిజర్ల మండలం మూడో మహాసభలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల ప్రయోజనాలు దెబ్బతీసేందుకు వ్యవసాయం మూడు నల్ల చట్టాలు తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పరిపాలన అందిస్తున్నాడని వారు విమర్శించారు. రాష్ట్రంలో పంటలు బీమా పథకం లేక రైతులు అంట నష్టం జరిగి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు రైతులకు అనే హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినాక అమలు చేయడంలో ముసల కన్నీరు వలపోస్తున్నారని వారు పేర్కొన్నారు. పంట రుణమాఫీ రైతు రైతు భరోసా సంపూర్ణంగా అమలు చేయాలని వారు ప్రభుత్వానికి కోరారు. రైతులకు మేలు జరగాలి అని ప్రభుత్వాలకు సిద్ధ సుద్ధ ఉంటే పంటల మద్దతు ధర గ్యారెంటీ చట్టాలు చేసి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ వ్యవసాయం రైతులను చిన్న సూపు చూడటం వల్లే పల్లె రైతాంగం కెసిఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపిన సంగతి నీ ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలని వారు సూచించారు. వైరాలో 20వ తారీకు ఖమ్మం జిల్లా రైతు సంఘం మహాసభ జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ మహాసభలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ కొండపర్తి గోవిందరావు రాష్ట్ర రైతు సంఘం సీనియర్ నాయకులు అడప రామకోటయ్య జమ్ముల జితేందర్ రెడ్డి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్రబాబు తాటి వెంకటేశ్వరరావు రైతు సంఘం మండల కార్యదర్శి తండు సోమయ్య పెద్దమల రత్తయ్య స్వర్ణ రమేష్ తోటపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు మహాసభకు ముందుగా రైతు సంఘం జెండాను తాత బాబు పెద్దమల్ల రత్తాలు పతాకాన్ని ఆస్కరించారు. రైతు సంఘం మండల అధ్యక్షుడిగా దేరంగుల లక్ష్మయ్య ప్రధాన కార్యదర్శిగా తాండు సోమయ్య తోపాటు 15 మంది కార్యవర్గ సభ్యులు 45 మంది కౌన్సిల్ సభ్యులను మహాసభ ఎన్నికున్నది.

సంక్షేమ బోర్డును ఎత్తివేసే కుట్రలను తిప్పికొట్టండి

విశాలాంధ్ర - ఖమ్మం : భవన నిర్మాణ కార్మిక సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును ఎత్తివేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి -మారగోని ప్రవీణ్కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో శనివారం నిమ్మటూరి రామకృష్ణ అధ్యక్షతన నాల్గవ మహాసభలు జరిగాయి. సభకు ముందు ఏఐటియుసి పతకాన్ని మారగోని ఆవిష్కరించారు. మహాసభలో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికులకు వేతనాలు అందడం లేదన్నారు. ఒకవైపు వేతన ఇబ్బందులతో పాటు మరో వైపు వలస కూలీల వలన బతుకు భారంగా మారుతుందన్నారు. వలస కూలీల కారణంగా స్థానిక కూలీలకు గిట్టుబాటు కూలీ లభించడం లేదన్నారు. సిపిఐకి చెందిన ఇంద్రజిత్ గుప్తా, చతురానన్ మిశ్రా కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా కొనసాగినప్పుడు అప్పటి ప్రధాన మంత్రి ఐకె గుజరాల్తో చర్చించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయించారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. సంక్షేమ బోర్డు 1996 కేంద్రంలో ఏర్పాటైతే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు కావడానికి 2009 వరకు పట్టిందన్నారు. 2004 నుంచి 2014 వరకు యుపిఏ ప్రభుత్వంలో రూ.7 వేల కోట్లు సంక్షేమ బోర్డుకు కేటాయిస్తే 2014 నుంచి ఇప్పటి వరకు బిజెపి పాలనలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 18 లక్షల మంది సభ్యులు తమ సభ్యత్వ రూపంలో రూ.1000 కోట్లు చెల్లించారన్నారు. ఆ డబ్బులను కూడా గత ప్రభుత్వం కాళేశ్వరానికి మళ్లించిందన్నారు. తిరిగి ఆ డబ్బులను సంక్షేమానికి కేటాయించాలని అదనంగా మరికొన్ని కేటాయింపులు జరపాలని ప్రవీణ్ కుమార్ కోరారు. భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ చెల్లించాలని నెలకు ఆరువేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో జరిగే ఆందోళనను కార్మికులు జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి క్లైమెంట్, జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, పిల్లి రమేష్, పి. మోహన్రావు, మల్లేష్, షేక్ ఇబ్రహీం, ఆహ్వాన సంఘం అధ్యక్షులు పగడాల మల్లేష్, రావుల హన్మంతరావు, ప్రతాపు రామనాథం, జొన్నలగడ్డ వెంకన్న, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గగన పరిధిని బీహార్‌కు విస్తరించిన ఆకాశ ఎయిర్

న్యూఢిల్లీ: భారతదేశపు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎయిర్ లైన్ ఆకాశ ఎయిర్ ఢిల్లీ నుండి రాకపోకలతో నేరుగా కనక్టివిటీని అందిస్తూ తమ నెట్‌వర్క్‌కి 28వ నగర గమ్యస్థానంగా బీహార్‌లోని దర్భంగా చేరికను ప్రకటించింది. ఇది ఏప్రిల్ 04, 2025 నుండి అమల్లోకి వస్తుంది. ఎయిర్ లైన్ ఢిల్లీ (ఢిల్లీలో విమానం మారవలసిన అవసరం లేదు) ద్వారా హైదరాబాద్, దర్భంగాల మధ్య విమానాలను రోజు ఆపరేట్ చేస్తుంది. పర్యాటక కేంద్రం, రెండు ప్రధానమైన మెట్రోస్ మధ్య కనక్టివిటీని మెరుగుపరుస్తుంది. ఈ ప్రారంభం ఎయిర్ లైన్ బీహార్ రాష్ట్రంలో ప్రవేశించిదానికి గుర్తుగా నిలిచింది. దేశవ్యాప్తంగా తమ కార్యకలాపాలను శక్తివంతం చేయడానికి ఎయిర్ లైన్ నిబద్ధతను ఇది పునరుద్ఘాటిస్తోంది. ప్రయాణికులు ఆకాశ ఎయిర్ వెబ్‌సైట్ ఆకాశ్‌ఎయిర్.కామ్‌లో, ఆండ్రాయిడ్, ఐఓఎస్ఎ యాప్ లేదా వివిధ ప్రముఖ ట్రావెల్ ఏజెంట్స్ ద్వారా విమానాలను బుక్ చేయవచ్చు.

టయోటా కిర్లోస్కర్ మోటార్ ఫిబ్రవరి 2025లో 13% వృద్ధి

బెంగళూరు: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) ఫిబ్రవరి 2025 నెలలో 28,414 యూనిట్ల అమ్మకాలను ప్రకటించింది. ఇది గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 13% పెరుగుదలను సూచిస్తుంది. తద్వారా బలమైన మార్కెట్ ఆమోదం మరియు, కస్టమర్ నమ్మకాన్ని బలోపేతం చేస్తుంది. దాని ఊపును పెంచుకుంటూ, అమ్మకాలలో పెరుగుదల ఫిబ్రవరి 2024లో అమ్ముడైన 25,220 యూనిట్లతో పోలిస్తే గణనీయమైన పెరుగుదలను సూచిస్తుంది, ఇది అన్ని టచ్ పాయింట్‌లలో అసమానమైన నాణ్యత, ఉన్నతమైన యాజమాన్య అనుభవాన్ని అందించడంలో టయోటా పెరుగుతున్న నిబద్ధతను మరింత పటిష్టం చేస్తుంది. దేశీయ మార్కెట్లో, టీకేఎం 26,414 యూనిట్లను విక్రయించింది. ఎగుమతులు 2000 యూనిట్లుగా ఉన్నాయి. ఇంకా, 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి 11 నెలల్లో, టీకేఎం మొత్తం 3,06,105 యూనిట్ల అమ్మకాలను సాధించింది. ఇది గత సంవత్సరం ఇదే కాలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 236,332 యూనిట్లు అమ్ముడయ్యాయని, దీని కంటే 30% వృద్ధిని ప్రతిబింబిస్తుంది.

ఫిబ్రవరి 2025లో టాటా మోటార్స్ 79,344 యూనిట్ల అమ్మకాల నమోదు

ముంబై: ఫిబ్రవరి 2025లో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో టాటా మోటార్స్ లిమిటెడ్ అమ్మకాలు ఫిబ్రవరి 2024లో 86,406 యూనిట్లతో పోలిస్తే 79,344 వాహనాలుగా ఉన్నాయి. మొత్తం దేశీయ అమ్మకాలు సంవత్సరంవారీగా చూస్తే 9% తగ్గదల కన్పించింది. 2024లో ఇదే కాలంలో 84,834 యూనిట్లు విక్రయించగా, ఈసారి అంటే 2025 ఫిబ్రవరిలో 77,232 అమ్మకాలు సాగించింది. ఇక వాణిజ్య వాహనాల విషయంలో హెసీవీ ట్రక్కులు 9,892, ఐఎల్ఎంసీవీ ట్రక్కులు 5,652, ప్యాసింజర్ క్యారియర్లు 4,355, ఎస్‌సీవీ కార్గో, పికప్ వెహికల్స్ 10,898, మొత్తంగా సీవీ స్వదేశీ అమ్మకాలు 30,797 యూనిట్లు విక్రయించింది. గత ఏడాది ఇదే నెలలో 33,567 అమ్మింది. ఇది 8% తగ్గుదలను చూపిస్తున్నది. ట్రక్కులు, బస్సులతో సహా ఫిబ్రవరి 2025లో ఎంహెచ్, ఐసీవీ దేశీయ అమ్మకాలు 15,940 యూనిట్లుగా ఉన్నాయి. ఫిబ్రవరి 2024లో 16,227 యూనిట్లు మాత్రమే ఉన్నాయి. ఇవి దేశీయ, అంతర్జాతీయ వ్యాపారం, ట్రక్కుల, బస్సులతో సహా, ఫిబ్రవరి 2024లో 16,663 యూనిట్లతో పోలిస్తే 16,693 యూనిట్లుగా ఉంది.

హ్యుందాయ్ ఫిబ్రవరి నెలవారీ అమ్మకాలు 58,727 యూనిట్లు

గురుగ్రామ్: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) ఫిబ్రవరి 2025లో మొత్తం నెలవారీ అమ్మకాలు 58,727 యూనిట్లు నమోదు చేసింది, ఇందులో దేశీయ అమ్మకాలు 47,727 యూనిట్లు, ఎగుమతి అమ్మకాలు 11,000 యూనిట్లు. ఈ అమ్మకాలపై వ్యాఖ్యానిస్తూ, హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ హోల్-టైమ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 2025లో ఎగుమతి అమ్మకాలలో 6.8% వృద్ధితో, ప్రపంచవ్యాప్తంగా హ్యుందాయ్ బలమైన ఆమోదాన్ని ప్రతిబింబిస్తూ, మా మేడ్-ఇన్-ఇండియా ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోందన్నారు. ఎగుమతులను ఆప్టిమైజ్ చేయడం ద్వారా, హ్యుందాయ్ మోటార్ కంపెనీకి కీలకమైన ఎగుమతి కేంద్రంగా హెచ్ఎంఐఎల్ స్థానాన్ని బలోపేతం చేస్తామన్నారు. దేశీయ అమ్మకాల విషయంలో, భౌగోళిక రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ, 2025 కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదిత పన్ను సంస్కరణలు, మెరుగైన లిక్విడిటీ మార్కెట్‌కు చాలా అవసరమైన డిమాండ్ బూస్ట్‌ను అందిస్తాయని ఆశిస్తున్నామన్నారు.

23 నుంచి హైదరాబాద్‌లో రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్

హైదరాబాద్: రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హైదరాబాద్ ముస్తామవుతోంది. రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్: పారలల్ వెర్స్ పేరుతో చలనచిత్రోత్సవం మార్చి 21 నుండి మార్చి 23, 2025 వరకు హైదరాబాద్‌లో జరుగుతుంది. తెలుగు సినిమాల్లో క్లాసిక్స్‌గా గుర్తింపుపొందిన మన్మథుడు, పుష్పక విమానం, క్షణ క్షణం, హ్యాపీ డేస్, నేనే రాజు నేనే మంత్రి, ఆదిత్య 369, మరిన్నె చిత్రాలను రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పెద్ద తెరపై ప్రదర్శించనున్నారు. వీటిలో మాస్టర్‌క్లాస్‌లు, ఫైర్‌సైడ్ చాట్‌లు, స్టార్-ప్యాక్డ్ లైనప్ మూవీలన్నీ ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా 70కిపైగా టైటిల్స్‌ను ప్రదర్శిస్తారు.

'రాజ్యాంగ నిర్మాణం-అంబేద్కర్ పాత్ర'పై జస్టిస్ కొండా మాధవరెడ్డి స్మారక ఉపన్యాసం

హైదరాబాద్: నరేంద్ర దామోదర్ జాదవ్, మాజీ రాజ్యసభ సభ్యుడు, సావిత్రీబాయి పూలే పూణే విశ్వవిద్యాలయం మాజీ వైస్-ఛాన్సలర్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ చీఫ్ ఎకనామిస్ట్, జస్టిస్ కొండా మాధవ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన వార్షిక జస్టిస్ కొండా మాధవరెడ్డి స్మారక ఉపన్యాసం "55 సంవత్సరాల రాజ్యాంగ నిర్మాణం మరియు డాక్టర్ బి.ఆర్ పాత్ర" అనే అంశంపై హైదరాబాద్, దోమల్‌గూడలోని ఏవీ కళాశాలలో ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. చేవెళ్ల నియోజకవర్గ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులందరికీ నాణ్యమైన చదువుతో పాటు మెరుగైన వసతులను కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని నటరాజ్ నగర్ ప్రభుత్వ వెనకబడిన కులాల బాలుర కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, రీడింగ్ రూమ్ అదనపు కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ నిర్వహణకు సంబంధించి అన్ని రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులందరికీ స్వయంగా భోజనాన్ని వడ్డించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి బాగోగులను తెలుసుకున్నారు. విద్యార్థులందరికీ అన్నిపూటల మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. విద్యార్థుల చదువుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ, ఖచ్చితమైన సమయపాలన పాటిస్తూ చక్కగా చదువుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన కులాల అధికారి వి. రాజేశ్వర్ గౌడ్, ఎస్ డబ్ల్యూఓ డి. లత, ఎస్ డబ్ల్యూఓ ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

జారుడుబండపై ఆర్థిక వ్యవస్థ

మూడవసారి మోదీ సర్కారు అధికారంలోకి వచ్చి నవమాసాలూ నిండాయి. 2024 సార్వత్రిక ఎన్నికలలో మోదీ నాయకత్వంలోని బీజేపీకి సంపూర్ణమైన మెజారిటీ రాకపోయినా నితీశ్ కుమార్ నాయకత్వంలోని జె.డి.(యు), చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగు దేశం పార్టీ సాయంతో ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగారు. మొదటి రెండు సార్లు మోదీ ప్రభుత్వం ఉన్నంత దృఢంగా మూడవ సారి ఏర్పాటు చేసిన ప్రభుత్వం అంత పదిలంగా లేదు. అనేక సవాళ్లను ఎదుర్కోవలసి వస్తోంది. మోదీ నాయకత్వంపై ప్రజలలో మునుపటంతటి నమ్మకమూ లేదు. మోదీ ప్రభుత్వం తమ కోసం ఏమో చేస్తుందన్న విశ్వాసం ప్రజల్లో కనిపించడం లేదు. దేశంలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ మోదీ పలుకుబడి బాగా దిగజారింది. ఆయన ఆకర్షక శక్తి కూడా పాలిపోతోంది. ఇటీవల మూడు శాసన సభ ఎన్నికలలో బీజేపీ విజయం సాధించినా మోదీ బలహీనంగానే కనిపిస్తున్నారు. మోదీ నాయకత్వంలో ఎన్నికల్లో విజయం సాధించడానికి ఆయన ప్రయోగించే మాయోపాయాలు ప్రధాన కారణం. ఈ విజయాలు బీజేపీ పలుకుబడిని, బలాన్ని ఏ మాత్రం ప్రతిబింబించడం లేదు. మోదీ ఏలుబడి బలహీన పడడానికి సంకేతం గత అయిదు నెలల నుంచి షేర్ మార్కెట్ నిరంతరం దిగజారడం, ఆర్థిక వ్యవస్థ దుర్బలం అయి పోవడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరో వేపు రూపాయి విలువ జారుడుబండ మీదకు చేరిపోయింది. రూపాయి ఇంత బలహీనంగా ఎన్నడూ లేదు. స్థూల జాతీయ ఉత్పత్తి కూడా జారుడు మెట్ల మీదే ఉంది. గిరాకీకి, సరఫరాకు మధ్య ఉన్న వ్యత్యాసం తగ్గుతున్న జాడలే లేవు. ఆర్థిక వ్యవస్థలో కనిపిస్తున్న దీనావస్థ, పోషకాహార లోపం స్పష్టంగా ద్యోతకం అవుతున్నాయి. తనకు తానే విశ్వగురువు అని చెప్పుకుంటున్న మోదీ పరిస్థితి ట్రంప్ రెండో సారి అమెరికా అధ్యక్షుడు అయిన తరవాత దయనీయంగా తయారైంది. అమెరికాలో అక్రమంగా నివాసం ఉంటున్న భారతీయులకు సంకెళ్లు వేసి మూడు విడతలుగా పంపిస్తే మోదీలో ఇసుమంతైనా చలనం కనిపించలేదు. చిన్న చిన్న దేశాలు ట్రంప్ దాష్టీకాన్ని ప్రతిఘటిస్తున్నా మోదీ మాత్రం నోరు మెదపలేని స్థితిలో పడి పోయారు. ఇటీవల మోదీ అమెరికా పర్యటనలో అమెరికాకు ఇచ్చిందే ఎక్కువ. మనకు ప్రయోజనకరమైన విషయాలలో సాధించింది తక్కువ. ట్రంప్ ఎదుట మోదీ మోకరిల్లినట్టు స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. ఆర్థికంగా బలంగా ఉన్నప్పుడే ఏ దేశ ప్రతిష్ఠ అయినా పెరుగుతుంది. కానీ మన ఆర్థిక స్థితి కునారిల్లిపోతూనే ఉంది. ఈ సంకట స్థితి నుంచి బయట పడడానికి మోదీకి సలహా ఇచ్చే బృందమే కనిపించడం లేదు. కనిపించడం లేదనడంకన్నా ఆయన పక్కన ఎవరి అస్తిత్వాన్నీ మోదీ సహించరనడమే సబబు. స్టాక్ మార్కెట్ సూచిక (సెన్సెక్స్) దేశ ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబిస్తుందంటారు. అయితే ఈ సూచిక నిజానికి ఊహాజనితం అయిందే. మార్కెట్‌ను నియంత్రించే సెక్యూరిటీస్ బోర్డ్‌కు మొన్నటి దాకా మోదీ అడుగులకు మడుగులెత్తే మాధవీ బుచ్ అధిపతిగా ఉన్నారు. ఆమె మార్కెట్‌ను నియంత్రించడం, స్టాక్ మార్కెట్‌లో మదుపు పెట్టే వారి ప్రయోజనాలు పరిరక్షించడం లాంటి పనులు ఎన్నడూ చేయలేదు. పైగా మార్కెట్ ను అతలా కుతలం చేసే వారితో, అదానీ లాంటి వారి ఘాతుకాలు బయట పడకుండా చూడడంలో నిమగ్నమయ్యారు. ఆర్థిక వ్యవస్థ కుదేలు కావడంలో మాధవీ బుచ్ నిర్వాకమూ తక్కువదేమీ కాదు. గత అయిదు నెలల కాలంలో స్టాక్ మార్కెట్ 92 లక్షల కోట్ల నష్టాన్ని చవి చూసింది. ఈ సొమ్మంత ప్రజల కష్టార్జితమే. దీన్ని పరిరక్షించలేక పోవడం ఆర్థిక వ్యవస్థ దిగజారడానికి ప్రధాన కారణాల్లో ఒకటి. సెన్సెక్స్ ఆర్థిక సంవేదనను ప్రతిబింబిస్తుందంటారు. కానీ మోదీ హయాంలో సంవేదనను కాపాడడం మాట అటుంచి సంవేదన అన్న మాటకు అర్థమే లేకుండా పోయింది.

పెట్టుబడిదార్లు విదేశాల వేపు చూస్తున్నారు. విదేశీ పెట్టుబడిదార్లు లాభాలు నొల్లుకు పోతున్నారు. మన స్టాక్ మార్కెట్ నుంచి నిధులు భారీ స్థాయిలో ఉపసంహరిస్తున్నారు. మన దేశంలోని పెట్టుబడి దార్ల చూపు కూడా విదేశాల వేపే ఉంది. కొంత మంది చైనాలో పెట్టుబడి పెట్టడానికి ఆత్ర పడుతూ ఉంటే ఇంకొందరు ఆర్థిక వ్యవస్థ పచ్చగా కనిపించే దేశాలకు తరలి పోతున్నారు. స్టాక్ మార్కెట్‌లో ఎగుడు దిగుళ్లు రోజువారీ వ్యవహారం. అవి మన ఆర్థిక వ్యవస్థ రూపు రేకలను స్పష్టంగా పొడకట్టించక పోవచ్చు. కానీ స్టాక్ మార్కెట్ కచ్చితంగా ఒక కొలమానం కిందే లెక్క. మార్కెట్ సెంటిమెంట్ (సంవేదన) మీద ఆధారపడి ఉంటుందంటారు. ఏ చిన్న అంశమైనా ఈ సెంటిమెంటును ప్రభావితం చేయవచ్చు. కానీ ప్రస్తుతం స్టాక్ మార్కెట్‌లో కనిపిస్తున్న ఎగుడుదిగుళ్లు ఒక రోజో, ఒక నెలకో పరిమితం కావడం లేదు. నిరంతరం దిగజారుడు ధోరణే కనిపిస్తోంది. ఇలాంటి స్థితిలో అమెరికా మన దేశంపై అధిక సుంకాలు విధించినా నష్టం ఉండదు. రూపాయి విలువ తగ్గుతున్నా బాధ లేదు అని ప్రభుత్వ పక్షం వాదించడం విడ్డూరం. రూపాయి విలువ నిరంతరం తగ్గుతుండడంవల్ల మన దిగుమతులపై తీవ్ర ప్రభావం పడ్తుంది. ఎందుకంటే దిగుమతి చేసుకునే సరుకుకు మనం డాలర్లలో చెల్లిస్తాం. అంటే దిగుమతుల భారం పెరుగుతుంది. ఇది ధరల పెరుగుదలకు దారి తీస్తుంది. అంతిమంగా అది గిరాకీ తగ్గడానికే ఉపయోగపడ్తుంది. ఇది కచ్చితంగా ఆర్థికవ్యవస్థ కునారిల్లి పోవడానికి సంకేతం. రూపాయి విలువ తగ్గుతున్నప్పుడు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నిస్తుంది. ఇప్పుడు అదీ కనిపించడం లేదు. ఒక వేళ రిజర్వు బ్యాంకు జోక్యం ప్రభావం ఉంటుందనుకున్నా కేవలం దానివల్లే ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం సాధ్యం కాదు. పెరుగుదల ప్రశ్నే ఉండదు. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందన్న ఆశ ప్రజల్లో అడుగంటితే పరిస్థితి మరీ భయంకరంగా తయారవుతుంది. ప్రజల విశ్వాసం చెదిరి పోవడం ఆర్థిక వ్యవస్థను మరింత సంకట స్థితిలో పడేస్తుంది. ఇటీవల లోకసభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కూడా దిల్లీ శాసనసభ ఎన్నికలలో విజయం సాధించడానికి మధ్య తరగతి వారికి తాయిలాలు ప్రకటించారే తప్ప ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి చేసిందేమీ లేదు. మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలలో దివాలా కోరుతనం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. స్టాక్ మార్కెట్‌లో గానీ, ఎక్స్ చేంజ్ మార్కెట్‌లో గానీ ప్రజల్లో విశ్వాసం కల్పించడంలో మోదీ ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమవుతోంది. నిరుద్యోగ సమస్య భారం ఆర్థిక వ్యవస్థపై చాలా తీవ్రంగా ఉంటుందన్న జ్ఞానమే ఈ ప్రభుత్వానికి ఉన్నట్టు లేదు. మన ఆర్థికాభివృద్ధి రేటు కనీసం ఎనిమిది శాతమైనా ఉండాలి. మొన్నటి దాకా ఇది అయిదు శాతానికి కొంచెం ఎక్కువగా ఉంటే ఇప్పుడు ఆరు శాతానికి చేరిందంటున్నారు. ఇంకా గమ్యం చాలా దూరంలోనే ఉంది.

గిగ్ కార్మికులకు కపటపు మాటలు

కృష్ణఝా

అసంఘటిత రంగ కార్మికులకు కల్పించినట్టు గిగ్ కార్మికులకూ ప్రయోజనాలు కల్పిస్తామని కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న విధానం అమలు జరగదని స్పష్టమైంది. లక్షలాది మంది కార్మికులకు గుర్తింపు కార్డులు ఇస్తామని, తద్వారా వారికి మేలు జరుగుతుందని చెప్పడం మాటలకే పరిమితం. వాస్తవంగా వాగ్దానం ఎందుకూ ఉపయోగం లేనిదని బడ్జెట్‌లో పేర్కొన్న విషయాలు తెలియజేస్తున్నాయి. కేవలం వాగ్దానాల వల్ల ఒరిగేదేమీ ఉండదని ఈ పదేళ్లలో బీజేపీ నాయకుడు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం చేసిన వందలాది వాగ్దానాలు మనకు తెలియజేస్తున్నాయి. అంతేకాదు గుర్తింపు కార్డులు ఇస్తామని వాగ్దానం చేశారు. ఈ కార్డుల మూలంగా గిగ్ కార్మికులకు కలిగే ప్రయోజనమేమిటో మాత్రం చెప్పలేదు. అసంఘటిత రంగ కార్మికులకు కల్పించిన ప్రయోజనాలను గిగ్ కార్మికులకు కల్పిస్తామని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు కల్పించారో మాత్రం చెప్పలేదు. గిగ్ కార్మికులకు వైద్య బీమా కల్పిస్తామన్న వాగ్దానం కేవలం తెల్ల కాగితమే. ప్రమాదాలు జరిగినప్పుడు లేదా తీవ్రమైన జబ్బు చేసినప్పుడు మాత్రమే కొంత ప్రయోజనం ఉంటుందని భావించాలి. అది కూడా 5 లక్షల రూపాయల వరకు బీమా ఉంటుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు.

ఈ కార్మికుల పేర్లను నమోదు చేసి వారి భద్రతకు బీమా ప్రీమియంను ప్లాట్‌ఫారమ్ కంపెనీలు చెల్లించే అవకాశం ఉండదు. అందువల్ల ప్రభుత్వం తప్పనిసరిగా ఈ కార్మికులకు బీమాను వర్తింపజేసే అవకాశం ఉండదు. జాతీయ స్థాయిలో సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయడానికి చట్టాన్ని రూపొందించాలని గిగ్ కార్మికులు పోరాటం చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. కనీసం వారి పరిస్థితులను అధ్యయనం చేసి తగిన సమాధానం కూడా ఇచ్చిన వాళ్లు లేరు. లక్షల మంది ఎలాంటి ప్రభుత్వ సహాయం లేకుండా ఎన్నో అవస్థలు పడి జీవిస్తున్నారు. ఏమాత్రం హృదయంలేని పాలకులు దేశ వ్యాప్తంగా ఎంతో కష్టపడి పనిచేసే కార్మికులకు పట్టి మాటలతో సరిపుచ్చారు, గిగ్ కార్మికుల పని పరిస్థితులు ఎంతో ఆందోళనకరంగా ఉంటాయి. వాటి ఆదాయాలు అతి తక్కువ, పనుల్లో స్థిరత్వం ఉండదు. ఒక యజమాని తప్పనిసరిగా నెలవారీ వేతనంతో ఉద్యోగిని పని చేయించుకుంటాడన్న హామీ కూడ ఉండదు. వారి చిన్న చిన్న కోర్కెలను కూడా యజమాని తీర్చే పరిస్థితి ఉండదు. బానిస కార్మికులు లాగా పని చేయవలసి వస్తోంది. యజమాని పని వాళ్లకు అందుబాటులో ఉండడు. ఏదైనా ప్రమాదం జరిగినా, అత్యవసరంగా డబ్బు కావలసి వచ్చినా ఇవ్వడానికి యజమాని సిద్ధంగా ఉండడు. అయితే గిగ్ వ్యవస్థ ఏర్పడి ప్రభుత్వానికి ఎంతో కొంత ప్రయోజనం కల్పిస్తోంది. ప్రభుత్వం మాత్రం గిగ్ కార్మికులకు ఎలాంటి సహాయాన్ని అందించటం లేదు. ఆలిండియా గిగ్ ప్లాట్‌ఫారం ప్రధాన కార్యదర్శి, ఆప్ ఆధారిత వర్కర్స్ యూనియన్ వీరి కోసం పని చేస్తాయి. ఈ యూనియన్‌లు రవాణా, ఆహార రంగాలలో పనిచేస్తున్నాయి. గత పది సంవత్సరాలుగా తమ యూనియన్ గిగ్ కార్మికులకు, క్యాబ్ డ్రైవర్లకు చట్టపరమైన హక్కులను కల్పించాలని పోరాడుతున్నట్టు ఆలిండియా గిగ్ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి చెప్పారు. ఉబర్, ఓలా, ఆటోల డ్రైవర్లకు మెరుగైన జీవనం కోసం తగిన చట్టాలను కల్పించాలని కోరుతున్నారు.

సమాజంలో అత్యంత వేగంగా వస్తున్న మార్పులకు గిగ్ కార్మికులు ముందు సూచికలు. ఆర్థిక వ్యవస్థలో వేగంగా వచ్చిన డిజిటల్ మార్పులు ఆర్థిక రంగంలో సైతం మనకు కనిపిస్తాయి. ఈ కార్మికులు కొత్తరకం బానిసల్లాగా పని చేస్తున్నారు. యజమానులు ఏనాడు కార్మికులకు అందుబాటులో ఉండరు. నూతన ఆర్థిక రంగం ఏర్పడటంతో దోపిడీ వ్యవస్థ అవతరించింది. గిగ్ ఆర్థిక రంగం తలెత్తింది. 2000 సంవత్సరంలో ఆర్థిక, పారిశ్రామిక రంగాలు డిజిటల్ రూపం మారడం ప్రారంభమయింది. ఇంటర్నెట్ మాదిరిగా సమాచారం, కమ్యూనికేషన్‌లు, సాంకేతికత అభివృద్ధి చెందాయి. స్మార్ట్ ఫోన్‌లు విరివిగా మార్కెట్‌లోకి వచ్చాయి. ఈ వేదికలన్నీ డిజిటల్ సాంకేతికత ఆధారంగా ఉద్యోగాలు ఏర్పడ్డాయి. ఇవి అభివృద్ధి చెందే కొద్దీ ఉద్యోగాలు పెరిగాయి. సాధారణంగా "పని" అనేది పూర్తి సమయం ఉద్యోగంగా పరిగణించాలి. అంటే స్థిరమైన ఉద్యోగాలు. వీటి వల్ల జీవనానికి అవసరమైనంత ఆదాయం లభిస్తుంది. గిగ్ కార్మికులు లాంటి పనులు చేసేవారికి ఉద్యోగాల స్థిరత్వం ఉండదు. యజమానులు తమకు ఇష్టం వచ్చినప్పుడు ఈ ఉద్యోగులను తొలగిస్తారు. వారికి లభించే ఉద్యోగాలను అనుసరించి ఆర్థిక పరిస్థితి మారుతూ ఉంటుంది. వారి ఆర్థిక పరిస్థితులు మారిపోతుంటాయి. సాంకేతికతమైన మార్పులు కూడా వారి జీవితాల్లో ఉంటాయి. పని కూడా ఎప్పుడూ మారుతూ ఉంటుంది. స్థిరత్వం లేని ఈ పనులకు ప్రభుత్వం ఎలాంటి సహాయాన్ని అందించదు. ఇప్పటికైనా దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న లక్షలాది గిగ్ కార్మికులకు స్థిరమైన ఆదాయం లభించడానికి, విద్యా, వైద్య సౌకర్యాలను అందించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఈ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

'హోదా'కు పట్టిన గతి పోలవరానికి పడుతుందా!

వి. శంకరయ్య

నవ్యాంధ్రప్రదేశ్‌కు విభజన తర్వాత రెండు రకాలుగా రాయితీలు, సాయం అందవలసి వుంది. ఒకటి చట్టబద్ధత గలవైతే, రెండు పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు. ఈ హామీల్లో ప్రధానమైనది ప్రత్యేక హోదా. రెండవది వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేకంగా పథకాలు. విచారకరమేమంటే ఈనాటికి చాల మంది రాష్ట్ర విభజనకు కాంగ్రెస్ పార్టీ ఒక్కటే కారణమని భావిస్తున్నారు - కాని వాస్తవంలో బీజేపీకీ సమాన పాత్ర వుంది. ఆ నాడు చట్ట సభల్లో విభజన చట్టం ఆమోదం పొందే బలం కాంగ్రెస్‌కు లేదు. బీజేపీ అంగీకరించిన తర్వాతనే కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనకు తలపడింది. అంతక్రితం కొన్ని ఏళ్ల క్రితమే కాకినాడ సభలో బీజేపీ చిన్న రాష్ట్రాలకు అనుకూలంగా తీర్మానం చేసిన విషయం తెలిసిందే. 2014 ఫిబ్రవరి 20 వతేదీ రాజ్యసభలో (ఆ పాటికే పార్లమెంటు ఆమోదించింది.) విభజన చట్టంపై చర్చ జరుగుతున్నప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అయిదేళ్ల కాలం ప్రతిపాదన చేస్తే అప్పటి బీజేపీ సభ్యులు వెంకయ్య నాయుడు దివంగత అరుణ్ జెట్లీ పదేళ్ల కాలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యసభలో ఇచ్చిన హామీ మేరకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కేంద్ర మంత్రివర్గంలో ఆమోదించారు. ఇక మిగిలినదల్లా ప్లానింగ్ కమిషన్‌లో ఆమోదం పొంది జాతీయాభివృద్ధి మండలి ఆమోదించితే ప్రత్యేక హోదా అమలులోనికి వస్తుంది. ఇది రొటీన్ ప్రక్రియ. కాని బీజేపీ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఏం జరిగింది? పైగా 2014 ఎన్నికల ప్రచారం సందర్భంగా తిరుపతి బహిరంగ సభలో హామీ ఇచ్చిన నరేంద్ర మోదీ ప్రధాని చేపట్టిన తర్వాత నవంబర్ వరకు వివిధ కారణాలతో కాలయాపన చేసి అంతిమంగా ప్లానింగ్ కమిషన్ రద్దు చేసి నీతి ఆయోగ్ వ్యవస్థ అమలులోనికి తెచ్చి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే అంశానికి కర్మ క్రతువులు పూర్తి చేశారు. గమనార్హమైన అంశమేమంటే దేశంలో ఏ రాష్ట్రానికి చట్టం ద్వారా ప్రత్యేక హోదా ఇచ్చిన సందర్భం లేకున్నా నిస్సిగ్గుగా రాష్ట్ర విభజన చట్టంలో లేదనే వాదన తెరపైకి తెచ్చారు. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 46(3) మేరకు రాష్ట్రంలో వెనుకబడిన ఏడు జిల్లాలకు ప్రత్యేక పథకాలు అమలు చేయాలి. ఈ సందర్భంగా కూడా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాష్ట్రంలో వెనుకబడిన ఏడు జిల్లాలకు బుందేల్‌ఖండ్, కలహండి, కోరాపుట్, బోలంగీర్ తరహాలో ప్రత్యేక పథకాలు అమలు జరుగుతాయని చెబితే బీజేపీ సభ్యులు అందుకూ ఆమోదం తెలిపారు. ఆచరణలో ఏమైందీ చెప్పే పనిలేదు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి పదవి చేపట్టి తర్వాత బీజేపీ రాజకీయ ప్రయోజనం లేనిదే ఏ ఒక్క రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చిన జాడ లేదు.

రెండేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వ్యాపించి ఉన్న బుందేల్‌ఖండ్ ప్రాంతం అభివృద్ధికి 44,650 కోట్ల రూపాయల వ్యయంతో యమునా నది ఉప నదులైన కెన్ బెత్వా నదుల అనుసంధానం పథకం కింద కేంద ప్రభుత్వం చేపట్టింది. తొలి ఏడే కేంద్ర బడ్జెట్ లో 6,700 కోట్లు కేటాయించారు. విద్యుదుత్పాదన, తాగునీటి వ్యయం కూడా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. కాని ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన ద్రోహం ఏమంటే రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 90 మేరకు చట్టబద్ధత గల పోలవరం ప్రాజెక్టుకు ఏ ఏడాది కేంద బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోగా తాగునీటి వ్యయం భరించేందుకు నిరాకరించింది. జగన్‌మోహన్ రెడ్డి తన హయాంలో కేంద ప్రభుత్వంతో లాలూచీ పడినందున పోలవరం ప్రాజెక్టు తొలి దశ అనే దిక్కుమాలిన విధానం తెర మీదకు వచ్చింది. అంతిమంగా, జాతీయంగా రాష్ట్రంలోనూ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తొలి దశకు కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. అయితే మలి దశ భవిష్యత్తు యక్ష ప్రశ్నగానే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మిగిలింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నుంచి రెండవ దశ గురించి పిసరంత కూడా సమాచారం రావడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకటి రెండు మార్లు మలి దశ గురించి ప్రస్తావన చేశారు. కేంద్రం నుంచి ఎట్టి స్పందనా లేదు. గతంలో తన హయాంలో 2019లో సాంకేతిక సలహా మండలి పూర్తి స్థాయిలో డీపీఆర్ ఆమోదించినట్లు ఇప్పుడు ముఖ్యమంత్రి తుది డీపీఆర్ ఆమోదం పొందవలసి ఉంది. అది సాధించితేనే ప్రాజెక్టుకు సార్థకత ఏర్పడుతుంది. ఇప్పుడు అందరూ 2027 కల్లా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామంటున్నారు. ఒక వేళ పూర్తి అయినా 41.15 మీటర్ల స్థాయికే కదా అనే ఆందోళన రాష్ట్ర ప్రజల గుండెల్లో గుర్రపు డెక్క దెబ్బలాగా తగులుతోంది.

పోలవరం ప్రాజెక్టు పట్ల కేంద్ర ప్రభుత్వం వైఖరి తొలి నుంచి అనుమానాస్పదంగా వుంది. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీ ప్రత్యేక హోదాకు పట్టించిన దుర్గతి కళ్ల ముందు వుంది. పోలవరం ప్రాజెక్టు తొలి దశ అనే ప్రతిపాదన రాగానే రాష్ట్ర ప్రజలు కేంద్ర ప్రభుత్వ వైఖరిని శంకించే పరిస్థితి నెలకొంది. విభజన చట్టంలో పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు.



కేంద్ర ప్రభుత్వమే తన నిధులతో పూర్తిగా నిర్మించాలని నష్ట పరిహారం పునరావాసం ఖర్చు కేంద్రమే భరించాలని పర్యావరణ అటవీ అనుమతులు కేంద్రమే తీసుకు రావాలని స్పష్టంగా వుంది. అయితే ఆదిలోనే హంసపాదు అన్నట్లు తాగునీటి వ్యయం భరించబోమని మినహాయించింది. విద్యుత్ ప్లాంట్ సరేసరి. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడి హయాంలో జరిగిన అంశాలు పునశ్చరణ చేసేపనిలేదు. ఒక వేపు టీడీపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేస్తూ రాష్ట్ర ప్రజల ముందు దోషిగా నిలబడకూడదని వ్యూహాత్మకంగా 2019 ఫిబ్రవరిలో కేంద్ర జల శక్తి శాఖకు చెందిన సాంకేతిక సలహా మండలి సమావేశమై ప్రాజెక్టు రెండవ డీపీఆర్‌ను 2017-18 షెడ్యూల్ రేట్లతో 55 వేల కోట్ల రూపాయలతో ఆమోదించారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోనికి వచ్చిన తర్వాత దురదృష్టం కొద్దీ కాంట్రాక్టర్ మార్పుతో ఆ సంవత్సరం గడచి పోయింది. ఇప్పటికీ చాలా మంది కేవలం జగన్‌మోహన్ రెడ్డినే నిందిస్తారు గాని 2019 ఎన్నికల ప్రచారంలో పోలవరం ప్రాజెక్టుగా ఏటీఎంగా ఉపయోగ పడిందని చంద్రబాబు నాయుడు పైన బురద చల్లిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పోలవరం ప్రాజెక్టు యెడల శ్రద్ధ వుండి వుంటే జగన్‌మోహన్ రెడ్డితో గట్టిగా చెప్పి వుంటే కాంట్రాక్టర్ మార్పు జరిగేది కాదు. ఒక సంవత్సరం వృథా అయ్యేది కాదు. ఈ రోజు ప్రాజెక్టు నిర్మాణం మొదటి కొచ్చేది కాదు. ఇందుకు ఇద్దరూ బాధ్యులే. తిరిగి 2020లో గాని సవరించిన వ్యయం అంచనాల కమిటీ సమావేశం జరగ లేదు. అప్పుడే కేంద్ర ప్రభుత్వ ద్రోహ బుద్ధి బయట పడింది. 2017లో కేంద్ర మంత్రి వర్గం ఆమోదించినదని 2013-14 షెడ్యూల్ రేట్లతో ఒక డీపీఆర్ 2017-18 నాటి డీపీఆర్ లతో మరొక డీపీఆర్ ఆమోదించింది. ఇక్కడ రెండు అంశాలున్నాయి. 2019 ఫిబ్రవరిలో సమావేశమైన సాంకేతిక సలహా మండలి కేంద్ర మంత్రి వర్గం చేసిన తీర్మానాన్ని ఎందుకు దాచి పెట్టింది? పైగా పార్లమెంటు ఆమోదించిన రాష్ట్ర విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి నిధులతో నిర్మించాలని వుండగా తదుపరి కేంద్ర మంత్రి వర్గం ఎలా ఈ తీర్మానం చేస్తుంది? కేంద్ర మంత్రి వర్గానికి ఈ అధికారమెక్కడిది?

ఆంధ్రప్రదేశ్‌కు ఈ ఒక్క అంశంలోనే కాదు. అనేక సందర్భాల్లో రాజ్యాంగ ఉల్లంఘనకు కేంద్ర ప్రభుత్వం తలపడింది. కృష్ణానదీ జలాల పంపిణీ అంశంలో ఎలా వ్యవహరించాలనో విభజన చట్టంలో స్పష్టత వుంది. అంతర్ రాష్ట్ర జల వివాద చట్టం కింద ట్రిబ్యునల్ నియమించాలని చట్టంలో లేదు. జగన్‌మోహన్ రెడ్డి కేసీఆర్‌తో షరీక్ కావడంతో ఆ అవకాశం అందిపుచ్చుకొన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2023 ఎన్నికల్లో తెలంగాణలో లబ్ధి పొందేందుకు కొత్తగా ట్రిబ్యునల్ వేసి ఆంధ్రప్రదేశ్‌ను బలి పశువు చేసింది. అంతిమంగా జగన్‌మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయ లేక 2022 జులై 19 వతేదీ పది వేల కోట్ల రూపాయలు అడ్‌హాక్‌గా ఇస్తే 41.15 ఎత్తుకు పోలవరం పూర్తి చేస్తానని చేసిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఆమోదించే దశలో ఎన్నికలు రావడం జరిగి బీజేపీతో కలసి కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోనికొచ్చింది. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రెండేళ్ల కాలం మీన మేషాలు లెక్కించిన కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం నిధులు విడుదల చేసి అమలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం కూడా 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి ఉత్తరాంధ్రకు నీళ్లు ఇస్తామని చెబుతున్నది గాని పూర్తి స్థాయి 45.72 మీటర్లు ఎత్తుకు నిర్మాణానికి అవసరమైన నిధులు గాలిలో దీపంగా వుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి గాని ఎవరి నుంచి కూడా ఈ అంశంపై నోట మాట రావడం లేదు. పోలవరం కాలువల సిల్ లెవల్ 35.74 మీటర్లుగా వుంది. కేవలం ఎండీడీఎల్ స్థాయి 41.15 మీటర్ల ఎత్తు వరకే నిర్మాణం జరిగితే 115 టీఎంసీలు నీళ్లు మాత్రమే వుంటాయి. గ్రావెటీతో ఏ మేరకు నీళ్లు ఇస్తారు?

పోలవరం ప్రాజెక్టుకు ముందుంది ముసళ్ల పండుగ. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్ల స్థాయికి పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి చేయాలంటే ఒక్క నష్ట పరిహారం పునరావాసానికే దాదాపు 30 వేల కోట్ల రూపాయల అవసరమౌతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం మెడలు ఎంత వరకు వంచి పూర్తి స్థాయి డీపీఆర్ ఆమోదం పొందుతారో దాన్ని బట్టి పోలవరం ప్రాజెక్టు భవితవ్యం ఆధారపడి ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్లు స్థాయికి నిర్మాణం జరిగితేనే విశాఖ తాగు నీటికి గాని ఉత్తరాంధ్ర సుజల ప్రవంతికి నీళ్లు ఇవ్వ గలరు. అంతేకాదు గోదావరి బనకచర్ల అనుసంధానం సాధ్యం కావాలన్నా పోలవరం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిర్మాణం జరగాలి. లేకుంటే ఒక బ్యారేజీగా మిగిలి పోతుంది.

విశ్రాంత పాత్రికేయులు 9848394013

ప్రజల గొంతుక ప్రజానాట్య మండలి

ఆర్వీ రామారావ్

రచయితలకు, కళాకారులకు రాజకీయాలతో సంబంధం లేదని వాదించే వారికి ఈ నాటికీ కొదవ లేదు. వారికీ నిర్దిష్టమైన రాజకీయ సిద్ధాంతం ఉండాలని నిరూపించింది కమ్యూనిస్టు పార్టీ. 1936లో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘానికి అంకురార్పణ జరిగింది. సజ్జాద్ జహీర్, ముల్క్ రాజ్ ఆనంద్, కె.ఎ.అబ్బాస్, అలీ సర్దార్ జాఫ్రీ, కైఫీ అజ్మీ, రాజేందర్ సింగ్ బేడీ లాంటి వారు ఎందరో అభ్యుదయ రచయితలు.

అభ్యుదయ రచయితల సంఘంలో కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే బెంగళూరుకు చెందిన కుమారి అనిల్ డి సిల్వాకు ప్రజానాట్య మండలి ఏర్పాటు చేయాలన్న ఆలోచన తట్టింది. ఈ భావన దావానలంలా వ్యాపించి అఖిలభారత స్థాయిలో 1943లో ప్రజానాట్య మండలి (ఇండియన్ పీపుల్స్ థియేటర్) ఏర్పడడానికి దోహదం చేసింది. దేశంలోని అప్పటి బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా కళాకారులు, గాయకులు, నటులు ప్రజానాట్య మండలి ఏర్పాటు చేయడానికి దారి తీసింది. పాటలు, నాటకాలు, బ్యాలేలు మొదలైన వాటిని వలసవాద పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి ప్రజానాట్య మండలి విశాల వేదిక అయింది. అత్యంత ప్రతిభావంతులైన వివిధ కళా రూపాలకు చెందిన ప్రసిద్ధులు ప్రజానాట్య మండలి వేపు ఆకర్షితులయ్యారు.

పృథ్వీ రాజ్‌కపూర్, బలరాజ్ సాహ్నీ, దమయంతి సాహ్నీ, చేతన్ ఆనంద్, ఉమా ఆనంద్, ఉజ్రా, హమీద్ భట్, రమేశ్ థాపర్, సర్జూ పాండే, షౌకత్ కైఫీ, కిషన్ చందర్, ఇస్మత్ చుగ్తాయ్. కర్తార్ సింగ్ దుగ్గల్, విశ్వ మిత్ర ఆదిల్,

సజ్జాద్ జహీర్



కె.ఎ.అబ్బాస్

కైఫీ అజ్మీ



ముల్క్‌రాజ్ ఆనంద్

రాజేందర్ సింగ్ బేడీ

బల్వంత్ గార్గి నర్తకులు శాంతి, గుల్బర్ధన్, నరేంద్ర శర్మ, శాంతా గాంధీ, దేవేంద్ర శంకర్, సలీల్ చౌదరి, పండిట్ రవి శంకర్, సచిన్ దేవ్ బర్మన్ లాంటి వారితో సహా అనేక మంది ప్రజానాట్య మండలితో మమేకం అయ్యారు. పృథ్వీ రాజ్ కపూర్ రెండు సార్లు ప్రజానాట్యమండలి అధ్యక్షులుగా ఉన్నారు. ఇంకా సినీ ప్రపంచానికి చెందిన అనేకమంది ప్రముఖులు ప్రజానాట్య మండలి ఉద్యమంలో భాగస్వాములయ్యారు. హరీంద్రనాథ్ చటోపాధ్యాయ, ఫైజ్ అహమద్ ఫైజ్ లాంటి ప్రసిద్ధ రచయితలు ప్రజానాట్య మండలితో పెనవేసుకు పోయినవారే. 1940, 1950 మధ్య బొంబాయిలో ఉన్న ప్రసిద్ధ కళాకారులెవరూ ప్రజానాట్య మండలితో సంబంధం లేని వారు కారు.

ప్రజానాట్య మండలితో సంబంధం ఉన్న వారందరూ స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం ఉన్న వారే. ప్రజా నాట్య మండలి నాటకాలతో సహా సకల కళా రూపాలను ప్రజలకు సన్నిహితం చేసింది. సామాజిక బాధ్యత అంటే ఏమిటో తెలియజెప్పింది. జాతీయ సమగ్రతను ప్రోది చేసింది. స్వాతంత్ర్యోద్యమంతో పాటు సాంస్కృతిక ఉద్యమాన్ని ప్రోత్సహించడంలో ప్రజానాట్య మండలి అద్వితీయమైన పాత్ర పోషించింది. నిజానికి అఖిల భారత స్థాయిలో ప్రజానాట్య మండలి ఏర్పడడానికి ముందే బెంగళూరులో ప్రజానాట్య మండలి పని చేసేది. రంగ స్థల నటుల జాతీయ సమావేశం ప్రజానాట్య మండలి ఆవిర్భావానికి వేదిక అయింది. 1943 మే 25న ప్రజానాట్య మండలి అవతరించింది. జాతీయోద్యమంతో కళాకారులను సమైక్యం చేయడం ఆ రోజుల్లో ప్రజానాట్య మండలి కర్తవ్యంగా భావించింది. ప్రజా నాట్య మండలి (ఇప్టా) అన్న పేరు సూచించింది ప్రసిద్ధ శాస్త్రవేత్త హోమీ జె.భాభా. ప్రజానాట్య మండలి అన్న భావన ఆయనకు రోమా రోలా రాసిన గ్రంథం ఈ పేరు సూచించడానికి ఉపకరించింది. మొదట్లో ప్రజా నాట్య మండలి తరఫున వీధి నాటకాలు ప్రదర్శించే వారు. ఈ వీధి నాటకాలు మొదట్లో 1940ల బెంగాల్ కరువు ప్రధాన ఇతివృత్తంగా ఉండేవి. బెంగాల్ సాంస్కృతిక బృందానికి చెందిన బినయ్ రాయ్ వీధి నాటకాలు ఆడడంలో ప్రధాన పాత్ర పోషించారు. "భూఖా హై బెంగాల్" లాంటి పాటలు జనాన్ని విపరీతంగా ఆకర్షించాయి. ఈ ప్రేరణతోనే ఆగ్రా సాంస్కృతిక బృందం లాంటివి ఏర్పడ్డాయి. సైద్ధాంతికంగా కళాకారుల బృందాలు వామపక్ష ఉద్యమంతో ముడివడి ఉండేవి. అప్పటి సీపీఐ ప్రధాన కార్యదర్శి పి.సి.జోషి, అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సజ్జాద్ జహీర్ ప్రజానాట్య మండలి అవతరణకు గట్టిగా కృషి చేశారు. అస్సాం ప్రజానాట్య మండలి శాఖ ఏర్పడిన తరవాత ప్రసిద్ధ గాయకుడు భూపేన్ హజారికా ప్రధానమైన పాత్ర పోషించారు.

విశాలాంధ్ర
5
ఆదివారం
2 మార్చి 2025

200కు పైగా స్థానాల్లో విజయం తథ్యం: వడివేలు

చెన్నై: రాబోయే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే పార్టీ 200కు పైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని ప్రముఖ హాస్య నటుడు వడివేలు జోస్యం చెప్పారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ ... రోజులో కేవలం కొన్ని గంటలు మాత్రమే నిద్రిస్తూ, మిగిలిన సమయం అంతా ప్రజాసేవకు అంకితమవుతున్నారని తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో సుదీర్ఘకాలం జీవించాలని కోరుకుంటున్నట్టు వడివేలు పేర్కొన్నారు. పార్టీ నేతలతో పాటు కార్యకర్తలు కూడా 2026లో పార్టీ ఘన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సుక్మా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి

చింతూర్ : చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం భద్రతా సిబ్బందితో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మరణించారని పోలీసులు తెలిపారు. కిస్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉదయం కాల్పులు జరిగాయని, భద్రతా సిబ్బంది ఉమ్మడి బృందం మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లో ఉన్నారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ చెప్పారు. జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్) సిబ్బంది ఈ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం ఆధారంగా శుక్రవారం ప్రారంభించిన ఆపరేషన్‌లో పాల్గొన్నారని ఆయన వివరించారు. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఇప్పటివరకు ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు ఆపరేషన్ కొనసాగుతోందని అధికారి తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌తో రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన వేర్వేరు ఎదురు కాల్పుల్లో 83 మంది మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో సుక్మా సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో 67 మంది చనిపోయారు.

కర్నాటకలో బర్డ్ ఫ్లూ...

రాష్ట్రమంతటా హై అలర్ట్

బెంగళూరు: కర్నాటకలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్టు నిర్ధారణ కావడంతో అధికారులు రాష్ట్రమంతటా హై అలర్ట్ ప్రకటించారు. బెంగళూరు నగరానికి సమీపంలో ఉండే చిక్కబళ్లాపుర తాలూకాలో ఇంతవరకు 36 కోళ్లు మృతి చెందాయి. బళ్లారి జిల్లా సండూరు, రాయచూరు జిల్లా మాన్వి తాలూకా పరిధిలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి మృత్యువాత పడుతున్నాయి. బెంగళూరులో వైద్యశాఖ అధికారుల ప్రత్యేక సమావేశం జరిగింది. రాష్ట్రమంతటా అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సూచించారు. మనుషులకి ఎక్కడా బర్డ్ ఫ్లూ సోకిన దాఖలాలు లేవని అధికారులు స్పష్టం చేశారు.

22న కర్నాటక బంద్

బెంగళూరు: మహారాష్ట్రలో కేఎస్ఆర్టీసీ సిబ్బందిపై దాడి, బస్సులకు రంగులు వేయడంతోపాటు బెళగావిలో మరాఠీ మాట్లాడలేదని కండక్టర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఈ నెల 22న రాష్ట్రబంద్‌కు కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ పిలుపునిచ్చారు. కన్నడ సంఘాల ముఖ్యుల ప్రత్యేక సమావేశంలో నాగరాజ్ మీడియాతో మాట్లాడుతూ కర్నాటకలోనే కన్నడిగులను వేధించడం, మహారాష్ట్రకు వెళ్లే బస్సులు, సిబ్బందిపై దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఈ నెల 7న బెళగావి ఛలో జరుపుతున్నామని, 11వ తేదీన మేకెదాటు ప్రాజెక్టు అమలు చేస్తూ అత్తిబెలె సరిహద్దు బంద్ చేస్తామన్నారు. 16న హోస్కోటె టోల్ బంద్ చేస్తామని, 22వ తేదీన కర్నాటక బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. బెంగళూరులో భారీ ర్యాలీ నిర్వహించేందుకు తీర్మానించామన్నారు. టౌన్‌హాల్ నుంచి ఫ్రీడంపార్కు దాకా ర్యాలీ కొనసాగుతుందన్నారు. అన్ని ప్రజాసంఘాలు, కార్మికసంఘాలను ఆహ్వానించామని, అందరూ మద్దతు తెలిపారన్నారు. ముఖ్యనాయకులు ప్రవీణ్‌శెట్టి, సా.రా.గోవిందు, కేసీ కుమార్ పాల్గొన్నారు. కర్నాటక రక్షణా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ స్పందిస్తూ రాష్ట్ర బంద్‌కు తమ మద్దతు లేదని ప్రకటించారు.

రైతుల ప్రతినిధి అభిమన్యు కోహర్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సాగుతున్న రైతాంగ ఉద్యమానికి కొత్త ప్రతినిధిగా 31ఏళ్ల ఇంజినీర్ అభిమన్యు కోహర్ తెరపైకొచ్చారు. కేంద్రంతో చర్చలు జరిపించే ప్రతినిధుల బృందంలోనూ ఈయన ఉన్నారు. రైతుల డిమాండ్ల సాధన కోసం ఆమరణ దీక్ష చేస్తున్న జగ్జీత్ సింగ్ దల్లేవాల్ పక్కనే ఉంటూ అభిమన్యు కీలకంగా మారారు. హర్యానా-పంజాబ్ సరిహద్దు ఖనౌరీ శిబిరం వద్ద మీడియాతో తరచూ మాట్లాడేది కూడా ఈయనే. 2020-21లో జరిగిన చరిత్రాత్మక ఉద్యమం క్రమంలో ఏర్పాటైన 40మంది సభ్యులు ఉన్న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం)లో అభిమన్యు కోహర్ ఉన్నారు. భారతీయ కిసాన్ నౌజవాన్ యూనియన్ అధ్యక్షుడి హోదా దల్లేవాల్‌తో సాన్నిహిత్యం పెంచుకున్నారు. అభిమన్యు కోహర్ ముక్కుసూటి మనిషి. హిందీ, ఆంగ్ల భాషల్లో ఈయనకు మంచి పట్టు ఉంది. ఈ కారణంగా ఉద్యమ అధికార ప్రతినిధిగా ఎంపికయ్యారు. అదే సమయంలో డేటాపైనా ఆయనకు మంచి పట్టు ఉంది. అనర్గళంగా మాట్లాడగలరు. దీనబంధు ఛోటు రామ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి 2016లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పట్టా పొందిన అభిమన్యు కోహర్... ఎంఎన్‌సీ ఉద్యోగానికి వెళ్లలేదు. రైతుల వెంట నిలిచారు. విద్యార్థి నాయకుడిగా ఎదిగారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక భూ సేకరణ ఆర్డినెన్స్ తెచ్చినప్పుడు హర్యానాలో రైతులతో కలిసి నిలబడ్డానని, ఆ సమయంలోనే ప్రైవేటు రంగ ఉద్యోగానికి వెళ్లరాదని రైతులతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నానని అభిమన్యు చెప్పారు. తన కుటుంబం కూడా ప్రోత్సాహం అందించిందన్నారు. 23 పంటలకు ఎంఎస్‌పీ కోసం డిమాండ్ చేశారు. కేంద్ర వైఖరిని ఖండించారు. రైతుల ప్రతినిధులతో కేంద్రం తదుపరి చర్చలు 19వ తేదీన జరగబోతున్నట్లు అభిమన్యు కోహర్ తెలిపారు. తమ డిమాండ్లకు కట్టుబడి ఉన్నామని, సరిహద్దుల వద్ద అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకుని రైతులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే కేంద్రానికి పట్టడం లేదా అని విమర్శించారు. ఈసారి చర్చల్లోనైనా ఎంఎస్‌పీకి చట్టబద్ధత దిశగా ఏకాభిప్రాయం కుదురుతుందని ఆకాంక్షించారు.

ఫిబ్రవరిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి భారీ స్థాయిలో నమోదయ్యాయి. ఫిబ్రవరిలో రూ.1.84 లక్షల కోట్లు వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే వసూళ్లలో 9.1 శాతం వృద్ధి నమోదైంది. జీఎస్టీ ఆదాయంలో దేశీయ రెవెన్యూ వసూళ్లు 10.2 శాతం మేర పెరిగి రూ.1.42 లక్షల కోట్లకు చేరగా... దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో 5.4 శాతం వృద్ధితో రూ.41,702 కోట్లుగా నమోదైంది. ఫిబ్రవరిలో మొత్తం వసూళ్లలో కేంద్ర జీఎస్టీ నుంచి రూ.35,204 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ నుంచి రూ.43,704 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ నుంచి రూ.90,870 కోట్లు వసూలైనట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. సెస్సుల రూపంలో రూ.13,868 కోట్లు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. ఈ ఏడాది జనవరిలో అత్యధికంగా రూ.1.96 లక్షల కోట్లు వసూళ్లు నమోదైంది.

మహారాష్ట్ర బడ్జెట్ వేళ

మహాయుతికి అగ్ని పరీక్ష

- విభేదాల నడుమ తప్పని ఐక్యత నటన
- ఎండగట్టేందుకు సిద్ధమౌతున్న విపక్షాలు

ముంబై: మహారాష్ట్రలోని అధికార మహాయుతికి రాబోయే బడ్జెట్ సమావేశాలు ఓ అగ్ని పరీక్ష కానున్నాయి. రాష్ట్రంలో అప్పుల్లో చిక్కుకొని... వ్యయాన్ని తగ్గించుకునే ప్రయత్నాల్లో సంక్షేమ పథకాలపై బడ్జెట్ కేటాయింపులు సముచితంగా చేయగలదా అన్న ప్రశ్న తెరపైకొచ్చింది. అదే సమయంలో మహాయుతిలో విభేదాలు తలెత్తాయి. అసంతృప్తి జ్వాల రగిలింది. అసెంబ్లీలో అధికార కూటమి ఐక్యతను ప్రదర్శిస్తుంది కానీ ఎండగట్టేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. మహాయుతిలో విభేదాల వేళ విపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీయే) విమర్శనాస్త్రాలు సంధించనుంది. అయితే దేవంద్ర ఫడ్నవీస్ నేతృత్వ మహాయుతి ప్రభుత్వం ఐక్యత నటన చర్చనీయాంశంగా మారింది. 232 మంది ఎమ్మెల్యేలు పాలక పక్షానికి ఉన్నారు. సంఖ్యాపరంగా విపక్షం బలహీనంగా ఉన్నప్పటికీ సీఎం ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మధ్య అభిప్రాయ భేదాలు వివాదాస్పదంగా మారాయి. ఎన్‌సీపీ మంత్రులు ధనుంజయ్ ముండె, మాణిక్‌రావు కొకాటేతో కూడుకున్న వివాదాల నేపథ్యంలో బడ్జెట్ సమావేశాల్లో రభస జరుగుతుందన్న సంకేతాలు ఉన్నాయి. బీడ్ జిల్లా మస్సాజోగ్ సర్పంచ్ సంతోశ్ దేశ్‌ముఖ్ హత్య కేసులో సన్నిహితుడు వాల్మికి కరాడే అరెస్టుతో మంత్రి ధనుంజయ్ ముండె రాజీనామాకు ఒత్తిడి పెరిగింది. మరోవైపు 30ఏళ్ల కిందటి మోసం కేసులో మంత్రి మాణిక్‌రావ్ కొకటేకు రెండేళ్ల శిక్ష పడింది. రెండు అంశాలపై విపక్షాలు సభను దద్దరిల్లించనున్నాయి. పరిపాలనలో క్రమశిక్షణ దిశగా ఫడ్నవీస్ చర్యలతో మహాయుతిలో విభేదాలు మొదలయ్యాయి. పీఏలు, ఓఎస్‌డీల నియామకాధికారాన్ని మంత్రుల నుంచి లాగేసుకోవడం అసంతృప్తి జ్వాలను రగిల్చింది. నాశిక్, రాయ్‌గఢ్‌లో గార్డియన్ మంత్రుల పదవులు దక్కకపోవడంపై షిండే కూడా గుర్రుగానే ఉన్నారని, సంకీర్ణంలో బీటలు మొదలయ్యాయని వదంతులు వినవచ్చాయి. ఇవన్నీ నిరాధారమంటూ ఫడ్నవీస్ కొట్టివేస్తున్నారు. మరోవైపు పూనేలో ఓ 26ఏళ్ల యువతిపై బస్సులో అత్యాచారం జరిగిన ఘటన మహారాష్ట్రలో సంచలనంగా మారింది. నిందితుడు పట్టుబడినప్పటికీ చట్టసభలో దీని ప్రస్తవన తప్పక వస్తుంది. ఇక ఆర్థిక వ్యవస్థ విషయానికొస్తే ప్రజారంజక పథకాల అమలు... వ్యయ నియంత్రణ సవాల్‌గానే సాగుతోంది. మార్చి 3 నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగా 10వ తేదీన ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఆర్థిక క్రమశిక్షణకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన ఇటీవల ప్రకటించారు. రాష్ట్ర అప్పు ఇప్పటికే రూ.7.11 లక్షల కోట్లకుపైగా ఉంది. 2024-25 బడ్జెట్, రెవెన్యూ లోటు రూ.20,051 కోట్లు (జీఎస్‌డీపీలో 0.5శాతం). 2024-25లో ప్రతిపాదించిన మూలధన వ్యయం రూ.85,292 కోట్లు కాగా ఖర్చు తగ్గించే ప్రయాస క్లిష్టమే!. లడ్కీ బహిన్ యోజన ప్రాజెక్టు కింద 18 నుంచి 64 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ప్రభుత్వ ఇస్తోంది. ఈ పథకాన్ని కొనసాగిస్తారు. అనర్హులపై వేటుకు నిబంధనల్లో సవరణలు చేసినప్పటికీ ఈ ప్రాజెక్టు వార్షిక ఖర్చు రూ.35వేల కోట్లు. నమో శేట్కరి కిసాన్ మహాసన్మాన్ యోజన కింద రైతులకు వార్షిక కేటాయింపును మెరుగుపర్చేందుకు మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.9వేలకు పెంచనున్నారు. పీఎం కిసాన్ పథకం కింద కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు ఇది అదనంగా ఉంటుంది. ఉచితంగా ఎల్‌పీజీ సిలిండర్లు, రైతుల వ్యవసాయ పంపులకు ఉచితంగా విద్యుత్ అందజేయడంపై వెనక్కి తగ్గితే విపక్షాలు ఊరుకోవు. స్థానిక సంఘాల ఎన్నికలు సమీపిస్తుండటంతో సంక్షేమ పథకాలను ఉపసంహరించి ఓటర్లను అసంతృప్తి పర్చే సాహసాన్ని మహాయుతి సర్కార్ చేయలేదు. అయితే బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగుతాయని, కొత్త చట్టాలను అధికార పార్టీలు ప్రవేశపెడతాయని, కొన్ని ఆందోళనలు కూడా జరగవచ్చని ఎన్‌సీపీ సీనియర్ నేత అన్నారు. మహాయుతిలో ఏ సమస్య లేదని, ఐక్యంగా ముందుకెళుతున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు.

ప్రపంచ శక్తిగా భారత్

ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : ఇన్నేళ్లు శ్రామిక శక్తిగా పేరుపొందిన భారతదేశం ప్రస్తుతం ప్రపంచ శక్తిగా రూపొందుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశ నిర్వహణా నైపుణ్యం, ఆవిష్కరణల సామర్థ్యాన్ని ప్రపంచం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని తెలిపారు. దేశ రాజధానిలో శనివారం నిర్వహించిన ఎన్ఎక్స్‌టీ కాంక్లేవ్ 2025లో ప్రధాని మోదీ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు కొన్ని దశాబ్దాలుగా భారత్‌ను ఓ ఉప శాఖగా చూశాయని, కానీ ప్రస్తుతం ఆ విధానం పూర్తిగా మారిపోయిందని అన్నారు. భారత్ గురించి ప్రతిరోజూ సానుకూల సమాచారం వస్తుండటంతో ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తూ, భారత్‌కు రావాలని తహతహలాడుతున్నాయని చెప్పారు. ఫిబ్రవరి 26వ తేదీతో ప్రయాగ్‌రాజ్‌లో ముగిసిన మహాకుంభ్-2025 గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఒక తాత్కాలిక నగరంలో నదీతీరాల వెంబడి కోట్లాది మంది ప్రజలు పవిత్రస్నానాలు చేయడంపై యావత్ ప్రపంచం ఆశ్చర్యంతో చూసిందని, మహాకుంభ మేళా నిర్వహణ భారతదేశం పాటించే నిర్వహణా నైపుణ్యాలు, ఆవిష్కరణలను ప్రపంచానికి చాటిచెప్పిందని అన్నారు. భారతదేశం ప్రపంచ శక్తిగా ఎదుగుతున్న వైనాన్ని మోదీ వివరిస్తూ, ఏఐ సదస్సులో భారతదేశం సహ-అతిథిగా వ్యవహరించిందని, భవిష్యత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) లో భారత్ కీలక భూమిక పోషించనుందని చెప్పారు. తదుపరి ఏఐ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్నదని అన్నారు. ఏఐ, ప్రపంచ ఆర్థిక సదస్సుల ద్వారా సాంకేతికత, ఆవిష్కరణ, గ్లోబల్ డిప్లొమసీలో ఎదుగుతున్న శక్తిగా భారత్ కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు. భారతదేశం సెమికండక్టర్లు, విమాన వాహక నౌకల తయారీ వంటి వాటితో వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఆటోమొబైల్ ఉత్పత్తిదారుగా కూడా మరిందని వివరించారు. భారతదేశం పాటించే యోగా, ధ్యానం వంటివి విదేశీయులు ఆచరిస్తున్నారని, మన సూపర్‌ఫుడ్ మఖానా, మిల్లెట్, ఆయుష్ ఉత్పత్తులు విరివిగా వాడుతున్నారని మోదీ చెప్పారు. తమ ప్రభుత్వ పాలనలో కాలంచెల్లిన అనేక చట్టాను రద్దు చేసి.. కొత్త వాటిని రూపొందించావ ని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలను మరింత ప్రభావవంతంగా మార్చేందుకు, ఈ ఏడాది బడ్జెట్‌ను త్వరితగతిన అమలు చేసేందుకు మార్గాలను సూచించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం అన్ని వర్గాల వారిని కోరారు. 'వ్యవసాయం- గ్రామీణ శ్రేయస్సు' అనే అంశంపై బడ్జెట్ అనంతర వెబ్‌నార్‌లో వర్చువల్‌గా ప్రసంగించిన మోదీ... ప్రభుత్వం మూడవ సారి అధికారంలో పూర్తి బడ్జెట్‌ను సమర్పించిందని, విధానంలో స్థిరత్వం, వికసిత్ భారత్ దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. బడ్జెట్‌కు ముందు భాగస్వాములందరి సూచనలు దీనిని రూపొందించడంలో సహాయపడ్డాయని మోదీ చెప్పారు.

మంచు చరియల కింద ఇంకా ఐదుగురు

బద్రీనాథ్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) శిబిరంపై మంచు చరియలు విరిగిపడిన ఘటనలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఐదుగురు కార్మికుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. సహాయక బృందాలు శనివారం మంచు నుంచి మరో 14 మంది కార్మికులను బయటకు తీయగలిగాయి. మంచు చరియల కింద చిక్కుకున్న 55 మందిలో శుక్రవారం 33 మందిని రక్షించారు. శుక్రవారం ఉదయం 5:30, ఉదయం 6 గంటల మధ్య సంభవించిన హిమపాతం, బద్రీనాథ్ సమీపంలో ఉన్న ఎత్తయిన మనా గ్రామంలోని ఎనిమిది కంటైనర్లు, ఒక షెడ్‌లో కార్మికులపై మంచు చరియలు విరిగిపడ్డాయి. శుక్రవారం భారీ హిమపాతం, వర్షం కారణంగా సహాయక కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడింది. రాత్రి కావడంతో బృందాలు తమ ప్రయత్నాలను నిలిపివేయవలసి వచ్చింది. శనివారం వాతావరణం అనుకూలించడంతో హెలికాప్టర్లు సహాయక చర్యలు కొనసాగించాయి. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రభావిత ప్రాంతంలో ఏరియల్ సర్వే నిర్వహించి, ఆపరేషన్ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ధామితో మాట్లాడి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని హామీ ఇచ్చారు. శనివారం రక్షించిన 14 మంది కార్మికులలో 11 మందిని జ్యోతిర్మఠంలోని ఆర్మీ ఆసుపత్రిలో చేర్చారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా, చమోలి జిల్లా మేజిస్ట్రేట్ సందీప్ తివారీ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు మరింత దిగజారడం వల్ల ఆపరేషన్ మందగించవచ్చని తెలిపారు. అయితే గల్లంతయిన కార్మికులను గుర్తించడానికి సైనిక హెలికాప్టర్లు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. బద్రీనాథ్ నుంచి 3 కి.మీ దూరంలో ఉన్న మనా... భారతదేశం-టిబెట్ సరిహద్దులో భారతదేశం చివరి గ్రామం, ఇది 3,200 మీటర్ల ఎత్తులో ఉంది. ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ మండలి విడుదల చేసిన జాబితా ప్రకారం, చిక్కుకున్న కూలీలు బీహార్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, జమ్మూకశ్మీర్, ఇతర రాష్ట్రాలకు చెందినవారు. ఐబెక్స్ బ్రిగేడ్‌కు చెందిన 100 మందికి పైగా సిబ్బందిని కలిగి ఉన్న సైన్యానికి చెందిన త్వరిత ప్రతిస్పందన బృందాలు, అధిక ఎత్తులో ఉన్న సహాయక ఆపరేషన్‌ల కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందాయి. ఇవి సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ఈ బృందాల్లో వైద్యులు, అంబులెన్స్‌లు ఉన్నాయి. చమోలీకి నాలుగు బృందాలను తరలించినట్లు ఎన్‌డీఆర్ఎఫ్ తెలిపింది. అంతేకాకుండా మరో నాలుగు యూనిట్లను సిద్ధంగా ఉంచామని ఎన్‌డీఆర్ఎఫ్ డైరెక్టర్ జనరల్ (డీజీ) పీయూశ్ ఆనంద్ పీటీఐకి తెలిపారు.. భారత వైమానిక దళంకు చెందిన హెలికాప్టర్లు శోధన, సహాయక కార్యకలాపాలలో చేరడానికి శనివారం ఉదయం మనాకు బయలుదేరాయి. మనాలోని గ్రామస్తులు మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన ప్రదేశం శీతాకాలంలో హిమపాతం సంభవించే అవకాశం ఉందని, బీఆర్‌వో శిబిరం సాధారణంగా సంవత్సరంలో ఈ సమయంలో మూసివేయబడుతుందని తెలిపారు. అయితే ఈ సంవత్సరం హిమపాతం లేకపోవడం వల్ల శిబిరాన్ని మూసివేయలేదని, అందుకే ఈ వ్యక్తులు చిక్కుకుపోయారని మనా గ్రామ అధిపతి పితాంబర్ సింగ్ పీటీఐకి చెప్పారు. ఇదిలాఉండగా, ప్రతికూల వాతావరణం హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లో కూడా పరిస్థితిని గందరగోళంగా మార్చింది. కులు, సిమ్లా, లాహౌల్ స్పితి, కిన్నౌర్, కాంగ్రాతో సహా ప్రాంతాలను ప్రభావితం చేసే హిమాచల్ ప్రదేశ్‌లో 5 జాతీయ రహదారులతో సహా 583 రోడ్లు భారీ హిమపాతం కారణంగా మూసుకుపోయాయి. ఒక పర్యాటకుడు మరణించగా, కొందరు గాయపడ్డారు. 22 వాహనాలు కొట్టుకుపోయాయి. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి, కశ్మీర్ లోయ, మిగిలిన భారతదేశం మధ్య ఉన్న ఏకైక అనుసంధాన మార్గాన్ని మూడవ రోజు కూడా మూసివేశారు. వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ఏటా శీతాకాలంలో హిమాలయ పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడటం సాధారణమే. ఈ చరియలు 5 సెకన్ల కాలంలోనే గంటకు 80 మైళ్ల వేగంతో కిందకు జారుకుంటాయి. ఇలాంటి ఘటనల్లో 2.3 లక్షల ఘనపు మీటర్ల వరకూ మంచు విడుదలవుతూ ఉంటుంది. అంటే 20 ఫుట్‌బాల్ మైదానాల్లో 3 మీటర్ల మందం వరకూ కప్పిన హిమంతో సమానమన్నమాట. ఈ హిమ శకలాల్లో చిక్కుకున్న వ్యక్తిని 18 నిమిషాల్లోగా కాపాడగలిగితే బతికిబట్టగట్టేందుకు 91 శాతం అవకాశాలు ఉంటాయి. 35 నిమిషాలు దాటితే బతికే అవకాశాలు 34 శాతానికి పడిపోతాయి.

15 ఏళ్లు దాటిన వాహనాలకు బంకుల్లో ఇంధనం బంద్

బీజేపీ సర్కార్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: ఢిల్లీలో కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. కాలుష్య కట్టడి చర్యల్లో భాగంగా శనివారం పర్యావరణ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సాతో అధికారులు భేటీ అయ్యారు. 15 ఏళ్లు పైబడిన వాహనాలకు ఏప్రిల్ ఒకటి నుంచి బంకుల్లో ఇంధనం పోయకూడదంటూ ఈ సందర్భంగా నిర్ణయించారు. 'పెట్రోల్ బంకుల వద్ద గాడ్జెట్‌లు ఏర్పాటు చేస్తాం. 15 ఏళ్లు పైబడిన వాహనాలను అవి గుర్తిస్తాయి. దాంతో వాటికి ఇంధనం అందదు' అని మంత్రి వెల్లడించారు. ఈ ఆంక్షలకు సంబంధించి కేంద్ర పెట్రోలియం శాఖకు సమాచారం ఇస్తామని తెలిపారు. అలాగే ఎత్తైన భవనాలు, హోటళ్లు, వాణిజ్య సముదాయాల్లో తప్పకుండా యాంటీ స్మోగ్ గన్లను అమర్చాలని వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి 90 శాతం సీఎన్‌జీ బస్సులను దశలవారీగా ఉపసంహరించుకొని, ఎలక్ట్రిక్ బస్సులతో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతిఏటా శీతాకాల సమయంలో ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుపోతోంది. వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక చర్యలకే ప్రాధాన్యమిస్తున్నాయి తప్పితే శాశ్వత చర్యలపై దృష్టి సారించడం లేదు. దాంతో నగరవాసులు స్వచ్ఛమైన గాలి అందక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. విద్యా సంస్థలను మూసివేయాల్సి వస్తోంది. విమానాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దాంతో జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే ప్రధాన అంశమైంది. కాలుష్య కట్టడికి ఆప్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదంటూ ప్రచారంలో భాగంగా బీజేపీ విమర్శలు గుప్పించింది. ఇప్పుడు అధికారంలోకి రాగానే ఆ దిశగా పలు చర్యలు ప్రారంభించింది.

15 ఏళ్ల వాహనాల మాదిరిగానే... బీహార్‌లో ఎన్డీయేని నిషేధించాలి

తేజస్వి



పాట్నా : బీహార్‌లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంపై రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) నేత తేజస్వి యాదవ్ మండిపడ్డారు. సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం పాత వాహనం మాదిరిగా ప్రజలకు భారంగా మారిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో 15 ఏళ్ల వాహనాల మాదిరిగా ఆ ప్రభుత్వాన్ని నిషేధించాలని అన్నారు. శనివారం ఈ మేరకు 'ఎక్స్' లో ఒక పోస్ట్ చేశారు. 'బీహార్‌లో సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని 20 ఏళ్ల ఎన్డీయే ప్రభుత్వం ఇప్పుడు పాతగా, పాడైన వాహనంగా మారింది. బీహార్ అంతటా 15 ఏళ్ల కంటే ఎక్కువ కాలం నాటి వాహనాలపై నిషేధం ఉంది. ఎందుకంటే అవి ఎక్కువ పొగను విడుదల చేస్తాయి. కాలుష్యాన్ని పెంచుతాయి. ప్రజలకు హానికరం. అందుకే 20 ఏళ్ల దుర్భరమైన ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో పనిచేయడానికి ఎందుకు అనుమతించాలి? ఈ ప్రభుత్వం బీహార్ ప్రజలకు భారంగా మారింది. దీనిని మార్చాలి' అని అందులో పేర్కొన్నారు. గత 20 ఏళ్లుగా నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం, అవినీతి, నేరాలు, వలసలు వంటి ప్రాణాంతక కాలుష్యాన్ని వ్యాప్తి చేసిందని తేజస్వి యాదవ్ మండిపడ్డారు. నితీశ్-బీజేపీ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరించడం వలన 20 ఏళ్లలో రెండు తరాల జీవితాలు నాశనం అయ్యాయని విమర్శించారు. 'ఈ శిథిలమైన, అనారోగ్యకరమైన, నమ్మదగని ప్రభుత్వాన్ని తొలగించి, కొత్త ఆలోచన, కొత్త దృక్పథం, కొత్త ఉత్సాహం, కొత్త దిశను తీసుకురావాలని బీహార్ యువత నిశ్చయించుకున్నారు. ఇది విశ్వసనీయమైనది. ఉద్యోగాలు, ఉపాధి, అభివృద్ధిని అందించడానికి అంకితభావంతో ఉంటుంది' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

పోక్సో కేసుపై కలెక్టర్ వివాదాస్పద వ్యాఖ్యలు... బదిలీ వేటు

తిరుచ్చి : మూడేళ్ల బాలికపై అత్యాచారం కేసును ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కలెక్టర్‌పై బదిలీ వేటు పడింది. తమిళనాడులోని మైలాడుదురై జిల్లా సీర్గాళిలో గత నెల 24న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన మూడున్నరేళ్ల చిన్నారిపై 16 ఏళ్ల బాలుడు లైంగిక వేధింపులకు పాల్పడి, తీవ్రంగా గాయపరిచాడు. ఈ కేసుపై జిల్లా కలెక్టర్ మహాభారతి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ప్రభుత్వం ఆయనపై బదిలీ వేటు వేసింది. ఆయన స్థానంలో ఈరోడ్ కార్పొరేషన్ కమిషనర్ హెచ్ఎస్ శ్రీకాంత్‌ను నూతన కలెక్టర్‌గా నియమిస్తూ ప్రకటన విడుదల చేసింది. బాలల భద్రతపై నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మహాభారతి ఇటువంటి కేసుల్లో అధికారులు రెండు వైపులా ఆలోచించాలని అన్నారు. బాలిక అతడిపై ఉమ్మేయడంతోనే ఆగ్రహానికి గురై లైంగిక వేధింపులకు గురిచేసి తీవ్రంగా గాయపరిచాడని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో దుమారం రేగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కలెక్టర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదర్శవంతమైన స్థానంలో ఉన్నవారు ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. డీఎంకే ఎంపీ కనిమొళి కలెక్టర్‌పై విమర్శలు గుప్పించారు. కాగా, లైంగిక దాడికి గురైన బాలిక పరిస్థితి విషమంగా ఉంది. ఈ దారుణానికి పాల్పడిన బాలుడిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. బాలుడు దురుద్దేశంతో బాలిక వద్దకు వచ్చినప్పుడు ఆ చిన్నారి తప్పించుకునే ప్రయత్నం చేయడంతో అతడు పక్కనే ఉన్న ఇటుకతో ఆమె తల, ముఖంపై కొట్టి తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులు వెల్లడించారు.

ఇంటి పైకప్పు కూలి ఐదుగురి మృతి

పండోరి గోలా : పంజాబ్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంటి పైకప్పు కూలిన ప్రమాదంలో ఇంట్లో ఉన్న అయిదుగురు కుటుంబ సభ్యులు మృతి చెందారు. కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పండోరి గోలా గ్రామంలో శనివారం తెల్లవారుజామున 4.30 నిమిషాలకు ఇంటి పైకప్పు కూలినట్లు పోలీసులు వెల్లడించారు.

ఇల్లు శిథిలావస్థలో ఉందని అన్నారు. అయితే ఇంటి పైకప్పుపై కొన్ని వ్యర్థ పదార్థాలు ఉంచడంతో ఆ బరువుతో పైకప్పు కూలింది. ప్రమాదం తర్వాత బాధితులను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే ఆ అయిదుగురు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

వనపర్తి నియోజకవర్గానికి కాశింనగర్ ఎత్తిపోతల పథకం మంజూరు

6 గ్రామాలు, 13 గిరిజన తాండాలలో 4 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది : చిన్నారెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆరు గ్రామాలు, 13 గిరిజన తాండాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించే కాశీంనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం మెమో నంబర్ 1712/ ప్రాజెక్ట్స్ -2 ఎ2/ 2025 ద్వారా జారీ చేసిందన్నారు. దీనితో ఆదివారం సర్వే పనులకు ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని చిన్నారెడ్డి అన్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద కాశింనగర్, జయన్న తిరుమలాపురం, మున్ననూరు, అప్పాయిపల్లి, దత్తయిపల్లి, అంజనగిరి గ్రామాలతోపాటు మరో 13 గిరిజన తాండాలకు నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ సహా ఇతర ప్రతిపాదిత నీటి వనరులకు ఈ ప్రాంతం ఎత్తుగా ఉండటం వల్ల కాశిం నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేశారని చిన్నారెడ్డి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా చివరి ఆయకట్టుకు సాగునీరు రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పిందని చిన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాశిం నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఇరిగేషన్ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డికి చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం వనపర్తిలో జరుగనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభకు రైతులు, ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని చిన్నారెడ్డి కోరారు.

4, 5, 6 తేదీలలో కళాకారుల రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కళాకారుల శిక్షణా శిబిరం 2025 మార్చి 4,5,6, తేదీలలో మంచిర్యాలలో నిర్వహించ నున్నట్లు తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా తెలిపారు. శిబిరంలో సాంస్కృతిక రంగం సమస్యలు-పరిష్కార మార్గాలు, ప్రజా సమస్యలపై పాటలు, నాటికలు కళారూపాలు వంటి విభిన్న రకాలుగా కళారంగంలో అనుభవం ఉన్న వారిచే కళాకారులకు శిక్షణా ఇవ్వబడునని, ఎంపిక చేసిన కళాకారులు, ప్రతి జిల్లా నుండి ప్రాతినిధ్యం తగ్గకుండా కళాకారులు శిబిరంలో పాల్గొని విజయవంతం చేయలని పల్లె నర్సింహా కళాకారులను కోరారు. మార్చి 4న ఉదయం 11 గంటలకు శిబిరం మంచిర్యాలలో నర్సయ్య భవనంలో ప్రారంభం అవుతున్నదని కావున జిల్లా నాయకులు, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ చొరవ తీసుకోని ప్రతి జిల్లా నుండి ప్రాతినిధ్యం ఉండాలని పల్లె నర్సింహా కోరారు.

అడ్వకేట్స్ అకాడమీ ఏర్పాటు చేయాలి : ఐఏఎల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో న్యాయవాదుల కోసం అడ్వకేట్స్ అకాడమీ ఏర్పాటు చేయాల్సిందిగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాదులో కేవిఎల్ అధ్యక్షతన ఐఏఎల్ స్టడీ సర్కిల్ జరిగింది. ఈ సమావేశంలో బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగం దేశ సంరక్షణకు, అభివృద్ధికి, ఐక్యతను నిలబెట్టి ప్రజల పురోభివృద్ధికి దోహదపడు తుందని, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సమానత్వం రాజ్యాంగంలో పొందుపరచ బడినటువంటి ఈ లక్ష్యాల సాధనకు న్యాయవాదులు అంకితభావంతో పని చేయాలని ఆయన అన్నారు. న్యాయవాదుల గురించి రానున్న బడ్జెట్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి వారి సంక్షేమం, అభివృద్ధి కొరకు తోడ్పడా లన్నారు. అదేవిధంగా న్యాయవాదులకు కావల్సిన లైబ్రరీ, కోర్టులో న్యాయ మూర్తులను, సిబ్బందిని, జిపి, పిపిలను నియమించాలని కోరారు. ఈ కార్యమంలో హైదరాబాదు నగర ప్రధాన కార్యదర్శి జయ శ్రీనివాస్, బత్తిన రాము, ఉదయ్ శంకర్, వీరబాబు, లక్ష్మయ్య, నాగేశ్వరరావు, రామారావు, గుర్రం వెంకట్‌రెడ్డి, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామ్ నేషన్ అంశంపై బొమ్మగాని ప్రభాకర్ శిక్షణ ఇచ్చారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

విశాలాంధ్ర - ఆమనగల్లు : విద్యార్థినీ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని నిత్యజీవితంలో సైన్స్ పట్ల అవగాహన కలిగించాలని టాస్క్ సిఓఓ, ఐక్యత ఫౌండే షన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని అరబిందో ఉన్నత పాఠశాలలో శనివారం వైజ్ఞానిక వస్తు ప్రదర్శన మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, మండల విద్యాధికారి పాండు, పాఠశాల చైర్మన్ సుధీర్‌రెడ్డి, ట్రస్మా సభ్యులు అల్లాజీ, శివలింగం, శ్రీను, మహమ్మద్, వెంకటేష్, నిరంజన్, సుదర్శన్‌రెడ్డి శ్రీరాం, చంటిలతో కలిసి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 100 ప్రాజెక్టులతో విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్నారు. ముఖ్యంగా తెలంగాణ పిండి వంటకాలు, అగ్నిపత్, ఈజిప్టు, గణిత ఆటలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ వైజ్ఞానిక వస్తు ప్రదర్శన మేళాతో విద్యార్థుల్లో సృజనాత్మకత నైపుణ్యం పెంపొంది కొత్త ఆవిష్కరణలకు తోడ్పతాయని అన్నారు. అనంతరము పాఠశాల కరస్పాండెంట్ సుధీర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో మనోవికాసానికి వైజ్ఞానిక వస్తు ప్రదర్శనమేల ఎంతో తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ ప్రమోద్ కుమార్ ఎస్సై వెంకటేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం భాస్కర్, నరేష్, నజీర్, శ్రీను, హైమావతి, సునీత, రాధా, సౌమ్య, స్వప్న, సౌజన్య, యామిని, దివ్య, తేజ, లలిత, శారదా, లక్ష్మి ప్రసన్న, సంధ్య, సింధు, లావణ్య, బాలమణి, శోభా, ప్రేమలత, శైలజ, కృష్ణ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లాలో అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా యంత్రాంగానికి సూచించారు. శనివారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, డిసిపిలు శ్రీనివాస్, సునీతల ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్.సి., ఎస్.టి అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో ల్యాండ్, అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్లో ఉన్న ఎస్.సి., ఎస్.టి అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని రకాల పెండింగ్ కేసులను నెల రోజుల్లో పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఎంతమాత్రం ఉపేక్షించబో మని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ వెంకటయ్య కలెక్టర్, సీ.పీలకు సూచించారు. పోలీస్‌స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పక్కాగా అమలు జరిగేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని సూచించారు. అధికారులు ఎస్.సి., ఎస్.టి గురుకుల పాఠశాలలను వసతి గృహాలను తరచు తనిఖీలు చేయాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెరుగైన విద్యను అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్.సి., ఎస్.టిలకు వేధింపులకు గురిచేసే అధికారులపై కఠిన చర్యలు కమిషన్ తరపున తీసుకున్నట్టు తెలిపారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే అక్కడికి కమిషన్ వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్.సి., ఎస్.టిలకు సంబంధించిన అన్ని రకాల కేసులను మార్చి నెలాఖరులోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ప్రతి నెల రోజులకు ఒకసారి ఎస్.సి., ఎస్.టి సమస్యలపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్, ఎస్పీలకు, ఎస్సీ కమిషన్ చైర్మన్ సూచించారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ భూమి సమస్యలపై ఆర్డీవోలతో ఎంక్వయిరీ చేయించి ఎస్.సి., ఎస్.టిలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఎస్.సి., ఎస్.టిల సంక్షేమం కోసం జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు వసతి గృహాల సమస్యల కోసం పరిష్కారం కోసం చేపట్టిన కార్యక్రమాలను జిల్లా కలెక్టర్, ఎస్.సి., ఎస్.టి కమిషన్ చైర్మన్‌కు వివరించారు. జిల్లాలో ఉన్న సమస్యలు 31 మార్చిలోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమీక్షలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, రేణిగుంట ప్రవీణ్, నీలాదేవి, జిల్లా శంకర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామరావ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామావేశ్వరిదేవి, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 77,701 మంది విద్యార్థులు

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పదవ తరగతి వార్షిక పరీక్షల ఏర్పాట్లపై విద్యా, రెవెన్యూ, పోలీస్, వైద్య, పోస్టల్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చ్ 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలకు 358 సెంటర్లలో మొత్తం 77701 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు అయన పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒకరు చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌లు, అలాగే చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంటల్ అధికారులను నియమించామన్నారు. అదే విదంగా ఏర్పాటు చేసే 28 రూట్లలో రూట్ అధికారులను కేటాయించామని వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ముందుగా శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను ముందుగా మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా కేంద్రాలలో నిరంతర విద్యుత్, తాగునీరు ఉండేలా చూడాలని మూత్రశాలల సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో పరీక్షా కేంద్రాలకు తరలించాలని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ దృష్ట్యా ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను కలెక్టర్ సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ నిర్వహించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

డిఆర్ఓ ఈ.వెంకటాచారి, డీఈఓ ఆర్ రోహిణి, డిఎంహెచ్ఓ డా.వెంకటి, అదనపు డిసిపి రవీందర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏడిఈ ప్రార్ధన, డిప్యూటీ ఆర్ఎం ఖీమ్ రెడ్డి, పర్యవేక్షకులు జహీరొద్దీన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదలకు సీఎం ఆదేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : 113 గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లింపు కోసం నిధులు విడుదలకు సీఎం ఏ. రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామక్రిష్ణారావును శనివారం ఆదేశించినట్లు తెలంగాణ ఖనిజాభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఖనిజాభివృద్ధి శాఖ సమీక్ష సందర్భంగా అనిల్ ఈరవత్రి గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి నిధుల విడుదలకు ఆదేశాలిచ్చారు.

కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వేసవి కాలంలో గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో కరెంటు కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాను అందించాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ విద్యుత్ అధికారులను కోరారు. శనివారం గౌతమ్ నగర్‌లో గల విద్యుత్ కార్యాలయంలో ఏడిఈ చంద్రశేఖర్, ఏఈ కిరణ్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్‌లో ఎత్తు తక్కువగా ఉండి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తు పెంచి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఇందిరా నెహ్రూనగర్‌లో సర్వీస్ వైరులను మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, నర్సింగ్‌రావు, బైరు అనిల్, నందు ఉన్నారు.

139 మంది శానిటరీ జవాన్ల బదిలీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీహెచ్ఎంసీ పరిధిలో 139 మంది శానిటరీ జవాన్లను బదిలీ చేస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. 30 సర్కిళ్లకు సంబంధించిన 139 మందిని బదిలీ చేసినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 269 మంది శానిటరీ జవాన్లు పనిచేస్తుండగా అందులో 5 సంవత్సరాలు పైబడి ఒకే సర్కిల్‌లో పని చేస్తున్న 139 మంది శానిటరీ జవాన్లను తమ రిక్వెస్ట్‌పై వారికి కావాల్సిన సమీప సర్కిళ్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కాపులకు సముచిత స్థానం కల్పించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వివిధ రాజకీయా పార్టీల మున్నూరు కాపు ముఖ్య నాయకుల సమావేశం మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు వి హనుమంతరావు గృహములో ఆయన అధ్యకతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమావేశములో రాష్ట్ర ప్రభుత్వం బీసిలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్‌లు కలిపిస్తున్నం దులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికీ ధన్యవాదములు తెలుపుతూ తీర్మానించారు. 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కలిపించే బిల్లు కేంద్ర ప్రభుత్వంకు పంపి చేతులు దులుపుకోవద్దని ప్రార్లమెంట్‌లో బిల్లు పాస్ అయ్యేటట్లు కాంగ్రెస్ పార్టీ కొట్లాడాలని దానికి బీఆర్ ఎస్ పూర్తి మద్దతుగా పార్లమెంట్‌లో తెలుపే విదంగా కృషి చేస్తుందని పార్లమెంట్ సభ్యులు వద్ది రాజు రవిచంద్ర తెలిపారు బీసి కుల ఘననలో మున్నూరు కాపులు తీవ్రంగా నష్టపోయారని కుల ఘనన సరిగ్గా జరగలేదని సరిచేయాలనీ కోరారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అతి త్వరలో హుజూర్ నగర్ కోదాడ నియోజకవర్గంతో పాటు ఇంకా కొన్ని నియోజకవర్గం లలో షాంపిల్ సర్వే నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వంకు సమర్పిస్తామణి తెలియ చేశారు. కాచిగూడ మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డును ప్రభుత్వం దేవదాయ ధర్మాదాయ శాఖ నుండి విడుదల చేయాలని కూడా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మున్నూరు కాపు కార్పొరేషన్ కు నిధులు విడుదల చేసి చైర్మన్ నియామకం చేయలని అదేవిధంగా స్వాతంత్రం వచ్చినప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వం లో మున్నూరు కాపులకు మంత్రి పదవి లేకుండా లేదని ఇప్పటి రేవంత్ రెడ్డి మంత్రి వర్గములో మున్నూరు కాపులకు మంత్రి వర్గములో స్థానం కలిపించాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. అతి త్వరలో హైదరాబాద్ మహా నగరములో పెద్ద బహిరంగ సభ ముఖ్యమంత్రితో సమయం తీసుకొని మున్నూరు కాపుల సత్తా చాటేవిదంగా బహిరంగ సభ జరపాలని తీర్మానం చేసి వి హన్మంత్ రావు, చైర్మన్‌గా కే.కేశవ రావును సలహాదారుగా ఈ క్రింది కమిటీ వేశారు. కమిటీలో బీజెపీ నుండి కోవా లక్ష్మణ్ ఎంపీ, సీ విఠల్, మీసాల చంద్రయ్య, బుక్క వేణు గోపాల్, ఆకుల విజయ, బీఆర్ఎస్ నుండి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి గంగుల కమలాకర్, జోగు రామన్న, బాజీ రెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ నుండి నేతి విద్యాసాగర్, దానం నాగేందర్, ఆకుల లలిత, గాలి అనిల్, బొంతు రామ్మోహన్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కాసుల బాల రాజు, సత్తు మల్లేషంలను ఎంపిక చేశారు. అలాగే కోఆర్డినేటర్స్‌గా వి ప్రకాష్, బొంతు రామ్మోహన్, సర్దార్ పుటం పురుషోత్తమ రావు, రౌతు కనకయ్య, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కొండా దేవయ్యలు ఉన్నారు. కే.కేశవరావు, వి హనుమంత్ రావు, సుంకరి బాలకిషన్ రావు, కాసుల బాలరాజు, ఆదం సంతోష్, ఆదం సుజన్, డా.మహేశ్ కొనగల, పలుగుల శ్రీనివాస్, ఇసం పల్లి వెంకన్న, బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఆమోదం బాధ్యత వారిదే

విశాలాంధ్ర - హైదరాబాద్ : 42 శాతం బీసీ బిల్లును పార్లమెంట్‌లో అమలు చేసి బాధ్యత, బండి సంజయ్, ఈటెల రాజేందర్‌లు బాధ్యత వహించాలని లేదంటే తెలంగాణలో బండిని, ఈటెలని తిరగనివ్వం టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ హెచ్చరించారు. శనివారం నాడు గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బీసీ కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చేసిందన్నారు. అసెంబ్లీ ప్రవేశ పెట్టనున్న తీర్మానంను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమలుకు ఆమోదం తెలిపి బాధ్యత, బండి, ఈటెల తీసుకోవాలని కోరారు. మండల్ తీర్పు సమయంలో ఆతరువాత తమిళనాడులోని అన్ని పార్టీలు 69 శాతం రిజర్వేషన్ నిలబెట్టడానికి సమైక్యంగానే పోరాడిన విషయాన్ని గుర్తుచేస్తూన్నారు. రిజర్వేషన్లు విధానంలో కోర్టు జోక్యం చేసుకోకుండా ఆర్టికల్ 31సి కింద, 24 నవంబర్ 1991 ఆమోదించారు. చట్టాన్ని చేసి రాష్ట్రపతి ఆమోదం పొందారని పేర్కొన్నారు. బీసీ కులగణనకు కేంద్ర ప్రభుత్వం సహాయపడి రాష్ట్రపతి ఆమోదం లభిస్తే అధీనీకరణ 243 టి (6) ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వొచ్చని చట్టాలు చెబుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వ తీర్మానాన్ని అమలు చేయకపోతే, బీజేపీ ఎంపీలు బాధ్యత వహించాలని సూచించారు. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా, ఈటెల రాజేందర్ ఎంపీగా బాధ్యత తీసుకోవాలి కోరారు. తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా బీజేపీ అడ్డుకుంటే తెలంగాణలో బీసీలకు ద్రోహులగా మారే ప్రమాదం ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణలో సామాజిక న్యాయం అమలుకు కృషి చేస్తుందని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ అసంబ్లీలో తీర్మానాన్ని అమలు చేసి విధంగా కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల్లో వసతుల కల్పనే ధ్యేయం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్‌లో భాగంగా ఎమ్మెల్యే ఎస్డీఎఫ్ (రాష్ట్ర సమగ్ర శిక్షఅభియాన్) నిధులు ద్వారా జెడ్పీహెచ్ఎస్ శేరిలింగంపల్లి పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు (6) ప్రారంభోత్సవ కార్యక్రమంలో పిఏసీ ఛైర్మెన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికపూడి గాంధీ, ఎంఈఓ వెంకటయ్య, పలువురు ప్రముఖులు, నాయకులతో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చూడముచ్చటైన తరగతి గదులు, క్లాస్ రూమ్‌లో డ్యూయల్ డెస్కులు, విద్యుత్తు వెలుగులు, పరిశుభ్రమైన టాయిలెట్లు, స్వచ్ఛమైన మంచినీళ్ల ట్యాంకులు, వంటగదులు భోజనశాలలు, వాకింగ్ ట్రాక్లు చుట్టూ ప్రహరీలు ఇలా అనేక సకల సదుపాయాలతో విద్యార్థులు ఏకాగ్రతతో నిశ్చింతగా చదువులు కొనసాగించేం దుకు అవసరమైన ఆహ్లాదకర వాతావరణాన్ని పెంచిపెడుతున్నాయని అన్నారు. పిల్లల చదువులకు సరికొత్త భరోసాను అందిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. అందులో భాగంగానే విద్యార్థులకు ఉపయోగకరమైన అవసరమైన అదనపు తరగతి గదులను త్వరితగతిన నిర్మించి, వారికి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు లక్ష్యంతో కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఈడబ్ల్యుఐడీసీ ఈఈ రాంకుమార్, డిఈ కలీముద్దీన్, ఏఈ శ్యామ్ ప్రసాద్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బల్వంత్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, వార్డ్ మెంబర్ శ్రీకళ, రాజ్ కుమార్, సుధాకర్ రెడ్డి, పాండు ముదిరాజ్, రవీందర్, సయ్యద్ నయీమ్, ఉపాధ్యాయులు కరుణ, వీరేశం, ఆంజనేయులు, పద్మావతి, విజయ, పద్మకుమారి, సూర్యప్రభ, శ్రీనివాసులు, కిషోర్, సుజాత, పద్మావతి, విద్యార్థులు, స్థానిక కార్యకర్తలు గణేష్ ముదిరాజ్, మల్లేష్, నటరాజ్, మహేందర్ సింగ్, సలీం, మహిళా నాయకురాళ్లు కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపలి: లింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపీనగర్‌లోని పలు రోడ్లు, మసీద్ బండ గ్రామంలోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణం చేసి మల్టి లెవెల్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు కొరకు జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి కంటేస్టెడ్ ఎమ్మెల్యే, అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపినగర్ ప్రాంతంలో రోడ్లు సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అని గతంలో కూడా మీకు వినతిపత్రం అందజేశామని మీరు తక్షణమే స్పందించి రోడ్లు మంజూరు చేయవలసిందిగా కోరామన్నారు. అలాగే మసీద్ బండ గ్రామంలోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్ పూర్తిగా పాడై శిథిలావస్థకు చేరుకుంది. ఆ ప్రాంతంలో ఒక మల్టి లెవెల్ ఫంక్షన్ ఏర్పాటు చేసినచో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఫంక్షన్ హాల్ కు సరిపడా నిధులు కేటాయించి వీలైనంత త్వరలో పనులు చేపట్టాలని వినతి పత్రం అందజేశామన్నారు. జోనల్ కమిషనర్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు, సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి కంటేస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేష్, రాజశేఖర్, శివ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెన్షన్

విశాలాంధ్ర - హైదరాబాద్ :: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన విషయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయనకు పార్టీ క్రమశిక్షణ కమిటీ తరఫున నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నోటీసులకు రిప్లయ్ ఇవ్వకపోవడంతో కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఆయాను పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ముఖ్యంగా ఓ వర్గాన్ని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం పార్టీ సీరియస్ గా పరిగణించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. చింతపండు నవీన్ పై కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలో ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో ఇంటర్ పరీక్షలపై జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చ్ 5 నుండి మార్చ్ 25 వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చ్ 21 నుంచి ఏప్రిల్ 4 వ తేదీ వరకు జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒకరు చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌లు, అలాగే చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంటల్ అధికారులను నియమించామన్నారు. అదేవిదంగా ఏర్పాటు చేసేన రూట్లలో రూట్ అధికారులను కేటాయించామని వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా విధులు నిర్వహించే అధికారులు తీసుకున్న శిక్షణను అనుసరించి ఎలాంటి పొరపాట్లు జరుగకుండా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ముఖ్యాంగా కేంద్రాలలో నిరంతర విద్యుత్, తాగునీరు ఉండేలా చూడాలని, మూత్రశాలల సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, చేవెళ్ళ ఆర్డీఓ చంద్రకళ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు, పోస్టల్ శాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 5న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో మరియు మార్చి 6, 7 తేదీలలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దోమలగూడలోని ప్రభుత్వం కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రౌండ్‌లో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మహిళా చైర్ పర్సన్ రేవతి తెలియజేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల వాల్ పోస్టర్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ఈ రోజు రంగారెడ్డి కలెక్టరేట్లో అవిష్కరించారు. గంప శ్రీనివాస్, సెక్రటరీ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్, రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మహిళా కన్వీనర్స్ అలివేలు, అనిత, మహేశ్వరి, సుజాత పాల్గొన్నారని రంగారెడ్డి జిల్లా టీజీవో అధ్యక్షులు, డాక్టర్ కే రామారావు, సెక్రటరీ శ్రీనివాస్ కుమార్ నోరి తెలియజేశారు.

పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

శనివారం జిల్లా సమీకృత సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారంపై, ప్రభుత్వ భూముల పరిరక్షణకై జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, సెక్షన్ సూపరిటెండెంట్స్, ఆర్డీఓలు, ఎమ్మార్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన దరఖాస్తులను తొందరగా పరిష్కారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రోజు వారీగా లక్ష్యాన్ని నిర్ణయించుకోని ఈ నెల 15వ తేదీ లోపు పెండింగ్ లేకుండా పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా డివిజన్‌ల పరిధిలోని ప్రభుత్వ భూములు పై ఆర్డీఓ, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సర్వే ల్యాండ్ అధికారులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రభుత్వ భూములను కాపాడేందుకు 15 రోజుల డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రభుత్వ భూములు అక్రమణలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

16న 5కె రన్ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపలి: అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 16న ఆదివారం 5కె రన్ నిర్వహిస్తున్న సందర్భంలో మంత్రి ధనసరి సీతక్కతో పాటు తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా 5కే రన్ ఫ్లయ్యర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మహిళలకు మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కొని మహిళలని గౌరవిస్తూ చేసే 5కె రన్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో అందరూ హాజరు కావాలని ఆరోగ్యంగా, ఆనందంగా పాల్గొంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎక్స్ కార్పొరేటర్ భాను ప్రసాద్, కూన సత్యం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మధు, ఎల్లాజీ, యశ్వంత్, పద్మ, గాయత్రి, అవని స్వచ్ఛంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొలను శ్రీనివాస్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రాజీవ్ గృహకల్పలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వరస్వామి, నల్ల పోచమ్మ దేవాలయంలో ఆలయ ధర్మకర్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు, అన్నదాన మహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహింకున్నారు. అనంతరం ఆయా కార్యక్రమాలు విజయవంతం కావడనికి కృషి చేసిన కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు, కమిటీ ప్రతినిధులు రామ్ చందర్ నాయక్, బాలకృష్ణ, రమణ, శివ నాగరాజు యాదవ్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా జర్నలిస్టుల శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ మీడియా అకాడమి సామాజిక మాధ్యమాలు (సోషల్ మీడియా) పై ఒక్క రోజు శిక్షణా తరగతులు చాపెల్ రోడ్డు, నాంపల్లి లోని అకాడమీ భవనంలో శనివారం నిర్వహించింది. మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, సోషల్ మీడియా సమాజంలో క్రియాశీలంగా అత్యంత ప్రాధాన్యత కల్గినదన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి 60 మంది సోషల్ మీడియా జర్నలిస్ట్‌లు తరగతులకు హాజర య్యారు. ఈ శిక్షణ తరగతులలో ప్రముఖ మీడియా నిపుణులు మాడభూషి శ్రీధర్, "సమాచార హక్కు చట్టం-2005" ఉపయోగాలను వివరించారు. సీనియర్ జర్నలిస్టు, ఎడిటర్ కే.శ్రీనివాస్ "భాష - దోషాలు" అనే అంశంపై ప్రసంగించారు. ఉడుముల సుధాకర్ రెడ్డి డిజిటల్ మీడియాలో "వాస్తవాలు-ధృవీకరణ" అనే అంశంపై ప్రసంగిస్తూ డిజిటల్ టూల్స్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. సీనియర్ జర్నలిస్టు గోవింద రెడ్డి "నేర వార్తలు" అనే అంశంపై బోధించారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి సామాజిక పద్ధతులు, వ్యవసాయ, ఆర్థిక, భూములు, నదులు, అటవీ ఉత్పత్తులు మొదలగు అంశాలను విశ్లేశిస్తూ సమగ్రంగా వివరించారు. అకాడమి చైర్మన్ కే.శ్రీనివాస్‌రెడ్డి జర్నలిజం - చట్టాలు-వృత్తి ప్రమాణాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వేంకటేశ్వర రావు, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం కన్వీనర్ కరుణాకర్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ ఎలా ఉండాలో ఆచరించి చూపిన మహనీయుడు శంకరన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిబద్ధతగల వ్యక్తిగా నిజాయితీ, జవాబుదారీతనం, దయాగుణం, నైతిక స్థైర్యం ప్రతి ఐఏఎస్ అధికారికి తప్పనిసరిగా ఉండాల్సిన లక్షణాలు, విలువలను ఎస్.ఆర్.శంకరన్ విశ్వసించి పాటించారు. ఓ సివిల్ సర్వీస్ అధికారి ఎలా ఉండాలో జీవించి నిరూపించారని ప్రఖ్యాత గాంధేయవాది హర్ష మందర్ తెలిపారు. తెలంగాణ పల్లె పల్లెకూ తిరిగి వెట్టి చాకిరీ విముక్తిని ఓ ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లిన మహనీయుడు అని కొని యాడారు. తాను నమ్మిన విలువలకై రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్క చేయలేదన్నారు. సఫాయి కర్మచారీ ఆందోళన్, స్కూల్ ఫర్ డెమోక్రసీ సంయుక్తంగా ప్రజల ఐఏఎస్‌గా చరితార్థుడైన ఎస్.ఆర్. శంకరన్ సంస్మరణ సభ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హర్ష మందర్ మాట్లాడుతూ ఇవాళ్టి పరిస్థితుల్లోనూ శంకర నాలా ఐఏఎస్‌లు రాజ్యాంగ విలువలు ప్రామాణికంగా ప్రజల కోసం పని చేయొచ్చు కానీ చాలా మంది సివిల్ సర్వీసెస్ అధికారులు తమ వ్యక్తిగత ప్రయోజనాలు, అధికార పీఠాలకు లొంగిపోతున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మ భూషణ్ పురస్కారాన్ని ప్రకటించినా శంకరన్ సున్నితంగా తిరస్కరించారని గుర్తు చేశారు. బహుశా శాంతి చర్చలు విఫలమవడమే అవార్డు తిరస్కరణకు ప్రధాన కారణమని తాను భావిస్తున్నట్లు హరగోపాల్ చెప్పారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పటాన్ చెరువు : రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకొని జిఎంఆర్ యువసేన నాయకుడు షకీల్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు కఠినంగా ఉపవాస దీక్షలు చేస్తూ అల్లాను ప్రార్థిస్తూ నిర్వహించే పవిత్ర మాసం రంజాన్ మాసం అన్నారు. నియోజకవర్గంలోని మైనార్టీల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. సొంత నిధులతో నూతన మసీదులు, ఈద్గాలు, ఆశిరానాలు నిర్మించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైనారిటీ మత పెద్దలు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం : ఎంపీ

విశాలాంధ్ర-దుండిగల్: అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధి దుండిగల్ గ్రామంలో సర్వే నంబర్ 453,454 లోని 40 ఎకరాల అసైన్డ్ భూమిని ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఆర్డీఓ కార్యాలయానికి కేటాయించడంతో నిరసనగా దుండిగల్ వార్డు కార్యాలయం ఎదుట రైతులు శనివారం నిర్వహించిన నిరాహార దీక్షలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా ఇక్కడి రైతులు వ్యవసాయం చెసుకుంటు అనుభవిస్తున్న భూములను ముందస్తు నోటీస్‌లు ఇవ్వకుండా లాక్కునే అధికారం ఎవరిచ్చారని, రైతుల జోలికొస్తే సహించేది లేదని అధికారులు, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ఆయన మండిపడ్డారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మాల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర్, దుండిగల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు పీసరి కృష్ణా రెడ్డి, మాజీ కౌన్సిలర్లు అమరం గోపాల్ రెడ్డి, రాజి రెడ్డి, మాజీ కార్పొరేటర్లు విజయలక్ష్మి, మహేందర్, మాజీ సర్పంచ్ కావలి గణేశ్, ఆకుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థుల పఠన గ్రహణశక్తిపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉపాధ్యాయులు విద్యార్థుల పఠన గ్రహణశక్తిపై దృష్టి సారించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటి ఈఓ, డిప్యూటీ ఐఓఎస్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, ఎంఎస్‌ఓలు, ఈఈ, ఎఈఈలతో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, ఎఫ్ఎల్ఎన్, ఎస్ఎస్‌సి ఫలితాలు, యుడిఐఎస్‌ఈ కార్యక్రమాలపై మండలాల వారిగా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను యుద్ధ ప్రాతిపదికన 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ ఐఓఎస్‌లు తమ పరిధిలోని పాఠశాలల్లో 100% ఎఫ్ఎల్ఎన్ సందర్శన చేయాలని, విద్యార్థుల పఠన గ్రహణ శక్తిపై దృష్టి పెట్టాలని, విద్యార్థులందరు పఠన పటిమను పొందడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యా సంవత్సరంలో ఇంకా 50 రోజులు మిగిలి ఉన్నందున తధను గుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. డిప్యూటీ ఈవోలు తమ పరిధిలో మెరుగైన ఫలితాలను సాధించడంలో ఉత్తమ పద్ధతులను అవలంభించాలని అన్నారు. డిప్యూటీవోలు, డిప్యూటీ ఐఓఎస్‌లు, ఎంఎస్ ఓలు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, రెగ్యులర్ సందర్శనలో భాగంగా పఠన గ్రహణానికి సంబంధించిన వీడియోలను పోస్ట్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఎస్సిలో గత సంవత్సరం 86.8% ఫలితాలు వచ్చాయని ఈ సంవత్సరం కనీసం 90 శాతం హైదరాబాద్ జిల్లా సాధించాలని అన్నారు. ఈ సమావేశంలో డిఈఓ ఆర్. రోహిణి, డిప్యూటీ ఈవోలు, డిప్యూటీ ఐఓఎస్‌లు, ఈఈ, ఏఈలు, ఎంఎస్‌ఓలు కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని బాధ్యతాయుతంగా వాడుకోవాలి

విశాలాంధ్ర - కాప్రా : టెక్నాలజీని బాధ్యతాయుతంగా వాడుకోవాలని, సాంకేతికత అభివృద్ధి వల్ల నిరుద్యోగ హననం కాకూడదని శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త ఎం.కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్‌లోని లయన్స్ క్లబ్ హాల్‌లో సీపీఐ శతజయంతి వార్షికోత్సవాల సందర్భంగా "సాంకేతికత అభివృద్ధి నిరుద్యోగ సమస్య" అనే అంశంపై సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు ప్రధాన వక్తగా ఎం.కృష్ణప్రసాద్ హాజరయ్యారు. ఈ సదస్సు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ అధ్యక్షతన జరిగింది. ముగింపు ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త ఎం.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ టెక్నాలజీ ప్రపంచాన్ని మలచడంలో ఉన్న అవకాశాలను వినియోగించుకునే విధంగా నూతన ఆవిష్కరణలు సాగాలని, సాంకేతికత అభివృద్ధి అవసరమే కాని నిరుద్యోగ అవకాశాలు అందరికి అందినప్పుడే టెక్నాలజీ అభివృద్ధి కాంక్షిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. సాంకేతికత చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. సాంకేతికతను బాధ్యతగా ఉపయోగించకపోతే అది ప్రమాదకరమవుతుందని వారు హెచ్చరించారు. డ్రోన్లను వ్యవసాయాన్ని సమర్థవంతంగా మార్చగలవని, అదే డ్రోన్స్ విధ్వంసానికి ఉపయోగిస్తే అది ప్రమాదకరమని హెచ్చరించారు. అందుకే ప్రతి టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదని హెచ్చరించారు. అర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ వస్తే ఉద్యోగ అవకాశాలు పోతాయనే ప్రచారాన్ని ఎలాన్ మాస్క్ వ్యాప్తి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలి లు సంయుక్తంగా మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ అంశాన్ని అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. 'ప్రతి రోజూ భారీ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, బిజ్జ శ్రీనివాసులు, రాష్ట్ర సమితి సభ్యులు చంద్రశేఖర్, మాజీద్ అలీ ఖాన్, సతీష్, మహేష్, కళ్యాణ్,ప్రీతం, సోహైల్, మహేందర్, రాష్ట్ర లైబ్రరీ సమస్యలు పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ సాయిలు, సంజయ్‌లతో పాటు 120 మంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - కాప్రా : నాచారం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్దనాలాపై 94 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులలో భాగంగా వంతెన బెడ్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ శనివారం పర్యవేక్షించారు. వంతెన విశాలంగా 10 మీటర్ల పొడవు 10 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నట్లు కార్పొరేటర్ తెలియజేశారు. మరో మూడు వారాల్లో వంతెన నిర్మాణము పూర్తి కావచ్చని కార్పొరేటర్ తెలియజేశారు. నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన నిర్మాణం చేయాలని ఈ వంతెన గుండా నాచారంలోని చాలా కాలనీలకు ప్రధానంగా ఉపయోగించే రోడ్డు కాబట్టి పటిష్టంగా నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బారాస రాష్ట్ర నాయకులు సాయిజన్ శేఖర్, మేకల ముత్యం రెడ్డి, విట్టల్ యాదవ్, నర్సింగరావు, హరి ప్రసాద్, సుగుణాకర్ రావు, డిఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పద్మ నియామకం

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల బరిలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అతవాలె) పార్టీ నిలుస్తుందని పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ పేర్కొన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పద్మకు నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ప్రకటించారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైనట్లు చెప్పారు. రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్, బిజెపి పార్టీలకు తామే సరైన ప్రత్యర్థులమని పేర్కొన్నారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా తమ పార్టీ పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, ఉపాధ్యక్షులు పీటర్ రఘు ముద్రి, కార్యదర్శి గోరఖ్‌నాథ్ సింగ్, మహిళా విభాగం ఇంచార్జ్ రోజా రాణి, హైదరాబాద్ ఇంచార్జ్ పుష్ప తదితరులు పాల్గొన్నారు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ అధ్యక్షులుగా అశోక్‌కుమార్

విశాలాంధ్ర - మేడిపల్లి: అపెక్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె అశోక్ కుమార్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ శాఖ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం ఉప్పల్ ఎస్వీఎం హోటల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ బ్రాంచ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకరణ కార్యక్రమం కిమ్స్, సన్‌షైన్ హాస్పిటల్ సహకారంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా డాక్టర్ శ్రీధర్ కస్తూరి, డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, ముఖ్య అతిథులుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ద్వారకానాథ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వి అశోక్, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ టీ దయాల్ సింగ్, ఐఎంఏ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ డి శ్రీనివాస్ పాల్గొని ఉప్పల్‌బ్రాంచ్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి శుభా కాంక్షలు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ అధ్యక్షుడిగా డాక్టర్ కే అశోక్ కుమార్, సెక్రటరీగా డాక్టర్ వి శ్రీనివాస్, ట్రెజరర్ డాక్టర్ బి.సౌజన్య రెడ్డి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఆర్ సి రెడ్డి, డాక్టర్ ఎంవి ప్రసాద్, జాయింట్ సెక్రెటరీగా డాక్టర్ రమేష్, డాక్టర్ వి కార్తీక్‌రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ బి వెంకట్రావు, డాక్టర్ కే వెంకట్ నాగేందర్ రెడ్డి, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, డాక్టర్ పి అశోక్ కుమార్, డాక్టర్ జె మణిరెడ్డి, డాక్టర్ బి వెంకటేశ్వర్లు, మహిళా రిప్రెసెంటివ్స్‌గా డాక్టర్ మాధవి, డాక్టర్ డి ఆశాకుమారి, డాక్టర్ వైశాలి, డాక్టర్ నస్రీన్ ఫాతిమా ఎన్నిక కాబడి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ అధ్యక్షుడు డాక్టర్ కే అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజల చేత దేవతలుగా పోల్చబడుతూ అపార గౌరవాన్ని అందుకుంటున్న దాక్టర్లు నేడు తమ వృత్తిలో అనేక సమస్యలను, సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. అనునిత్యం అనేక సమస్యలతో వైద్యులు చితికి పోతున్నారని, వారికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అండగా ఉంటుందని, వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తూ, చిన్న, పెద్ద తేడా లేకుండా వృద్ధులందరి సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకుంటూ అభివృద్ధి పథంలో నడిపించేందుకు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ శాఖ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని, మానవసేవే మాధవ సేవగా ప్రతి ఒక్కరూ సేవా భావంతో పనిచేయాలని డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు.

శ్రవణానందంగా పద్మజా చల్లా వీణార్చన

విశాలాంధ్ర - శేరిలింగంపలి: అన్నమయ్య పురంలో అన్నమాచార్య భావనా వాహిని సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. శోభారాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామి వారికి ఈ శనివారం సాయంత్రం అన్నమ స్వరార్చన పద్మజా చల్లా వీణార్చన సభక్తిపూర్వంగా అందించారు. శాస్త్రీయ వీణ వాయిద్యంపై "చాలదా హరినామ సౌఖ్యామృతం, గోవింద గోవింద యని కొలువరే, తందనాన అహి, నగవులు నిజమని, కొలనులోని ముసు గోపికలు, పలుకు తేనియల తల్లి, జగడపు చనువుల, నారాయణతే నమో నమో, అన్ని మంత్రములు ఇందే, చిత్తజ గరుడా" మొదలైన బహుళ ప్రాచుర్యం పొందిన అన్నమాచార్య సంకీర్తనలను శృతి బద్ధంగా వీణపై ఆలపించారు. కార్యక్రమానికి వయోలిన్‌పై మురళీధర్, మృదంగంపై ప్రసాద్ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులకు, అన్నమాచార్య భావనా వాహిని పక్షాన సంస్థ వ్యవస్థాపకులు డా. శోభారాజు, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డా.నందకుమార్ జ్ఞాపికను అందించారు. చివరిగా, శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వరస్వామి వారికి అంగనలీరే హారతులతో, పసందైన ప్రసాద నైవేద్యాలతో కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది.

ఎయిర్‌పోర్ట్‌లో ప్రీమియం బిజినెస్ లాంజ్ ఫ్లైయర్స్ క్లబ్ ప్రారంభం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : అధికంగా ప్రయాణాలలో ఉండే వ్యాపారస్తులకు విమానాశ్రయ అనుభవాన్ని విప్లవాత్మకంగా మారుస్తూ ఫ్లైయర్స్ క్లబ్‌ను ఐస్ప్రౌట్ ప్రారంభించింది. తరచుగా ప్రయాణాలలో వుండే వ్యాపారస్తులకు ఈ ఫ్లైయర్స్ క్లబ్ అధునాతనమైన కార్యస్థలాన్ని అందిస్తుందన్నారు. యాత్రికులు పని చేయడానికి, సమావేశాలు నిర్వహించడానికి, సమావేశ కాల్‌లకు హాజరు కావడానికి లేదా విమానాశ్రయంలోని ఉత్పాదక కార్యాలయం లాంటి వాతావరణంలో విశ్రాంతి తీసుకోవడానికి, ఈ ఫ్లైయర్స్ క్లబ్ అధునాతనమైన, అత్యున్నతంగా తీర్చిదిద్దబడిన కార్యస్థలాన్ని అందిస్తుందన్నారు. అత్యాధునిక ప్రైవేట్ మీటింగ్ రూమ్‌లు, హై-స్పీడ్ ఇంటర్నెట్, బిజినెస్-క్లాస్ సౌకర్యాలు, అల్ ఫ్రెస్కో సీటింగ్ ఏరియాతో, ఫ్లైయర్స్ క్లబ్ ఫ్లైట్ కోసం వేచి ఉన్నప్పుడు కూడా ఉత్పాదకత ఎప్పటికీ ఆగదని నిర్ధారిస్తుందన్నారు. శీఘ్ర సమావేశం, సౌకర్యవంతమైన పని లేదా వ్యూహరచన చేయడానికి నిశ్శబ్ద స్థలం వంటి ఆధునిక వ్యాపార ప్రయాణీకుల అభివృద్ధి చెందుతున్న అవసరాలను లాంజ్ తీరుస్తుందన్నారు. అదనంగా, ఫ్లైయర్స్ క్లబ్ నిపుణులకు సౌకర్యవంతమైన సహాయాన్ని అందించడానికి విమానాశ్రయ ప్రాంగణంలో వ్యక్తిగతీకరించిన ఆతిధ్య సేవను అందిస్తుందన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని, ఢిల్లీ, గోవా, ముంబై, అహ్మదాబాద్, భోగాపురంతో సహా భారతదేశంలోని ఇతర ప్రధాన విమానాశ్రయాలకు ఫ్లైయర్స్ క్లబ్‌ను విస్తరించేందుకు ఐస్ప్రౌట్ చర్చలు జరుపుతోందన్నారు. ఐస్ప్రౌట్ సీఈఓ సుందరి పాటిబండ్ల మాట్లాడుతూ తరచుగా ప్రయాణంలో ఉండే నిపుణులు ఎదుర్కొంటున్న సవాళ్లను మేము అర్థం చేసుకున్నామన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా : కొలను

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్: అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పని చేస్తానని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జర్నలిస్ట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, ప్రగతినగర్ శిల్ప పారడైస్ కల్చర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పలు కాలనీ అభివృద్ధి కొరకై బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించగలరని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం, ఆయా కాలనీల అభివృద్ధికై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ ప్రపంచ అధినేత కాదు

- మోదీ ప్రభుత్వానిది బెదిరింపు రాజకీయం
- సీపీఐ ఢిల్లీ సమితి సమావేశంలో నారాయణ

న్యూఢిల్లీ: మొత్తం ప్రపంచాన్ని ఏలేద్దామన్నట్లుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి ఉన్నదని, ఆయన తన స్థాయి మర్చి ప్రవర్తిస్తున్నారని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఎద్దేవా చేశారు. అగ్రరాజ్యాన్ని సంపన్నుడు ఎలన్ మస్క్ పాలిస్తున్నాడన్నారు. ట్రంప్ ప్రపంచానికి అధినాయకుడిలా ప్రవర్తిస్తున్నారని... దిగుమతులపై పన్నులు, సుంకాల పేరిట దేశాలను బెదిరిస్తున్నారని నారాయణ విమర్శించారు. ఢిల్లీ జమా మసీదు వద్ద పార్టీ కార్యాలయంలో శంకర్‌లాల్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సీపీఐ ఢిల్లీ రాష్ట్ర సమితి సమావేశంలో నారాయణ జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను వివరించారు. ఇటీవల ముగిసిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై సమీక్షలో 12 మంది పాల్గొన్నారు. నారాయణ మాట్లాడుతూ 'అమెరికాను సంపన్న ఎలన్ మస్క్ తదితరులు పాలిస్తున్నట్లుగా ఉంది. ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ దీనినే ప్రతిబింబిస్తుంది' అని అన్నారు. ఇక భారత్ విషయానికొస్తే పునర్విభజన నెపంతో దక్షిణాది రాష్ట్రాలను బుల్డోజ్ చేసే ప్రయత్నంలో మోదీ ప్రభుత్వం ఉందని నారాయణ దుయ్యబట్టారు. నార్త్ వర్సెస్ సౌత్ పరిస్థితి తేవాలని చూస్తున్నారన్నారు. విభజించి పాలించే సిద్ధాంతానికి కట్టుబడుతున్నారన్నారు. ఇండియా ఐక్య సంఘటనతో లేదా కాంగ్రెస్‌తో లేదా వామపక్షాలతో జట్టు కట్టవద్దని బీజేపీయేతర ప్రభుత్వాలను మోదీ ప్రభుత్వం బెదిరిస్తోందని నారాయణ అన్నారు. ఈ ఒత్తిడి వల్లే ఢిల్లీ ఎన్నికలప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ ఒంటరిగా పోటీ చేసిందని గుర్తుచేశారు. అవినీతిపై పోరాటం ద్వారా అరవింద్ కేజ్రీవాల్ అధికారంలోకి వచ్చారు కానీ మద్యం కుంభకోణంలో ఆప్, టీఆర్ఎస్ పాత్ర ఉందని నారాయణ అన్నారు. అంబానీ-అదానీ నడిపించే అవినీతిభరిత మోదీ ప్రభుత్వానికి జేడీయూ అధినేత నితీశ్ కుమార్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు మద్దతు దురదృష్టకరమని నారాయణ అన్నారు. సమావేశం చివరిలో సభ్యుల ప్రశ్నలకు సీపీఐ ఢిల్లీ సమితి కార్యదర్శి ప్రొఫెసర్ దినేశ్ వార్షనే సమాధానాలు ఇచ్చారు. ఎన్నికల వివరాలు, భవిష్యత్‌లో చేపట్టే సంస్థాగత కార్యకలాపాల గురించి తెలిపారు. ఇదిలావుంటే పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని సమావేశం నిర్ణయించిందని కార్యాలయ కార్యదర్శి బబన్ కుమార్ సింగ్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

జేవీ సత్యనారాయణమూర్తి అక్రమ అరెస్టు

ఖండించిన సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర-విశాఖ: ఎల్‌జీ పాలిమర్స్ పేలుడుకు సంబంధించి ఆందోళన చేసిన సందర్భంగా పెట్టిన కేసులో కోర్టుకు హాజరుకాలేదన్న నెపంతో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. వెంటనే రీకాల్ పెట్టుకుంటానని చెప్పినా వినకుండా నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న ప్రజా నాయకుడిని నేరస్తుడి మాదిరిగా అరెస్టు చేయడం దుర్మార్గమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఖండించారు. అరెస్టు తీరు సక్రమంగా లేదని ఆక్షేపణ వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, సీపీఐ, జనసేన, సీపీఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రద్దు చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇచ్చినప్పుడు సానుకూలంగా స్పందించి రద్దుకు హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు పోలీసులు ఇటువంటి చర్యలకు పూనుకోవడం సరికాదన్నారు. అనేక కేసుల్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లాంటి వారిని వదిలిపెట్టి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్న నాయకులను అరెస్టు చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు. అధికారంలోకి వస్తే వైసీపీ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులన్నీ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చేనేతకు రూ.2 వేల కోట్లు

బడ్జెట్ పున:పరిశీలనకు పిల్లలమర్రి డిమాండ్

విశాలాంధ్ర-మంగళగిరి: బడ్జెట్‌లో చేనేతలకు తీరని అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ రాష్ట్ర చేనేత కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో పిల్లలమర్రి మాట్లాడుతూ గత బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో రూపాయి ఖర్చు పెట్టలేదన్నారు. తాజా బడ్జెట్ కేటాయింపును పున:పరిశీలించి చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. 'గతసారి చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ రూ.5 కోట్లు కేటాయించారు కానీ నిధులు విడుదల చేయలేదు. చేనేతకు సంబంధం లేని యూనిట్‌కు గతంలో రూ.86 కోట్ల బడ్జెట్ చూపించారు. అదే యూనిట్‌కు ఇప్పుడు రూ.66 కోట్ల లెక్క చూపారు. చేనేత పరిశ్రమకు రూ.115 కోట్లు మాత్రమే కేటాయించి అవమానించారు' అని పిల్లలమర్రి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి చేనేత కార్మికునికి 'నేతన్న నేస్తం' అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఈ పథకానికి నిధులు కేటాయించలేదన్నారు. గత ప్రభుత్వం 81,700 మందికి సంవత్సరానికి రూ.24 వేలు ఇచ్చిందని, దానిని కూటమి ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసిందని దుయ్యబట్టారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, రిబేట్ పథకం కింద రూ.156 కోట్లు బకాయిలకు కేటాయిపులు లేవన్నారు. సహకార సంఘాలకు రూ.172 కోట్లు ఇవ్వకుండా వాటి నిర్వీర్యమునకు ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. చేనేత సహకార సంఘాలలో కార్మికులకు పనిలేదని, అర్ధాకలితో కాలం గడుపుతున్నారన్నారు. చేనేతలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు గురించి సమాచారం లేదని విమర్శించారు. జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ కోసం ఇప్పటివరకు జీఓలు విడుదల చేయలేదన్నారు. చేనేతలకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర కార్యవర్గంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకటకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి దొడ్డి ఈశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతాంగ వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరు

అసోం రైతు సంఘ మహాసభలో ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల

గౌహతి: స్వాతంత్ర్య పోరాటంలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ముఖ్య భూమిక పోషించిందని, రైతాంగ వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఆ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య అన్నారు. అసోం రాష్ట్ర రైతు సంఘం 21 వ మహాసభలు గౌహతిలో గతనెల 27, 28 తేదీల్లో జరిగాయి. 10 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. అధ్యక్షవర్గంగా గిరెంద్ర ఉపాధ్యాయ, రతుల్ బోర, మన్సూర్ రెహమాన్లు వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా రావులతో పాటు జాతీయ కార్యదర్శి సిరి కుమార్ ముఖర్జీ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముని మహంతు, రాష్ట్ర కార్యదర్శి కనక గోగోయి, అస్సాం రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జేయంతో గోగోయి హాజరయ్యారు. రావుల మాట్లాడుతూ ఏఐకేఎస్... దేశంలోనే తొలి సంఘమని, 1936లో స్వామి సహజానంద్ సరస్వతి, ఆచార్య ఎన్.జి.రంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా స్థాపించబడిందని అన్నారు. నాటి నుంచి భూమి కోసం, భుక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోను, తిరువన్‌కూరు ప్రభువుకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలోను, కౌలు రైతుల హక్కుల పరిరక్షణ కోసం బెంగాల్ తేబాగా ఆందోళనలో పాలుపంచుకుందని వివరించారు. స్వాతంత్ర్యం తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన రైతాంగ వ్యతిరేక విధానాలపై అలుపెరుగనిపోరాటాలు నిర్వహించిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, రుణాల రద్దుకు అనేక ఉద్యమాలు చేసిందన్నారు. దేశంలోనే తొలిసారిగా 60 ఏళ్లు దాటిన రైతు కూలీలందరికి నెలకు రూ.10 వేలు పెన్షన్ అందించాలని పోరాడింది, కౌలు రైతుల హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించింది ఏఐకేఎస్సే అన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఏడాది పైగా జరిగిన చారిత్రాత్మక పోరాటంలో ప్రధానపాత్ర నిర్వహించిందని పేర్కొన్నారు. మోదీచేత యావత్తు రైతు లోకానికి క్షమాపణ చెప్పించి మూడు నల్ల చట్టాలను ఉపసంహరింపజేసిందన్నారు. నేడు మోదీ తీసుకొచ్చిన నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని తిప్పి కొట్టాలని దేశవ్యాప్త పోరాటాలు చేస్తుందన్నారు. సిరి కుమార్ ముఖర్జీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పంటలవారీ సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటకే కొబ్బరి రైతుల సంఘం, తమలపాకులు రైతుల సంఘం ఏర్పడి పనిచేస్తున్నాయన్నారు. అదేవిధంగా మిగిలిన పంటలకు కూడా అలాంటి సంఘాలని ఏర్పాటు చేయాలన్నారు. మన సంఘం జాతీయ మహాసభలు ఏప్రిల్ 15, 16, 17, తేదీలలో తమిళనాడులోని నాగపట్నంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం అస్సాం రాష్ట్ర రైతు సంఘం నూతన కమిటీ 21 మందితో ఏర్పడింది. అధ్యక్షుడిగా రతుల్ గోరా, కార్యనిర్వాక అధ్యక్షుడిగా సయ్యద్ మన్సూర్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి గా జేయంతో గొగోయి, ఉపాధ్యక్షులుగా రాజేంద్ర, సైలెం సైకో, సహాయ కార్యదర్శులుగా సంజీవ్ గోగుల్, ప్రాణబ్ దోలే ఎన్నికయ్యారు.

అంతా చట్టబద్ధంగానే...

ఎన్నికల ప్రక్రియపై సీఈఓ వెల్లడి: మమత వ్యాఖ్యలకు ఖండన

కోల్‌కతా: ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన ఆరోపణలను పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) శనివారం తోసిపుచ్చారు. ఓటర్ల జాబితా నవీకరించే ప్రక్రియ మొత్తం చట్టబద్ధంగా జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలను ప్రభావితం చేసేందుకు నకిలీ ఓటర్లను జాబితాలో చేర్చినట్లు బీజేపీపై మమత ఆరోపణలు చేసిన క్రమంలో సీఈఓ ఈ మేరకు సామాజిక మాధ్యమంలో ఓ ప్రకటన చేశారు. 'ప్రతినిధుల చట్టం-1950, ఎలక్టోరల్ రూల్స్ 1960 ప్రకారం బీఎల్ఓ, ఏఈఆర్ఓ, ఈఆర్ఓ, డీఈఓ, సీఈఓలు ఓటర్ల జాబితాను అప్‌డేట్ చేస్తారు. ఈ ప్రక్రియ రాజకీయ పార్టీల ద్వారా నియమించే బూత్‌స్థాయి ఏజెంట్ల భాగస్వామ్యంతో జరుగుతుంది. దీనిపై అభ్యంతరాలు ఉంటే ముందుగా బెంగాల్‌లోని 80,633 మంది బీఎల్ఓ, 3,049 మంది ఈఆర్ఓల దృష్టికి తీసుకెళ్లాలి' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఓటర్ల తయారీలో ప్రతిదీ రాజకీయ పార్టీల భాగస్వామ్యంలోనే సాగుతుందని, ఏదేని రాజకీయ పార్టీ నుంచి అభ్యంతరాలు వస్తే వెంటనే పరిగణనలోకి తీసుకుంటామని సీఈఓ వెల్లడించారు. జాబితా నుంచి ఓటర్ల చేర్పింపు, తొలగింపును ఎలక్టోరల్ రోల్ ఆఫీసర్ పర్యవేక్షణలో జరుగుతుందని ఈసీ వర్గాలు తెలిపాయి. ఎన్నిక తర్వాత మహారాష్ట్రలో 48లక్షల మంది ఓటర్ల చేర్పింపుపై కాంగ్రెస్ ప్రశ్నించింది కానీ సీఈఓ కార్యాలయానికి ఒకే ఒక్క ఫిర్యాదు వచ్చిందని పేర్కొన్నాయి. ఇదిలావుంటే,

మమత గురువారం మీడియాతో మాట్లాడుతూ బీజేపీపై నిప్పులు చెరిగారు. పశ్చిమ బెంగాల్‌లోని ప్రతి జిల్లాలో నకిలీ ఓటర్లను చేర్చారని, ఢిల్లీ, మహారాష్ట్ర ఎన్నికల్లో గెలిచింది ఇలానేనంటూ విమర్శించారు. ఎన్నికల సంఘం ఆశీస్సులతో నకిలీ ఓటర్ల జాబితాను బీజేపీ సృష్టిస్తోందన్నారు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, స్వతంత్రంగా జరగాలన్నారు. ఎన్‌ఆర్‌సీ, సీఏఏ పేరుతో ఓటర్ల జాబితాలో మీ పేర్లను తొలగించవచ్చు. టీఎంసీని ఓడించాలనే లక్ష్యంతో బీజేపీ ఇలాంటివి చేస్తున్నది. డేటా ఆపరేటర్లపై నిఘా పెంచాలి. వచ్చే ఏడాది జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి. నకిలీ ఓటర్ల జాబితా లేకుండా బూత్ స్థాయి నుంచి చర్యలు తీసుకోవాలి' అని మమత అన్నారు. ఓటర్ల జాబితాను పొందేందుకు ఐటీ మీడియా సెల్, పంచాయతీ కౌన్సిలర్లు, కోర్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

సాంస్కృతిక పునర్వికాసం అవసరం

- కేరా రచనలు నేటి తరానికి ఆదర్శం
- 'నా పార్టీ' గేయకావ్యం ఆవిష్కరణ సభలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: వికృత పోకడలతో కునారిల్లుతున్న నేటి సమాజానికి సాంస్కృతిక పునర్వికాసం ఎంతో అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. సీపీఐ రాష్ట్ర శాఖ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, అభ్యుదయ రచయితల సంఘం, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విశాలాంధ్ర కార్యాలయంలో ప్రముఖ అభ్యుదయ రచయిత, కమ్యూనిస్టు కవి కాగితాల రాజేశ్వర రావు 21వ వర్థంతి, 'నా పార్టీ' గేయకావ్యం పుస్తకావిష్కరణ సభ ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్సీ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి జల్లి విల్సన్ అధ్యక్షులుగా వ్యవహరించిన సభలో రాజేశ్వరరావు చిత్ర పటానికి విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి. హరినాథరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ పోరాటాల స్ఫూర్తిని నింపడంలో కాగితాల కృష్ణమూర్తి కుటుంబం అందరికి సుపరిచితమని, కమ్యూనిజం ఉద్యమాల్లో అవిశ్రాంతంగా పని చేశారని గుర్తు చేశారు. తండ్రి సాంస్కృతిక, ఉద్యమ వారసత్వాన్ని రాజేశ్వరరావు పుణికిపుచ్చుకుని అన్ని సాహిత్య ప్రక్రియల్లో మంచి పట్టు సాధించారని కొనియాడారు. విశాలాంధ్రలో పనిచేసిన సమయంలో గొప్ప నైపుణ్య విధానాన్ని తీసుకురావడానికి నిరంతరం శ్రమించారని చెప్పారు. ప్రజా నాట్యమండలి పురుడుపోసుకుంటున్న సమయంలో ఒక మణిహారంగా ఆయన నిలిచారని, అనేక ఉద్యమాలలో కాగితాల రచనలు ప్రజలను ఆలోచింపజేశాయని అన్నారు. పార్టీ ఉద్యమాలలోను, రచనా రంగంలోను వినూత్నమైన నూతన ఒరవడికి నాంది పలికిన గొప్ప మేధావి రాజేశ్వరరావు అని కొనియాడారు.

అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ 'నా పార్టీ' గేయ కావ్యాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ స్పష్టత లేని నేటి తరం రచయితలలో ఆత్మ స్థైర్యం నింపడంలో ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పని చేసి జీవితాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు. పార్టీ ఉద్యమాలను వినూత్నమైన ఒరవడితో కళలు, సాహిత్యం, వామపక్షాల భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. బాధ్యతాయుతమైన రచనలతో ఇతరులకు ఆదర్శప్రాయుడుగా కేరా నిలిచారని కొనియాడారు. సి.రాఘవాచారి ట్రస్ట్ ట్రస్టీ అక్కినేని చంద్రరావు మాట్లాడుతూ 1974లో రాజకీయ ఉద్యమంలో రాజేశ్వరరావు రచించి ఆలపించిన నా విశాలాంధ్ర పద్యం అనేకమందిని ఆలోచింపజేసిందని తెలిపారు. వేగవంతమైన రచనలలో గొప్ప పాండిత్యాన్ని జోడించడంలో కాగితాల రాజేశ్వరరావు దిట్టని కొనియాడారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ కాగితాల కుటుంబంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఆస్తులు కంటే తండ్రి ఇచ్చిన రాజకీయ వారసత్వాన్ని ఆస్తులుగా పంచుకోవడం గొప్ప విషయమన్నారు. విద్యార్థి దశలోనే పార్టీ ఉద్యమాల పట్ల ఆసక్తి కనబరిచిన వ్యక్తి కాగితాల అని తెలిపారు. పార్టీ ఉద్యమాలలో సాహితీ కుసుమాలు జాలు వారడం అనేక మందిని ఆకర్షితులను చేసిందన్నారు. అనేక గ్రంథాలను అధ్యయనం చేసి వినూత్న రచనలను అందించారని కొనియాడారు. సామాజిక అంశాలను ఇతివృత్తాలుగా తీసుకుని గేయ రచనలు చేయడం ఆయనకే సాటి అన్నారు. సాంస్కృతిక పునర్వికాసానికి నాంది ప్రస్తావన ఈ సందర్భంగా రావాలని కోరారు. చరిత్రను, వాస్తవికతను ప్రజల్లోకి తీసుకువెళ్లటమే కాగితాల రాజేశ్వరరావుకు నిజమైన నివాళి అని తెలిపారు. ప్రొఫెసర్ సి.నరసింహారావు మాట్లాడుతూ రచనలో ప్రతిభావంతుడైన రాజేశ్వర రావు అనేకులకు ఆదర్శప్రాయుడని అన్నారు. విజయవాడ ప్రజా ఉద్యమ సంగ్రామంలో ఆయన రచనలు సమైక్యవాదానికి ఊతమిచ్చాయని చెప్పారు. సాహిత్య, సాంస్కృతిక ఉద్యమ రచనలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తి నింపాలన్నారు. ఉత్తమ రచనలు భవిష్యత్ తరాలకు పుస్తక రూపంలో అందించాలని, దీనికోసం పూర్తి సహకారం అందిస్తానని ప్రకటించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజా నాట్యమండలి అధ్యక్షులు పి.చంద్ర నాయక్ మాట్లాడుతూ ఉద్యమ రచనలు చేయడంలో రాజేశ్వరరావు దిట్ట అన్నారు. ఉద్యమాలు తగ్గుతున్న ఈ రోజుల్లో ఆయన రచించిన సాంస్కృతిక అంశాలను తీసుకు రావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలపించిన శ్రామిక జనకవి కేరా కామ్రేడ్ గేయం అనేక మందిని ఆలోచింపజేసింది. అరసం నాయకులు గోలి సీతారామయ్య మాట్లాడుతూ అర్థంతో కూడిన రచనలు రాయడంలో కేరా తనకంటూ ప్రత్యేకత చాటుకున్నారని అన్నారు. ఈ సభలో కాగితాల రాజశేఖర్, ఇతర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభ విజయవంతం చేద్దాం

పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో-కాకినాడ: పిఠాపురం వేదికగా ఈ నెల14న జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేసే బాధ్యత ప్రతి ఒక్క జనసేన నాయకుడు, జన సైనికుడు, వీరమహిళ తీసుకోవాలని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్ రేట్‌తో దిగ్విజయం సాధించిన అనంతరం జరుగుతున్న తొలి ఆవిర్భావ సభ కావడంతో యావత్ దేశం చూపు పిఠాపురం సభపై ఉందని, సభను జయప్రదం చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆవిర్భావ సభ నిర్వహణ కోసం నియమించిన కమిటీలతో శనివారం కాకినాడలో ఆయన సమావేశమయ్యారు. పార్టీ నుంచి ఎన్నికయిన ఎంపీలు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జిలు, పీఓసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ 2014లో జనసేనను స్థాపించినప్పటి నుంచి ఎన్నో కష్టనష్టాలు, ఆటుపోటులను తట్టుకొని పార్టీని తన సొంత రెక్కల కష్టంతో ముందుకు నడిపారని చెప్పారు. పోటీ చేసిన 21 శాసనసభ స్థానాలు, రెండు పార్లమెంటు స్థానాలను గెలుచుకున్నామన్నారు. ముఖ్యంగా మత్స్యకారుల సమస్యలపై మత్స్యకార అభ్యున్నతి యాత్రను, రోడ్ల దుస్థితిపై గుడ్ మార్నింగ్ సీఎం సార్ అనే డిజిటల్ క్యాంపెయిన్ చేపట్టామన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి కేవలం గుంతలు పూడ్చడానికే రూ.1,600 కోట్లు ఖర్చు అయ్యాయన్నారు. ఆత్మహత్యలకు పాల్పడ్డ కౌలు రైతుల కుటుం బాలకు అండగా నిలబడ్డామన్నారు. పిఠాపురం వేదికగా నిర్వహిస్తున్న ఈ సభలో కమిటీ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు 160 మంది సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి పవన్ దిశానిర్దేశం చేస్తారన్నారు. ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యే పంతం నానాజీ, తోట సుధీర్, తుమ్మల రామస్వామి, శాసన సభలో ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, అరవ శ్రీధర్, జనసేన ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు, పార్టీ నేతలు, మహిళా నేతలు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము రూ.8.43 లక్షలతో సచివాలయ ఉద్యోగి ఉడాయింపు

పోలీసులకు అధికారుల ఫిర్యాదు

విశాలాంధ్ర-దాచేపల్లి: పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో ఓ సచివాలయ ఉద్యోగి రూ.8.43 లక్షలతో ఉడాయించాడు. ఈ విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. దాదాపు 200 మంది లబ్ధిదారులకు ఆ నగదుతో పింఛన్ అందజేయాల్సి ఉంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... దాచేపల్లి మూడో సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అండ్ అడ్మిన్ సంపతి లక్ష్మీప్రసాద్ ... పింఛన్‌దారులకు నగదు అందజేసేందుకు శుక్రవారం బ్యాంక్ నుంచి నగదు తీసుకొచ్చాడు. అందులో తాను పంచాల్సిన రూ.4.20 లక్షలను తన వద్ద ఉంచుకుని అంబేద్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త ఆదిలక్ష్మికి లబ్ధిదారులకు పంచేందుకు అదే రోజు సాయంత్రం రూ.4.23 లక్షల నగదు ఇచ్చాడు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో లక్ష్మీప్రసాద్.. ఆదిలక్ష్మికి ఫోన్ చేసి నీకిచ్చిన డబ్బు కావాలి... తిరిగి ఉదయాన్నే పింఛనుదారులకు పంపిణీ చేసే సమయానికి సర్దుబాటు చేస్తానని చెప్పి ఆమె ఇంటికెళ్లి డబ్బు తీసుకున్నాడు. నమ్మిన ఆమె తనకిచ్చిన నగదు అతడికిచ్చింది. ముందు చూపుతో ఆమె జాగ్రత్త పడింది. ఫోన్‌లో తనను డబ్బు అడిగిన విషయాన్ని వాయిస్ రికార్డ్ చేసింది. డబ్బు తీసుకున్నట్లు అతడు వాట్సప్ మేసేజ్ కూడా పెట్టాడు. విచారణ సమయంలో అధికారులకు వాటిని చూపడంతో ఆమెకు ఇబ్బందితప్పింది. తాను పంచాల్సిన డబ్బుతో పాటు ఆమెకిచ్చిన నగదు కలిపి రూ.8.43 లక్షలతో ఉడాయించాడు. విషయం తెలుసుకుని ఖంగుతిన్న అధికారులు వెంటనే రంగంలోకి దిగి విచారించారు. గురజాల డివిజన్ అభివృద్ధి అధికారి ధీరావతు గబ్రూనాయక్, నగర పంచాయతీ కమిషనర్ ఎంపీ అప్పారావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పప్పుల రత్నం, కేసానపల్లి సచివాలయ కార్యదర్శి స్వామి నాయక్, అంగన్‌వాడీ కార్యకర్త ఆదిలక్ష్మీతో పాటు సిబ్బందిని విచారించి వారి దగ్గర స్టేట్‌మెంట్ తీసుకున్నారు. డబ్బు పంపిణీ చేసిన రికార్డులను పరిశీలించారు. ఈ విషయమై డీఎల్‌డీఓ గబ్రూనాయక్ మాట్లాడుతూ నిందితుడు సంపతి లక్ష్మీప్రసాద్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అతడిపై క్రమశిక్షణ చర్యలకు కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. కలెక్టర్ అనుమతితో లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

పోసానికి అస్వస్థత... రిమ్స్‌లో చికిత్స

విశాలాంధ్ర-కడప: అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న వైసీపీ నాయకుడు, సినీనటుడు పోసాని కృష్ణమురళి అస్వస్థతకు గురయ్యారు. ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ వికాస్ జైలులో పోసానిని పరీక్షించేందుకు వెళ్లగా... తనకు ఛాతిలో నొప్పిగా ఉందని డాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డాక్టర్ వికాస్ రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ఈసీజీ, బ్లడ్‌టెస్ట్‌లు చేసి నార్మల్‌గా ఉన్నట్లు చెప్పారు. అయితే తాను కార్పొరేట్ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్‌ను కోరడంతో పోసానిని రిమ్స్‌లో 2డీ, ఎకో పరీక్షలు నిర్వహించేందుకు రిమ్స్‌లోని గుండె నిపుణుల వద్దకు తరలించినట్లు డాక్టర్ తెలిపారు.

మెరుగైన చికిత్స అందించాం: సీఐ

పోసానికి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించామని రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రాజంపేట నుంచి కడప రిమ్స్‌కు తరలించి మరోసారి మెరుగైన చికిత్స అందించామని పేర్కొన్నారు. వైద్య పరీక్షలు అనంతరం రాజంపేట సబ్ జైలుకు తరలిస్తామని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.